

ఏప్రిల్ 73 ఒకరూపాయి




EFKAY

సచిత్ర మాస పత్రిక

7 A. శివాజీ స్ట్రీట్
టి. నగర్, మద్రాసు-17

విడి ప్రతి వెల
ఒక రూపాయి

ఏడాది చందా
పన్నెండు రూపాయలు

సంపుటి 11
ఏప్రిల్ 1973
సంచిక 3

సంస్థాపకులు :
కీ. శే. వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్ :
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

Edited & Published by V. Leelavaty Raghavaiah, 7-A. Sivaji Street, Madras-17 and Printed by B. V. Narasimha Rao, at Sri Krishna Chitra Printers 7, NageswaraRao Road, Madras-17

ముఖ చిత్రం :
అన్నపూర్ణా సినీ ఎంటర్ ప్రైజెస్ వారి
"శా ర ద"



తరాలు మారినా తాత అంశాన్నే పుడతాడు మనవడు.
ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్
తాత-మనవడు
నిర్మాత కె.రాఘవ
కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం దాసరి నారాయణరావు
సంగీతం: రమేష్ నాయుడు
TARAKARAMA
Rama Rao Arts

తొలిమాట

కొత్త సంవత్సరం వచ్చింది దేశంలో ప్రశాంతత ఏర్పడుతున్నది. 'ప్రమాదీచ' ప్రమాదాలను అధిగమించి ప్రమోదాన్ని కల్గించాలని కోరుకుందాం. మా పాఠకులకి, ప్రకటన కర్తలకి, శ్రేయోభిలాషులకి, ఏజంట్లకి నూతన సంవత్సర శుభాకాంక్ష అందజేస్తున్నాం - స్వీకరిస్తారు కదూ

* * *

ఈనెల ఉత్తరాల శీర్షికలో శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావుగారు వ్రాసిన ఉత్తరం మాకు సహేతుకం అనిపించింది పాఠకులు మా అభిప్రాయంతో ఏకీభవిస్తారని ఆశిస్తాం.

వె. వెంకటేశ్వర్లు

ఉత్తరాలు

సంపాదకులకు నమస్కారం,

గత మూడు నెలలుగా ప్రత్యేకాంధ్ర రాష్ట్రసాధన నిమిత్తం ఆంధ్రదేశంలో జరుగుతోన్న ఉద్యమంవల్ల, మిగతా విషయాలను పరిశీలించటానికి ఏకాగ్రత కుదరక జ్యోతి జనవరి సంచిక యింతవరకూ చూడలేదు. నా జవాబు కోరుతూ మీరు రాసిన ఉత్తరం యీ రోజే అందాక (యిరవై రోజుల క్రితం ఓ ఉత్తరం రాశానని రాశారు. అది నాకు అందలేదు) జ్యోతి జనవరి సంచిక తెప్పించి చూశాను. అందులో పైడిపాలగారి జవాబులు చదివాక నా అభిప్రాయాన్ని ఇస్తున్నాను.

'తల్లీ-పిల్లా' కథ మొదలు 1954 లో ఓ మాస పత్రికలో ప్రచురించబడింది. తర్వాత కొమ్మూరి కథలు అనే శీర్షికతో ఆదర్శ గ్రంథమండలివారు ప్రచురించిన కథావాహిని సీరీస్‌లో వచ్చింది. తదనంతరం కొన్ని పంథాలజీస్‌లో సంకలనం చేయబడింది. కాలగమనం కొద్దీ మా ప్రచురణ కర్తలు ప్రచురిస్తూ వచ్చిన, నా కథాసంపుటాలలో చేర్చబడుతూ వచ్చింది. ఏడెనిమిది భారతీయ భాషలలోకి అనువదించబడింది. ఇది దాని చరిత్ర.

తనను ప్రభావితంచేసిన 'తల్లి మనసు' అనే కథ 1969-70 లో వచ్చిందని పైడిపాలగారు రాశారు. కాబట్టి ఆ కథ 'తల్లీ-పిల్లా' ఆధారంగా రాయబడిందనటం నిర్వివాదాంశం.

'చిచ్చు(ను) రగిల్చిన చీకటి' కథకూ, నా 'తల్లీ-పిల్లా' కథకూ చాలా పోలికలు వున్నట్లు పలువురు పాఠకులు నాకు ఉత్తరాలద్వారాగానీ, ముఖతఃగానీ సూచించిన మీదటే నేనా కథ చదవటం తటస్థించింది ఆ కథ నా కథ నాధారం చేసుకుని, కథా వస్తువులోనే గాకుండా, మిగతా విషయాలలో కూడా చాలా చాలా స్వామ్యం వున్నట్లు నేనూ అభిప్రాయపడ్డాను. ఇప్పటికీ అభిప్రాయపడుతున్నాను.

కాని పైడిపాలగారి ఆవేదన నేనర్థం చేసుకున్నాను. ఆ యితివృత్తం తనకు స్వతఃహ తట్టిందికాదనీ, 'తల్లి మనసు' అనే కథ చదివాక ఎవరో Inspire అయి తనకు చెప్పగా తాను రాశానని వారు చెబుతున్నారు. కాబట్టి యీ మాటలు నేను విశ్వసిస్తున్నాను. వారి చిత్తశుద్ధిని శంకించటం లేదు. స్వబుద్ధికి తోచినదిగాన యితరులు చెప్పినవి రాయటం పొరపాటని శ్రీ పైడిపాల గుర్తించటం ముదావహం.

ఈ సందర్భంలో నాకు పెర్సనల్‌గా ఉత్తరాలు రాసిన వారికీ, పత్రికాముఖంగా అభిప్రాయం తెలియజేసిన వారికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఇంక దీన్నిగురించి చర్చ అనవసరం కాబట్టి యింతటితో ఆపుచేయటం మంచిదని కూడా భావిస్తున్నాను.

కొమ్మూరి వేణుగోపాలరావు

ఘోస్ట్ లవ్



రమణమూర్తి బుద్ధి తెలిసి నప్ప పడలేదు. ఫలానా అమ్మాయిని
ట్నుంచి ఏ ఆడపిల్ల వెంట ప్రేమిస్తున్నట్లు తన మనసైనా

అతనికి చెప్పలేదు. బుద్ధిగా కాలేజీలో చదువు కున్నాడు. అంతకంటె బుద్ధిగా సెప్టెంబర్లకు వెళ్ళకుండా పరీక్షలన్నీ పాస య్యాడు. మార్కులు చూపించి యూనివర్సిటీలో యమ్మెస్సీ సీటు కొట్టేశాడు. అతనితో చదువు కున్న వాళ్ళలో కొందరు యింకా 'కమ్ సెప్టెంబర్' పాట పాడు తున్నారు.

రమణమూర్తికి 'ఇది తక్కువ' అని లేదు. ఏభై ఎకరాల మాగాణికి యజమాని కొలతలేని గౌరవ మర్యాదలకు మారు పేరయిన రామనాథంగారు అతనికి తండ్రి. మందిరంలో మహాలక్ష్మిలాంటి మహా లక్ష్మమ్మగారు అతనికి తల్లి. అన్నిపనులు చేసి పెట్టటానికి నౌకర్లు ఉన్నారు. సలహా లివ్వటానికి మంచి స్నేహితులున్నారు. కావాలనుకుంటే కొత్త కారు కొని రోజూ యూనివర్సిటీకి రాగలడు. అది యిబ్బంది అనుకుంటే యూనివర్సిటీకి దగ్గరలో ఓ గెస్టుహౌస్ కట్టించుకొని ఉండగలడు. ఇలాంటివి యింకా ఎన్నో చేయగలడు. అతనికి చాల చాల అర్హత లున్నాయి. కానీ, అతను బుద్ధి పూర్వకంగా ఏ అమ్మా యిని ఏడిపించలేదు. ప్రేమించడంలాంటి దేమీ చేయలేదు.

కానీ, ఆ రోజు ఆ అమ్మాయిని చూసి నప్పుడు రమణమూర్తికి ప్రేమించడం అంటే ఏమిటో తెలియక పోయినా. 'ప్రేమంటే యిదేనేమో?' అని తెలిసి పోయింది.

ఆ రోజు సాయంత్రం దోసిట్లో ముత్యాలు వెదజల్లు తున్నట్లు సన్నని చిను కులు రాలుతున్నాయి. నల్లంచు చీర కట్టు కున్న ఆకాశం ప్రియురాలి మందహాసంలా మెరిసిపోతుంది. అందమైన అమ్మాయి తనను ప్రేమిస్తుందని తెలిసిన కాలేజీ విద్యార్థిలా గాలి రివ్వున వీస్తోంది.

రమణమూర్తి చేతిలో ఉన్న కెమిస్ట్రీ రికార్డు గుండెల దగ్గర దాచుకుంటూ వడి వడిగా నడుస్తున్నాడు. తను తడిసినా ఫర్వా లేదు. తన రికార్డు తడవ్వకూడదు. తన క్రాపు చెరిగితే తను బాధ పడడు. రికార్డులో అక్షరాలు చెరిగితే బాధ పడిపోతాడు. తన ప్యాంట్ ఫోల్డింగ్స్ నలిగినా తను ఫీల వ్వడు. రికార్డుకి వేసిన అట్ట నలిగితే తను ఫీలయి పోతాడు. ఒక మాటలో చెప్పా లంటే రికార్డును తన ఆరో ప్రాణంగా చూసుకుంటాడు.

నోటీసు యివ్వకుండా వచ్చే వర్షం అంటే తనకు భలే చిరాకు. 'ఈరోజు బస్సులో పోయి ఉండాల్సింద'నుకున్నాడు మనసులో. సాయంత్రం కాలేజీ విడిచిపెట్ట గానే ఇంటికి సరదాగా నడిచివెళ్ళడం అంటే తనకెంతో యిష్టం. ఆ రోజంతా

తను విన్న కెమిస్ట్రీ పాఠాల్ని ఎల్లి వేసుకుంటాడు. ఈక్వేషన్లు రిపీట్ చేసుకుంటాడు. ప్రాబ్లెమ్స్‌కి క్లూస్ వెదుకుతాడు. తోవలో కూడ ఓ క్షణం వృధాపోనివ్వడు.

జేమ్సుబాండ్ సిన్మాలో ఫైటింగ్‌లా వర్షం క్లయిమాక్స్ చేరుకుంది. రమణమూర్తి దాదాపు వంగిపోతూ నడుస్తున్నాడు. కాసేపు ఆగిపోవటానికి దగ్గరలో ఏ షెల్టరూ కనిపించలేదు. రెండు ఫర్లాంగులు నడిస్తేగాని బస్సుస్టాపు లేదు. తనకి ఏడుపు వచ్చినంత పనయింది. తను ప్రాక్టికల్స్‌లో ప్రత్యేకించి గుర్తింపబడటానికి కారణం తన రికార్డు. ఆ రికార్డు తడిసిపోతే? ఏడాది పొడుగున తను రాస్తున్న ఎక్సర్‌సైజులు ముద్దయిపోతే? ... ప్రొఫెసర్స్‌కి తనమీద యింప్రెషన్ పోతుంది. తనకు మంచి మార్కులు యివ్వరు. క్లాసు పోతుంది.

రమణమూర్తి తల పూర్తిగా తడిసిపోయింది. స్లాక్ వెనకంతా తడిసిపోయింది. మరి కాసేపట్లో విలన్‌లా వర్షం తన రికార్డుమీద విరుచుకుపడుతుంది. రికార్డు తడిసి పోతుంది. ఎవరైనా గొడుగు మనిషి వచ్చినా బావుణ్ణనుకున్నాడు.

అతను తలెత్తి చూశాడు. అదృష్టం బావుంది. అతని వెనకే ఓ అమ్మాయి. గొడుగు పట్టుకొని అడుగులో అడుగు వేస్తూ చీర కుచ్చెళ్ళు కదలకుండా నడుస్తోంది. అతను ఆగిపోయాడు.ఆ అమ్మాయి దగ్గరకు వచ్చింది.

“ఎక్స్‌క్యూజ్మీ.... [illegible] షెల్టర్ మేడమ్?” ఆడపిల్లని అతను సంశయించలేదు.

ఆమె మాట్లాడలేదు.

“క్షమించండి....నా రికార్డు తడిసిపోతుంది....బస్‌స్టాపు వచ్చేవరకు....” ప్రాధేయపడ్డాడు.


ఆమె మళ్లా మాట్లాడలేదు.

“మీకు అభ్యంతరంగా ఉంటే యీ రికార్డు మీరు పట్టుకోండి....నేను తడిసినా ఫర్వాలేదు....ప్లీజ్....” ఈసారి చాల జాలిగా అడిగాడు. ఆమె యీసారి కూడ మాట్లాడలేదు. ఆగిపోయింది. చేతిలో గొడుగు ముందుకు చాచింది. రమణమూర్తి గొడుగులోకి వెళ్లాడు.

“థాంక్స్.... థాంక్యూ .... థాంక్యూ సో మచ్....” ఒకసారి కాదు వరసగా మూడు సార్లు థాంక్స్ చెప్పాడు. ఆమె చిన్నగా నవ్వింది, అన్ని థాంక్స్ ఎందుకన్నట్లు. ఆమె ముందుకు నడిచింది.

రమణమూర్తి మనసు కుదుటపడింది

వర్షం గొడుగుమీద లయవేస్తుంది. ఆ అమ్మాయి నీటి మీద తామరపువ్వు తేలిపోతున్నట్లు అతి నాజూకుగా నడుస్తుంది. రమణమూర్తి తలెత్తి ఓ క్షణం ఆమె ముఖంలోకి చూశాడు. అందమైన అమ్మాయి. అప్సరసలాంటి అమ్మాయి. అతను తత్తరపడిపోయాడు. ఎప్పుడూ



అంత అందమైన అమ్మాయిని చూడలేదు. ఆ అమ్మాయి పక్కను నడవటానికి 'ఇన్ఫిరియారిటీ' ఫీలయిపోయాడు.

ఇప్పుడతను రికార్డు గురించి ఆలోచించడం లేదు. పదేపదే ఆ అమ్మాయిని చూడాలని ఆరాటపడుతున్నాడు. ఆమెతో మాట్లాడాలని ఉబలాట పడుతున్నాడు. కానీ, అతనికి ధైర్యం చాల్లేదు. ఏ ప్రశ్నా అతని పెదాలుదాటి పైకి రాలేదు. 420 సినిమాలో రాజకపూర్‌నూ, నర్గీస్‌నూ ఊహించుకుంటూ నడిచాడు.

బస్‌స్టాపు వచ్చింది. రమణమూర్తి 'థాంక్సండీ' అని చెప్పి బస్ షెల్టర్‌లోకి వెళ్ళిపోయాడు. ఆమె మాట్లాడలేదు. మాట్లాడితే ముత్యాలు రాలిపోతాయన్నట్టు చిన్నగా నవ్వింది. ఆ నవ్వు అతన్ని గిలిగింతలు పెట్టింది.

మరి కాసేపట్లో పదమూడో నంబరు బస్సు రావడం – ఆ అమ్మాయి వెళ్ళిపోవడం జరిగిపోయాయి.

* * *

ఆ అమ్మాయిని చూసినప్పట్నుంచి రమణమూర్తి మనసు రమణమూర్తి మనసులా ఉండలేకపోయింది. ఆ మనసులో ఏదో తియ్యటిబాధ నిండిపోయింది. ఆమె ప్రేమను పొందాలనే తపన....ఆమె మళ్లా కనిపించదేమో అనే దిగులు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. పరీక్ష హాల్లోకి వెళ్ళేముందు ఎలాంటి ప్రశ్నలు వస్తాయని అతనెప్పుడూ ఆలోచించలేదు. భయ

పడలేదు. ఇప్పుడు అతనిలో భయమూ ఆలోచనలూ కలగాపులగం అయి పోయాయి.

సాయంకాలం కాలేజీనుంచి సరాసరి నిన్నటి బస్ స్టాపు చేరుకున్నాడు. రమణ మూర్తి. అతనికి తెలియకుండానే ఆ అమ్మాయిని మరోసారి చూడాలనే కోరిక అతని మనసులో మంచులా పేరుకుంది. ఆ అమ్మాయి బస్ స్టాపులో కనిపించ లేదు. వాచీకేసి చూశాడు. అతని ఆతృతను గమనించని వాచీ అయిదే చూపించింది. ఆ అమ్మాయి వచ్చేసరకు అక్కడే ఉండా లని నిశ్చయించుకున్నాడు.

మరో పావు గంటలో ఆ అమ్మాయి వచ్చింది. రమణమూర్తి వేపు చూసి నిన్నటి మధుర స్మృతిని గుర్తుచేస్తున్నట్లు చిరునవ్వు నవ్వింది. మైక్రోస్కోపు కింద ఉంచి చూస్తేగాని కనిపించనంత చిన్నగా నవ్వేడు. రమణమూర్తి ఆమెతో ఏదోలా మాట్లాడాలనుకున్నాడు. కానీ, ఏదో పిరికి తనం అతని ప్రయత్నానికి అడ్డు తగిలింది. నిన్న రికార్డు తడిసిపోతుందనే భయంతో తను ఆ అమ్మాయితో మాట్లాడేడు. కానీ. ఈ రోజు తనెలా మాట్లాడగలడు? తను కావాలని మాట్లాడినా సభ్యతగా ఉంటుందా? అనుకున్నాడు. అనుకుంటూనే మనసులో ఓ మాస్టరు ప్లాన్ గీసుకున్నాడు.

ఆ రోజు మొదలు రమణమూర్తి సాయంత్రం అయిదయ్యేసరికి బస్స్టాప్కు రావడం అలవాటు చేసుకున్నాడు. అతను వచ్చిన పావుగంటకు ఆ అమ్మాయి వస్తుంది. అతని వేపు చూసి చిన్నగానవ్వు తుంది. అతను కళ్ళతోనే పలకరిస్తాడు. ఆమె తల వంచుకొని కాలివేలితో గిరులు గీస్తుంది. అతను మరెప్పైనా చూస్తే ఆమె అతనివేపే చూస్తుంది. అతను యిబ్బంది పడిపోతాడు. మరి కాసేపట్లో బస్సురావడం ఆమె వెళ్ళిపోవడం జరిగిపోతాయి. నెల రోజుల తర్వాత రమణమూర్తికి అర్థం అయిపోయింది–ఆ అమ్మాయికి కూడ తన మీద 'యింటరెస్ట్' ఉందని.


ఒక రోజు రమణమూర్తి ఆ అమ్మాయి వచ్చిన మరో పావుగంటకు బస్స్టాపుకు వచ్చాడు. ఆమె ఎప్పటిలానే నవ్వింది.

"ఏమండీ....నంబర్ లెవెన్ వెళ్ళి పోయిందా?" రమణమూర్తి చాల ధైర్యాన్ని కూడ దీసుకొని అడిగాడు.

"ఊహుఁ!... ఆ బస్సు రాలేదండి." ఆ అమ్మాయి నోటినుంచి ముత్యాలు రాలి పోయాయి. అతనికి యింకాస్త ధైర్యం వచ్చింది.

"ఏమండీ... మీ రెక్కడైనా ఉద్యోగం చేస్తున్నారా?" మరో పదినిమిషాలతర్వాత అడిగాడు. ఆమె చేతిలో టిఫిన్ బాక్సు. వీక్లీసూ చాల రోజులనుంచి చూస్తున్నాడు.

"అవునండీ....మీరు చదువు తున్నారా?" ప్రశ్నకు ప్రశ్న. ఆమె నోష ల్గా అంది.



రమణమూర్తి 'యమ్మెస్సీ' అని గర్వంగా చెప్పాడు.

ఆ రాత్రి రమణమూర్తి చాలసేపటి వరకు నిద్రపోలేదు. ఏదో ఘన విజయం సాధించినట్లు అతని మనసంతా బరువయి పోతుంది. మర్నాడు తన క్లాస్‌మేట్ సుబ్బారావుతో జరిగిన విషయం చెప్పాడు. కాలేజీలోనే ప్రేమంటే ఏమిటో తెలుసుకున్న సుబ్బారావు, యూనివర్సిటీలో చదువుతూ ప్రేమంటే ఏమిటో తెలుసుకోవాలని ప్రయిత్నించడేమి చెప్మా అని రమణమూర్తిపై బోలెడంత పిటీ చూపించేవాడు. తనలా ప్రయోజకుడవుతున్నాడని గ్రహించిన సుబ్బారావు, రమణమూర్తిని కౌగిలించుకున్నంత పనిచేశాడు. తర్వాత రమణమూర్తి తన మనసు దోచుకున్న ఆ అమ్మాయిని సుబ్బారావుకిచూపించాడు.

"సో బ్యూటీఫుల్ మూర్తీ!...షి యీజ్ జస్ట్ లైక్ 'హేమామాలినీ" అని సుబ్బారావు కాంప్లిమెంట్ చేశాడు. రమణమూర్తి భానుమూర్తిలా వెలిగిపోయాడు.

ఓ చక్కని కథలో అందమైన మలుపులా రమణమూర్తికీ ఆ అమ్మాయికీ మధ్య స్నేహం ఏర్పడింది. రమణమూర్తి ఏదో విషయాన్ని కల్పించుకొని మాట్లాడేవాడు. ఆమె కూడ మాట్లాడేది. అతను కాలేజీ నుంచి రావడం లేటయినా ఆమె వెళ్ళి పోయేది కాదు. అతను వచ్చేవరకు ఉండేది. పైగా 'ఈ రోజు మీ రెండుకు ఆలస్యం అయిపోయారు?" అని అడిగేది.

రమణమూర్తి—'నా తో సిన్మాకు

వస్తారా?....సరదాగా బీచికి రాకూడదూ? మీతో ఏకాంతంగా మాట్లాడనిస్తారా?' అని ఎప్పుడూ అడగలేదు. తొందరపడలేదు. ఓసారి—'మా యూనివర్సిటీలో ఎగ్జిబిషన్ చూడండి' అని మాత్రం ఆమెతో చెప్పాడు.

ఆ అమ్మాయి ఎగ్జిబిషన్ చూడటానికి వచ్చింది.

యాటమిక్ స్ట్రక్చర్ని విజిటర్స్కి ఎక్స్ప్లెయిన్ చేస్తున్న రమణమూర్తికి—"ఒరేయ్, మీ హేమామాలినీ వచ్చింది రోయ్" అని సుబ్బారావు చెప్పాడు. రమణమూర్తి సంతోషానికి హద్దుల్లేక పోయాయి. అతను ప్రొఫెసరుగారి అనుమతి తీసుకొని ఆ అమ్మాయికి, ఆమెతో వచ్చిన అమ్మాయిలకు ఎగ్జిబిషన్ అంతా చూపించాడు. కాంటీన్లో టిఫిన్లూ, డ్రింకులూ యిప్పించాడు. ఆ రోజే అతనికి తెలిసింది—'ఆ అమ్మాయి పేరు శకుంతల' అని. చాల అందమైన పేరనుకున్నాడు.

ఆ అమ్మాయి లంతా వెళ్ళిపోయిన తర్వాత—"ఒరేయ్ మూర్తీ! నువ్వదృష్ట వంతుడివోయ్....ఆలస్యం కాకుండా మీ హేమామాలినికి నీ ప్రేమను తెలియజెయ్" అని సుబ్బారావు అన్నాడు.

"ఎలా ప్రొసీడ్ అవ్వాలో తెలియటం లేదురా" రమణమూర్తి అమాయకంగా అన్నాడు. సలహా యిమ్మని అడిగాడు.

"ఒరేయ్ ఫూల్....నువ్వా అమ్మాయిని ప్రేమిస్తున్నట్లు ఓ లవ్ లెటర్ రాసి యివ్వరా...."

"థాంక్యూ....మైడియర్ అడ్వైజర్... థాంక్యూ...."

*　*　*

'మీకు బుద్ధుందా?....మీరేదో మంచి వారని అభిమానంగా మాట్లాడతారని అనుకున్నాను. ఇలా ప్రేమ లేఖలు రాస్తారని అనుకోలేదు. అసభ్యతగా ప్రవర్తిస్తారని ఊహించలేదు....ఛీ ఛీ...' అని శకుంతల చీదరించుకుంటుందని రమణమూర్తి భయపడి ఉత్తరం రాసి ఆమెకు యివ్వలేదు. చాల చాల ఆలోచించాడు. బాగా ఆలోచిస్తేగాని ఏ నిర్ణయం తీసుకోలేడు.

ఇంతలో పరీక్షలు ముంచుకు వచ్చాయి. రమణమూర్తి పరీక్షల హడావుడిలోపడి ఆ ప్రయత్నం పూర్తిగా మానుకున్నాడు. అయితే, శకుంతలను చూడకుండా ఉండలేక పోయేవాడు. ప్రతిరోజు బస్టాప్లో కలిసేవాడు. ఆమెతో కాసేపు మాట్లాడేవాడు.

పరీక్షలు అయిపోయాయి. సుబ్బారావు వాళ్ళ ఊరు వెళ్ళిపోతూ రమణమూర్తిని హెచ్చరించాడు—'తను తిరిగి వచ్చేసరికి హేమామాలినీ రమణమూర్తీ కలిసి సినిమాలకీ షికార్లకీ వెళుతూ ఉండాలని.'

*　*　*

ఆ రోజు శనివారం.

రమణమూర్తి ట్రిమ్ గా తయారయ్యాడు.

క్రిందటి రాత్రి కష్టపడి రాసిన ఉత్తరాన్ని మరోసారి చదువుకున్నాడు.

'శకుంతలగారికి,

తొందర పడి ఉత్తరం రాస్తున్నానని మీ రనుకుంటే నన్ను క్షమించండి. మొదటిసారి మిమ్మల్ని ముత్యాలవానలో చూశాను. తొలి చూపులోనే నన్ను దోచుకున్నారు. మీ నుదుటిమీద జీరాడే ముంగురుల్ని సవరించాలనీ, మీ చెక్కిళ్ళలో నన్ను నేను చూసుకోవాలనీ, మీ చిరునవ్వులు నా హృదయంలో దాచుకోవాలనీ ఆశలు పెంచుకున్నాను. మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీరు ఔనంటే మిమ్మల్ని 'నా శకుంతల'గా చేసుకుంటాను.

మీ అంగీకారాన్ని తెలుపుతూ రేపు అంటే సోమవారం యిక్కడే ఇదే సమయంలో కనిపించాలి. మామూలుగా కాదు. మీ నల్లంచు తెల్లచీరలో–మీ అందమైన చిరునవ్వుతో.

—రమణమూర్తి'

ఉత్తరాన్ని మడతపెట్టి పుస్తకంలో దాచాడు. హుషారుగా ఈలవేసుకుంటూ బస్టాపు వేపు నడిచాడు.

రమణమూర్తి శకుంతలతో ఆమాటా ఈమాటా మాట్లాడేడు. తన కాలేజీకి రేపట్నుంచి సెలవులన్నాడు తన క్లాస్‌మీద డౌటు అని చెప్పాడు ఈ మధ్య తనకు చదువు మీద ధ్యాస పోతుందన్నాడు. తనకూ ఉద్యోగం చేయాలనిపిస్తుందని చెప్పాడు అదన్నాడు. ఇదన్నాడు అతను చెప్పిన ప్రతిమాటకు శకుంతల నవ్వింది. అతి మెత్తగా నవ్వింది

శకుంతల బస్సెక్కేముందు—"ఈ పుస్తకం తీసికెళ్ళి చదవండి" అంటూ రమణమూర్తి తన చేతిలో ఉన్న పుస్తకం ఆమెకు అందించాడు. శకుంతల అతని ప్లాన్ పసిగట్టినట్టుంది. ఆశ్చర్యపోలేదు. మామూలుగా పుస్తకం తీసుకుంది.

రమణమూర్తి మనసు తేలికపడింది.

సోమవారం సాయంత్రం ఎప్పుడు వస్తుందా అని రమణమూర్తి ఎదురు చూశాడు. ఎదురు చూసిన సోమవారం వచ్చింది. సాయంత్రం అయింది రమణమూర్తి బస్టాపుకు వెళ్లాడు శకుంతల కనిపించలేదు. అరగంట గంట రెండు గంటలు శకుంతల రాలేదు. రమణమూర్తి బాధ పడిపోయాడు శకుంతల ఎందుకు రాలేదు? ఆమె తనను ప్రేమించడం లేదా? తను తొందరపడ్డాడా? అనేకమైన ఆలోచనలు అతన్ని అల్లరి చేశాయి. చివరకు ఏదో నిర్ణయానికి రాబోయాడు. అంతలో శకుంతల వచ్చింది. మామూలుగా కాదు. నల్లంచు తెల్లచీరలో అందమైన చిరునవ్వుతో అంటే శకుంతల తనను? రమణమూర్తి సంశయాలన్నీ గాలిలో కలిసిపోయాయి.

"థాంక్యూ థాంక్యూ శకుంతల గారూ." రమణమూర్తి మనసులో ఓ కొత్త ఆనందం ఉరకలు వేసింది

"మీ పుస్తకం తీసుకోండి" అని శకుంతల తన చేతిలో ఉన్న పుస్తకం రమణమూర్తికి అందించింది.

"నేను తొందరపడితే క్షమించండి." పుస్తకం తీసుకుంటూ అన్నాడు, రమణమూర్తి.

శకుంతల గడుసుగా అంది.

"ఆ మాట మీ ఉత్తరంలో రాశారు."

రమణమూర్తి ఆమె నవ్వుతో శృతి కలిపాడు.

"ఈ నల్లంచు తెల్లచీర మీకెంతో అందంగా ఉంటుంది." మళ్ళా రమణమూర్తి మాట్లాడేడు.

"నాకు టైం అవుతుంది....వెళతాను..." శకుంతల మాట మారుస్తూ అంది.

"అన్యాయం....మీరు వచ్చి పదినిమిషాలు కాలేదు ..తొందరపడుతున్నారు."

"ఈరోజు ఆఫీసులో ఆలస్యం అయింది. ఇంటిదగ్గర చూస్తూ ఉంటారు."

"మరి....మీ అభిప్రాయం....ఐ మీన్ మీ రిప్లయ్...." రమణమూర్తి కిప్పుడు భయంలేదు. చాల చనువుగా అడిగాడు.

అతని చేతిలో ఉన్న పుస్తకం వేపు చూసి—'అందులో ఉంద'ని శకుంతల కళ్ళతో చెప్పింది.

గుర్రుపెట్టుకుంటూ వచ్చిన పదమూడో నంబరు బస్సెక్కి శకుంతల వెళ్ళిపోయింది.

* * *

మూర్తిగార్కి,

మీరు నిజంగా తొందరపడ్డారు. నా గురించి మీకు తెలిసి ఉంటే మీరు నాకు ఉత్తరం వ్రాసేవారు కాదు. మీరూహించుకుంటున్నట్లు నేను పెళ్ళికాని అమ్మాయిని కాదు. నాకు చిన్నతనంలోనే మహాకరితో పెళ్ళి జరిగిపోయింది. కానీ, నాకు ఊహ తెలిసేసరికి అతను చనిపోయారు. జీవితం అంటే ఏమిటో తెలియని రోజుల్లోనే నా జీవితం మారిపోయింది.

ప్రస్తుతం నేను మా అన్నయ్య - వదినతో ఉంటున్నాను. వాళ్ళే నాకు చదువు చెప్పించి ఉద్యోగం చేయిస్తున్నారు. సాంప్రదాయాలూ, కట్టుబాట్లూ—వీటినికాదని నన్నెవరు పెళ్ళి చేసుకుంటారు? నాకా ఆశ లేదు.

మీరంటే నాకెంతో యిష్టం. అలా అని మీతో అబద్ధం చెప్పి మిమ్మల్ని మోసం చేయలేను. అందుకే మీతో నిజం చెప్పాను. మీరు ధైర్యంగా నన్ను పెళ్ళి చేసుకోగలరా ? నా జీవితాన్ని మార్చగలరా ? అందుకు మీరు సిద్ధపడితే నా కభ్యంతరం లేదు. మిమ్మల్ని ప్రేమిస్తాను. జీవితాంతం మీ శకుంతలగా ఉండిపోతాను.

—శకుంతల.'

రమణమూర్తి మనసు కెవ్వుమంది. తను ఊహించని జవాబు అది. తను ఎన్నో ఊహలతో తెరచిన ఉత్తరంలో తనను గాయపరచే కథ ఉంది. తనకు ప్రేమంటే ఏమిటో తెలియదు. శకుంతలను చూసినప్పుడే తనలో మార్పు కలిగింది. శకుంతలను సొంతం చేసుకోవాలని, ఆమెను ప్రేమించాడు. తన తల్లిదండ్రులతో చెప్పి శకుంతలను పెళ్ళి చేసుకోవాలని ఆశలు పెంచుకున్నాడు. కానీ, అనుకోని విధంగా తన ప్రేమ కథ అడ్డం తిరుగుతుందని కలలో కూడ ఊహించలేదు. తను ప్రేమించిన అమ్మాయి బాల వితంతువు అని తెలిసేసరికి తనకేదో షాక్ తగిలినట్లయింది. తను సహించలేకపోయాడు.

శకుంతల మీద తనకున్న ప్రేమను



చంపుకోలేడు. అలా అని ఆమెను పెళ్ళి చేసుకునే ధైర్యం తనకు లేదు. చీకటిలో వడుస్తున్న ఓ అమ్మాయిని వెలుగులోకి తీసుకు రావడం పెద్ద త్యాగం కావచ్చు. కానీ, అలాంటి త్యాగం ఎంతమంది చేయ గలరు? శకుంతలను పెళ్ళి చేసుకోవటానికి తను సిద్ధపడినా తనవాళ్ళు యిష్టపడతారా? శకుంతలకు రెండో పెళ్ళి అంటే అంగీక రిస్తారా? తను గొప్ప పని చేసినందుకు ఎవరూ హర్షించరు. పైగా తనమీద తన వాళ్ళమీద నిర్లిప్తత చూపిస్తారు. ఎందుకో, సంఘం అంటే తనకూ భయమే!

ఆలోచనలతో రమణమూర్తి మెదడు మొద్దుబారిపోయింది. మరోవేపు శకుంతల కావాలనే తపన అతన్ని వేధిస్తుంది. స్వతహాగా తనకు తాను ఓ నిర్ణయాన్ని తీసుకునే అలవాటు మొదట్నుంచి లేదు. ఓ పరిష్కారాన్ని వెదుక్కొనేశక్తి అంత కంటే లేదు. తనకు ఎవరైనా ఆలోచించి సలహా యివ్వాలి. తనకో మార్గాన్ని చూపించాలి.

వెంటనే రమణమూర్తి జరిగినదంతా తెలియజేస్తూ, తొందరగా జవాబు ఇమ్మని సుబ్బారావుకు ఉత్తరం రాశాడు.

. నెలరోజులు గడిచాయి. సుబ్బారావు నుంచి జవాబు రాలేదు. రమణమూర్తి బాగా నీరసించిపోయాడు. బస్‌స్టాపుకు వెళ్ళడం మానుకున్నాడు. నెలరోజుల్లో ఒక్కసారైనా శకుంతలను చూడలేదు. తన అసమర్థతలు శకుంతలకు చెప్పుకోవా లనిపించలేదు. ముందెప్పుడూ శకుంతలను చూడకుండా ఉండలేకపోయేవాడు. ఆత్మ వంచన చేసుకుంటున్నట్లు బాధ పడి పోయాడు.

మరో పదిహేను రోజులు గడిచిన తర్వాత సుబ్బారావు నుంచి ఉత్తరం వచ్చింది.

'డియర్ మూర్తీ!

నీ ఉత్తరం నిన్ననే చూశాను. ఈ మధ్య నేను ఊళ్ళో లేను. అలస్యానికి

క్షమిస్తావని అనుకుంటున్నాను.

నువ్వు నిజంగా అమాయకుడనిపిస్తుంది. జీవితానికి పవిత్రత అవసరం. పెళ్ళి ముఖ్యం కాదు. ఆ అమ్మాయికి ఊహ తెలియకముందే పెళ్ళి చేశారు. ఆమెకు ఊహ తెలిసేసరికి అతను చనిపోయాడు. ఆమెకు ప్రేమంటే ఏమిటో తెలియనిరోజుల్లోనే అన్నీ జరిగిపోయాయి. నీతో ఆమె నిజం చెప్పింది. అది ఆమె ప్రేమకు నిదర్శనం.

కానీ, నువ్వు పాతబడ్డ ఆలోచనలతో మనసు పాడు చేసుకుంటున్నావు. ఈ రోజుల్లో వర్ణాంతర వివాహాలు, బాల వితంతు వివాహాలు పెద్ద సమస్యలేమీ కాదు. వాటికి త్యాగాలూ చచ్చుబండలూ అవసరం లేదు. సంఘం.. సంఘం....అని కబుర్లు చెప్పేవాళ్ళు పిరికివాళ్ళు. నీ మనసుకి నచ్చినప్పుడు ఒకరికోసం భయపడక్కర లేదు. శకుంతలను నిరభ్యంతరంగా పెళ్ళి చేసుకో.

ఆలస్యం కాకుండా శకుంతలకు కనిపించి నీ అంగీకారాన్ని తెలియజేయ్. త[illegible]లో వెడ్డింగుకార్డు పంపిస్తావని ఆశిస్తాను. —నీ సుబ్బారావు.

రమణమూర్తి తీవ్రంగా ఆలోచించాడు. సుబ్బారావు రాసిన ఉత్తరం తనకెంతో నచ్చింది. మసిబారిన అద్దాన్ని తుడిచి నట్లయింది. తనకు శకుంతల కావాలి. ఆమె కోసం తనేమైనా చేయాలి. ఓ స్థిర నిశ్చయానికి వచ్చాడు.

ఆ సాయంత్రమే రమణమూర్తి బస్ స్టాపుకు వెళ్ళాడు. కానీ, శకుంతల కనిపించలేదు. తర్వాత వరసగా రెండు రోజులు చూశాడు. ఆమె కనిపించలేదు. అతనికి పిచ్చి పట్టినట్లయింది.

వారం రోజుల తర్వాత—మెయిన్ రోడ్డు మీద శకుంతల కనిపించింది. రమణమూర్తి సంబరపడిపోయాడు. 'శకుంతలా' అని గట్టిగా అరవాలనుకున్నాడు. కానీ ఆమె కళ్ళలో నిరసనభావమూ, ఆమె ప్రక్కనే నడుస్తున్న మరో యువకున్ని చూసి పెదవులు కదపలేకపోయాడు.రమణమూర్తి అడుగులు వెనక్కి వేశాడు. తనొక నిర్ణయాన్ని తీసుకొనే వరకు శకుంతల ఎదురు చూడలేదు. కారణం,....

శకుంతల అప్పుడూ, ఇప్పుడూ— ఎప్పుడు కనిపించినా రమణమూర్తి తలలో ఒకే ప్రశ్న మెదులుతుంది—'తననూ తన ప్రేమనూ పరీక్షించటం కోసం శకుంతల తనకు పెళ్ళయిందని అబద్ధం చెప్పిందా? లేక తను చేయలేని ధైర్యాన్ని అతను చేశాడా?'' అని. *

ఈ ముగింపు నచ్చని వాళ్ళకు

మరో ముగింపు:—

శకుంతల ఉత్తరం చదివి, రమణమూర్తి చాల తీవ్రంగా ఆలోచించాడు. తనకు శకుంతల కావాలి. శకుంతల ప్రేమ కావాలి. శకుంతలతో తన జీవితం సాగాలి. ఆమె జీవితంలో పచ్చి నిజాన్ని బయట పెట్టి ఆమె సంస్కారాన్ని చాటుకుంది. ఏ స్వార్థం లేని నిష్కల్మషమైన శకుంతలను భార్యగా పొందటం కంటె తనకు గొప్ప అదృష్టం ఏముంటుంది?

మర్నాడు—రమణమూర్తి మామూలుగా బస్ స్టాపులో శకుంతలను కలుసుకున్నాడు.

"మీరు జీవితాంతం నా శకుంతలగా ఉండిపోవాలి" రమణమూర్తి మెల్లగా, తియ్యగా అన్నాడు. ఆ మాటలు శకుంతల హృదయపు లోతుల్లో వలయాలుగా తిరిగాయి.

పాపులర్ పాప్యులారిటీ పోటీ

ఎంట్రీ ఫీజు లేదు. మీరు బహుమతి పొందగలరు.

మొదటి బహుమతి : ఒక స్కూటర్ వెస్పా లేక ఆల్విన్ రెఫ్రిజిరేటర్. ద్వితీయ బహుమతి : ఒక టేప్ రికార్డర్ లేక ఆటోమేటిక్ కెమేరా లేక రేడియోగ్రామ్. మూడవ బహుమతి : (100) టోయో జపాన్ మోడల్ రూ. 275-00 లు విలువచేసే త్రీ బ్యాండ్ ఆల్వరల్డ్ ట్రాన్సిస్టర్లు. నాల్గవ బహుమతి: (10) టోయో జూనియర్ జపాన్ మోడల్ రూ. 250-00 లు విలువచేసే త్రీ బ్యాండ్ ఆలువరల్డ్ ట్రాన్సిస్టర్.

మీరు చేయవలసినది ?

11 (పదకొండు) నుంచి 26 (ఇరువది ఆరు) వరకు గల అంకెలను నిలువుగా, అడ్డముగా, అయిమూలలుగా ఎటు కూడినా 74 (డెబ్భైనాలుగు) మొత్తం వచ్చునట్లు ఒక అంకెను ఒకేసారి వాడి పై గడులను పూరించవలయును.

ఎంటన్స్ ఫీజు : లేదు. ఇది పాప్యులారిటీ పోటీ మాత్రమే.

ఆఖరి పోస్టింగ్ తేది : 18-6-73 ఫలితముల తేది : 20-6-73

సహాయము కొరకు 70 మొత్తముగల నమూనా.

19	20	17	14
16	15	18	21
10	13	24	23
25	22	11	12

పోటీ నిబంధనలు : 1) ఎంట్రీలకు సాధారణకాగితం వాడవలెను. 2) దిద్దులు, సవరణలుగల ఎంట్రీలు అంగీకరింపబడవు. 3) ప్రమోటర్ల తీర్మానమే ఖాయమైనది. చట్టబద్ధముగా న్యాయమైనది. 4) ఎంట్రీ యొక్క సక్రమము మా అఫిషియల్ సీల్డు సొల్యూషన్‌తో సరిపోల్చి ఖచ్చితముగా చూడబడును. నగదు రూపంలో ఏ బహుమతీ యివ్వబడదు. 5) మొదటి బహుమతి : అఫిషియల్ సొల్యూషన్‌తో సరిపోయినవానికి ఇవ్వబడును.

6) ద్వితీయ బహుమతి : (5) అఫిషియల్ సొల్యూషన్‌తో సరిపోయేట్లున్న పై మూడు అడ్డ వరుసలకు. 7) మూడవ బహుమతి : (100) ఏ వరుసలోనైనా, ఏ సంఖ్యతోనైనా అఫిషియల్ సొల్యూషన్‌తో సమానంగా వున్నవాటికి. 8) అదృష్టవంతులైన ఎంట్రాంట్స్‌కు 10) నాల్గవ బహుమతి. 9) గెలుపొందినవారు సదరు బహుమతులు పొందుటకు పోస్టేజి, ప్యాకింగ్, లైసెన్స్ ఫీజులు చెల్లించవలయును. 10) మూడవ బహుమతి పొందినవారుకూడా పైన తెల్పిన ఖర్చులతోసహా ట్రాన్సిస్టరు ఖరీదులో సగం చెల్లించటమేకాకుండా మా షరతులకు లోబడి వుండాలి. 11) ఫలితముల కోరువారు 45 పైసల పోస్టల్ స్టాంప్స్ పంపవలెను. 12) ఒక కుటుంబంనుంచి ఒక ఎంట్రీమాత్రమే పంపాలి. 13) మీ విలాసము ఇంగ్లీషు లేక హిందీలోనే వ్రాయవలెను 14) కటింగు లేక నిబంధనల కాపీ భవిష్యత్తులో ఉపయోగార్థం మీ వద్ద ఉంచుకోండి.

కబుర్లు

చలసాని ప్రసాదరావు

అమెరికాలో ఈమధ్య హత్యలు మరీ ఎక్కువయిపోయాయట. అసలే అది వియత్నాంలాంటి దేశాల్లో హత్యల్ని అమోఘంగా ప్రాక్టీసు చేసిన దేశంకదండీ! అక్కడ ఛాన్సులు తగ్గాక మరెక్కడన్నా మొదలెట్టకపోతే బాలన్స్ కుదరటం ఎలా?

అయితే ఈ హత్యలీమధ్య మరీ తలనొప్పిగా తయారయ్యాయి. రాత్రిళ్ళు చీకటిగొందుల్లో ఖూనీల సంగతి అలా ఉంచి పట్టపగలు ఊరి శివార్లలో పోయే ప్రయాణీకుల్ని వాళ్ళ వాహనాల్తో సహా నిలేసి నిలువుదోపిడీ చేస్తున్నార్ట. ఖర్మగాలి అలా నిలవేయబడ్డవారిలో ఎవరి జేబుగానీ, పర్సుగానీ ఖాళీగా ఉంటే వళ్ళు మండుకొచ్చి వాళ్ళని నిలువునా ఓ పిస్తోల్ దెబ్బతో చంపేస్తున్నార్ట.

అందుకని ఓ అమెరికన్ నగరకౌన్సిల్ తన పౌరులకు ఈ హత్యల్నించి తప్పించుకునేందుకు అమోఘమైన సలహా ఒకటి ఇచ్చింది.

"పౌరులారా! అత్యంత సాధుశీలురైన మన జేబుదొంగలు మిమ్మల్నెందుకు కాల్చి పారేస్తున్నారు? ... కేవలం మీ జేబులూ, పర్సులూ ఖాళీగా ఉంట బట్టేగదా! తత్ఫలితంగా తమ శ్రమ వృథా అయిందని సదరు సర్వోదయవాది పిక్ పాకెట్లు ఆవేశపడబట్టేగదా! వారి శ్రమ వృథాకాకుండాఉంటే వారెలాగూమిమ్మల్ని కాల్చనవసరం ఉండదుగదా!

"కనుక : ఓ మహాఘనత వహించిన అమెరికన్ పౌరులారా! మీరు అలాంటి పిస్తోల్ వీరుల బారినపడే సమయానికి మీ పర్సులో కనీసం ఓ ఇరవై డాలర్లన్నా ఉండేలా జాగ్రత్తపడండి. అలా అయితే మీకు ప్రాణభయం ఉండదుగాక ఉండదు."

అని ఆ నగరపాలక పెద్దలు తమ పాలిత పిన్నలకు ఓ ఉచిత సలహా పారేశారు. అద్భుతంగా ఉందిగదండి సలహా! ఆ సలహా మొదట ఏ మహాత్ముని బుర్రలో పుట్టిందోగానీ, సదరు మహాత్ముడు పూర్వజన్మలో మన ఫైనాన్సుమినిస్టరో అతని శిష్యుడో అయివుండాలి. అంత గొప్ప అయిడియాలు మన పుణ్యభూమికి ఆర్థిక మంత్రిగా ఉండే పుణ్యాత్ములకు తప్ప మరెవరికన్నా వస్తాయంటే నమ్మటం కష్టమే మరి.

మన ఆర్థిక మంత్రుల బుర్రలు ఆ పీట ఎక్కి కిరీటం పెట్టించుకోగానే అమోఘంగా ఆలోచించ నారంభిస్తాయి. మూడేళ్ళ క్రితం అరవై పైసలున్న సిగరెట్ పాకెట్టును ఈనాడు తెల్లారేసరికి రూపాయిపెట్టి చచ్చినట్టు కొనేలో క్కొన్ని కోట్లమంది చెవిమెలేయగల సత్తా సదరు పెద్దమనిషి చూపిస్తాడు.

"అదేమిటి మహానుభావా!" అంటే గాంధీగారి అమ్మమ్మలా మందహాసంచేయగలడు. "నేనేం మిమ్మల్ని కొనమని బలవంతం చేస్తున్నానా? ఇష్టమైతేనేకొనుక్కోండి. ఆ మాటకొస్తే నేనసలు మీ చేత ధూమపానం మాన్పిద్దామనే సిగరెట్ల మీద పన్నులు పెంచేశాను. మీ ఆరోగ్యం అంటే నా కెంతో ప్రేమ. ధూమపానం మంచిదిగాదు. చూడండి : గాంధీగారు సిగరెట్లు తాగేవారా? ఈనాడు ఇందిరా గాంధీ మాత్రం తాగుతున్నారా? మీమహా కవిసామ్రాట్టు విశ్వనాధ సత్యనారాయణ కూడా సిగరెట్లు తాగడటకదా!" అని ఎదురు ప్రశ్న వేయగలడు.

"టెర్లిన్ గుడ్డలమీద పన్నులేసావేమిటయ్యా" అంటే సదరు మంత్రిగారు గాంధీటోపీనోసారి సవరించుకుని కస్తూర్బాగాంధీలా చిరునందహాసం చేయగలడు.

"చూడండీ! నాకు నాలుగు పెంచేమిల్లులున్నాయి. నా కొడుకురికి రెంపెబట్టల మిల్లులున్నాయి. నా చుట్టపక్కాలకు మరెన్నో బట్టల మిల్లుల్లో వాటాలున్నాయి. అయినా నేను టెర్లిన్లుతొడగడం లేదే! ముతక ఖద్దరు గుడ్డలేమోస్తున్నానే! నా నెత్తిన రెండున్నర కిలోల బరువు ముతక ఖద్దరు టోపీని చచ్చినట్టు భరిస్తున్నానే! మరి మీకు టెర్లిన్లమీద మోజేమిటి? అది లగ్జరీ! అందుకే పన్ను లేశాను" అనగలడు.

అవును మరి. ఈనాడు నాకు ఓషర్టుకి అయ్యే ఖర్చుతో నా చిన్నప్పుడు పదిషర్టులొచ్చేవి. ఆ లెక్కన ఇవన్నీ లగ్జరీల్. కానీ, ముతక ఖద్దరు మరింత లగ్జరీ గదా! దాన్ని మాత్రం ఎలా భరించటం? అదీగాక మన ఖర్మకొద్దీ ఖద్దరు కట్టిన వాడిని కొంత కాలంగా జనం అనుమానంగానూ, అయిదు ఖూనీలుచేసి, అరవై కొంపలు దోచుకొన్న వాడిని చూసినట్టూ చూస్తున్నారే! చూస్తూ చూస్తూ వాపనెలా మొయ్యటం?

పైగా ఈ ఖద్దరు గుడ్డల్ని మొయ్యాలంటే వంట్లో కొంతన్నా ఓపికంటూ ఉండాలి. ఈ పన్నుల పుణ్యమా అని మన జనాభాలో మెజారిటీకి ఆ మాత్రం ఓపికా లేదు గదా!

మన ఆర్థిక మంత్రుల లాజిక అద్భుతం. నోరులేని సామాన్యుడిని తమ లాజిక్తో అదరగొట్టి బెదరగొట్టి వాడి నోరు మూసి

కదుపే మాధ్యమంలో వారు ప్రవీణులు. "పెట్రోలు మీద పన్ను వేశాంగానీ కిరసనాయిలు మీద వేయలేదు గదరా సామాన్యుడా! నీకు కారులేదు గదా! పెట్రోలు ఏం చేసుకుంటావ్! పెట్రోలు నీ పొయ్యి ముట్టించుకునేందుకు పనికి రాదు గదా!" అని పకడ్బందీగా అతగాణ్ణి ఓదార్చ గలరు.

అయితే ఆ మర్నాడే పొరుగూరికి బయల్దేరిన సామాన్యుడిని బస్సువాడు అర్ధరూపాయి ఎక్స్‌ట్రా ఇమ్మంటాడు. అదేమిటంటే "పెట్రోల్ ధర పెరిగిందిరా నాయనా" అని అడివి జంతువుని చూసిన నగర జంతువులా ఇకిలించగలడు. ఆ ఇకిలించిన వాడే ఆ సాయంత్రం పచారీ షాపుకుపోయి "పావుకిలో బియ్యంపారెయ్యవయ్యా సుబ్బి సెట్టీ!" అంటే సదరు సుబ్బి శెట్టి గారు "సరేగానీ, ఓ పావలా ఎక్స్‌ట్రా పడెయ్యవయ్యా! మీ లారీల వాళ్ళు పెట్రోల్ ధర పెరిగిందని రేట్లు పెంచి కూర్చున్నారు! నాకేమో మోత కూలి పెరిగింది!" అంటాడు. ఏం చేస్తాడు మనవాడు?

ఇదంతా ఇలా ఎందుకు జరుగుతోందని కొందరు అమాయకులు ఆశ్చర్యపోతుంటారు. మనం డబ్బివ్వకపోతే గవర్నమెంటు మనకోసం మరిన్ని మంచిపనులు చేయటం ఎలాగా? అని కూడా కొందరు ధర్మాత్ములు అనుమానిస్తుంటారు.

వెనుక ఓ గూడెంలో ఓ గజ దొంగ పట్టుపడ్డాట. వాడిని పోలీసుల కప్పగించి కోర్టుల చుట్టూ తిరిగే ఓపికలేని సదరు గూడెం గోచీ పాతరాయుళ్ళు వాడిని చితక దన్ని చివరికి అడిగారట.

"ఓరే! గజ దొంగేశ్వరరావూ! ఊళ్ళో అందరు భాగ్యవంతుల మేడలూ, మిద్దెలూ, గాదులూ ఉండగా మా గూడెంలో కాలెందుకు పెట్టావురా," అని.

అందుకు వాడు అన్నాడట. "ఎంతయినా వాళ్ళంతా నా దగ్గరి బంధువులూ, తప్పితే దూరపు బంధువులునూ, చూస్తూ చూస్తూ మా కులం వాళ్ళ కొంపలే ఎలా దోచుకోను? అదీగాక వాళ్ళ దొడ్లలో పులుల్లాంటి కాపలా కుక్కలున్నాయి!" అని తన భక్తిని, భీతిని ప్రదర్శించేడట.

మన సామాన్యుడికి ఇంకా ఈ కథ తెలిసి ఉండదు. తెలిసిన్నాడు మనవాడు ఇంకా సామాన్యుడుగానే ఉండి పోడు గదా!

ఎంట్రీఫీజు లేదు - మీరు బహుమతిని గెలుపొందగలరు.

మొదటి బహుమతి : ఒక స్కూటరు వెస్పా లేక ఆల్విన్ రిఫ్రిజిరేటర్. 2 వ బహుమతి; ఒక షేవ్ రికార్డరు లేక ఆటోమేటిక్ కెమెరా లేక రేడియోగ్రాం. 3 వ బహుమతి : (100) టోషిబా జపాన్ మోడల్ 3 బ్యాండ్ ఆల్ వరల్డు ట్రాన్సిస్టర్లు, ధర : రు. 275-00 4 వ బహుమతి : (10) టోషిబా జూనియర్ జపాన్ మోడల్ 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ ట్రాన్సిస్టర్ ధర 250-00

మీ రు చే య వ ల సి న ది ?

11 (పదకొండు) నుంచి 26 (ఇరువది ఆరు) వరకు గల అంకెలను నిలువుగా, అడ్డముగా, అయిమూలగా ఎటుకూడినా మొత్తము 74 (డెబ్బై నాలుగు) వచ్చునట్లు ఒక అంకెను ఒకేసారి ఉపయోగించి పై ఖాళీ గడులను పూరించవలయును. ఎంట్రెన్స్ ఫీజు ఎంట్రీఫీజు లేదు. ఇది ఒక పాప్యులారిటీ పోటీ మాత్రమే.

ఆఖరి పోస్టింగ్ తేదీ : 5-5-73. ఫలితం తేదీ : 10-5-73

సహాయము కొరకు 38. 2 నుంచి 17 అంకెలతో మొత్తముగల నమూనా.

13	3	16	6
4	8	15	11
14	10	5	9
7	17	2	12

పోటీకి నిబంధనలు : (1) సాదా కాగితము ఉపయోగించాలి. (2) సవరణలు, దిద్దులు, కటింగులుకల ఎంట్రీలు అంగీకరించబడవు. (3) ప్రమోటర్ల తీర్మానము ఖాయమైనది మరియు చట్టబద్ధముగా న్యాయమైనది. ఈ పోటీ విషయములో ఇది ఒక ముఖ్యమైన షరతు. (4) ఎంట్రీల యొక్క సక్రమము మా ఆఫిషియల్ సీలు సొల్యూషన్ తో సరిపోల్చి ఖచ్చితముగా చూడబడును. నగదుగా బహుమతి ఇవ్వబడదు. (5) మొదటి బహుమతి : (1) అఫిషియల్ సొల్యూషన్ తో సక్రమముగా వున్నట్లు కనుగొనబడిన దానికి ఇవ్వబడును. (6) రెండవ బహుమతి : (1) పైన అడ్డముగావున్న మూడు వరుసలలో సమానముగా వున్నదానికి ఇవ్వబడును. (7) మూడవ బహుమతి: (100) మా అఫిషియల్ సొల్యూషన్ తో ఏ వరుసతోనైనా, సంఖ్యతోనైనా, సమానముగా వున్నదానికి ఇవ్వబడును. (8) నాల్గవ బహుమతి: డ్రాలో ప్రమోటరుకు సంతృప్తినిచ్చిన పది (10) ఎంట్రెంట్స్ కు ఇవ్వబడును. (9) గెలుపొందిన వారికి సదరు బహుమతులు పొందుటకు పోస్టేజీ, ప్యాకింగ్, లైసెన్సు ఫీజు చెల్లించవలయును. (10) 3వ మరియు 4వ బహుమతి గెలుపొందినవారుకూడా పైన తెల్పిన ఖర్చులతోకూడా ట్రాన్సిస్టరు ఖరీదుతో సగం చెల్లించాలి. మరియు మా నిబంధనలకు, షరతులకు లోబడి వుండాలి. (11) ఫలితములు పొందుటకు 45 పైసలు పోస్టలు స్టాంపులు పంపాలి. (12) ఒక కుటుంబము ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. (13) అడ్రసు ఇంగ్లీషు లేదా హిందీలో వ్రాయాలి. (14) కటింగ్ లేక నిబంధనల కాపీ భవిష్యత్తులో ఉపయోగార్థము మీవద్ద ఉంచుకోండి. ఆఖరు తేదీని మార్చుకొనే హక్కు ప్రమోటర్లకు గలదు.

CONTROLLER CONTEST :

FOREIGN AGENCIES (W—94)

P. O. Box No. 1456. DELHI—6.



(గత సంచిక తరువాయి)

ఇల్లు చాలా విశాలంగా వుంది. కొంచం పాత పద్ధతిలో వున్నప్పటికీ పరిశుభ్రంగా వుంది. ఇంట్లో వున్న కుర్చీలు, బల్లలు కొంచెం పాతకాలం సామగ్రిలా వున్నాయి.

లోపల వరండాలో రామారావు తండ్రి కూర్చుని ఏదో పుస్తకం చదువు కుంటున్నాడు. ఆయనకు ఇంగ్లీషు చదువు లేకపోయినా, తెలుగూ, సంస్కృతమూ బాగా చదువుకున్న పండితుడని రామారావు లక్ష్మికదివరకే చెప్పాడు. రామారావు తండ్రి చూడ్డానికి కూడా పండితుడిలాగే కనిపిస్తాడు. ఆజానుబాహుడు, పెద్దకళ్ళు, నుదుట గంధం దానిమీద కుంకంబొట్టు, జుట్టు ముడి. పైన కండువా కప్పుకుని గంభీరంగా వుంటాడు. ఆయన్ని చూడగానే లక్ష్మికెందుకో ఒక క్షణం భయమూ భక్తీ రెండూ కలిగాయి. ఆమె తల వంచి నమస్కారం చేసింది. ఆయన ప్రతినమస్కారం చెయ్యకుండానే "సుఖీభవ" అన్నాడు. లక్ష్మి అక్కడ మరి నిలబడకుండా రామారావు తల్లి వెంట వంట యింటి వేపు వెళ్ళింది. వెనక వరలో ఒక వంటగది, ఒక భోజనాలగదీ, ఒక పూజగదీవున్నాయి. పూజగదిలో ఒక ప్రక్క అరుగుమీద మందిరం, అందులో ఎన్నో విగ్రహాలు, దిగువన పూజసామగ్రీ వున్నాయి. పక్కనే దీపాలు, ఉదొత్తులు వెలుగుతున్నాయి. లక్ష్మి ఈ దృశ్యాన్ని కొద్ది

సేపు కన్నార్పకుండా చూసింది. రామా రావు లక్ష్మికి యిల్లంతా చూపించాడు. ఒక పెద్దగదిలో బీరువాలనిండా వున్న గ్రంథాలు చూసి లక్ష్మి ఆశ్చర్యపో యింది. "ఇదిగో ఈ నాలుగు బీరువా ల్లోని పుస్తకాలు నావి. ఈ ఆరు బీరు వాల్లో వున్న గ్రంథాలు మా నాన్న గారివి. అవన్నీ తెలుగూ, సంస్కృత గ్రంథాలే. వాటిలో మహాభారతం, రామాయణం, భాగవతం తదితర పురా ణాలు, మేఘసందేశం, కుమారసంభవం, ఋతుసంహారం లాంటి సాహిత్య గ్రంథాలు యిలాంటివెన్నో వున్నాయి. ఇవిగో నావి" అని చూపించాడు రామా రావు. రామారావు పుస్తకాలలో ఎక్కు వగా ఆర్థిక శాస్త్రానికి సంబంధించిన ఇంగ్లీషు పుస్తకాలే అయినప్పటికీ, సాహిత్య విమర్శ, ట్రావలోగ్సు ఆత్మ కథలు మొదలైన గ్రంథాలు కూడా వున్నాయి.

లక్ష్మికి ఈ గ్రంథాలయం ఆశ్చర్యం కలిగించింది. ప్రాచీన విజ్ఞానం, ఆధు నిక గ్రంథాలు ప్రక్కప్రక్కనే సహ జీవనం చేయడం ఆమెకు వింతగా వుంది.

తరువాత రామారావు లక్ష్మికి పెరడు చూపించాడు. పెరట్లో వున్న మామిడి తోట పూతపట్టి సువాసన వెదజల్లుతూ వుంది. లక్ష్మి నూతి గట్టు వొడ్డున కూర్చుని "అబ్బ. ఎంత చక్కటితోట" అన్నది. రామారావుకూడా ప్రక్కనే కూర్చున్నాడు. "పట్నాల్లో యిరుకు సందుల్లో, గాలీవెలుతురూరాని ఇళ్ళలో వుంటూ ఎప్పుడూ కార్లూ, బస్సుల రొద వింటూ ఒకసారి గ్రామానికొస్తే ప్రాణం లేచొచ్చినట్టే వుంటుంది. కాని మన బోటి వాళ్ళం యిక్కడే వుండాలంటే తోచక పిచ్చెత్తిపోతాం" అన్నాడు రామారావు.

"పట్నం వదిలి ఎలాగూ రాలేం. కనుక అప్పుడప్పుడు గ్రామానికొస్తూ వుండాలి."

"మా ఊరు నీకు బావుందా?"

"చాలా బావుంది."

"అలా అయితే యిక్కడికే వస్తూ వుండు."

"నువ్వు తీసుకొస్తే ఎందుకురాను."

"పెళ్ళికాకుండా నిన్ను నాతో తీసుకురావడం మా అమ్మకీ నాన్నకీ యిష్టంలేదు. మా అమ్మ నాతో చూచా యగా అన్నది కూడాను." అన్నాడు రామారావు.

"అవును. అది కూడా న్యాయమే, సమాజానికి ఏదో ఒక నీతి నియమమూ అంటూ వుండాలి కదా" అన్నది లక్ష్మి.

ఇంతలో రామారావు తల్లి భోజనా నికి రమ్మని కేకేసింది. ఈ అమ్మాయి ఏ కులస్తురాలో తెలీదు. అందుకని వంటింట్లో వడ్డించకుండా పెరటి వరం డాలో యిద్దరికీ కొంచెం ఎడం ఎడంగా

పీటలువేసి వడ్డించింది. రామారావు ఇదంతా గ్రహించేడు కాని బయటికేమీ అనలేదు. భోజనమయ్యాక తల్లి లక్ష్మిని విస్తరి తీసిపారేయమంటుందేమోనని ముందుగానే రామారావు తన విస్తరి మడత పెట్టి పారేయడానికి లేవబోయాడు. లక్ష్మి అడ్డుపడి, తానే రెండు విస్తళ్ళు తీసిపారేసి ఎంగిలి ఎత్తేసింది.

"మా యింట్లో కొంచెం ఆచారం డోసు ఎక్కువ" అన్నాడు రామారావు నవ్వుతూ.

భోజనాలయ్యాక కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని మళ్ళీ యిద్దరూ బయలుదేరేరు. ఏరుదాటి, మామిడి తోటలో వున్న మోటారుసైకిల్ మీద పట్నం వెళ్ళిపోయారు.

* * *

మర్నాడు సింహాద్రి స్కూటరేసుకుని రామారావుండే లాడ్జికి వెళ్ళేడు. రామారావు కుర్చీలోంచి లేచి నిలబడి "ఎవరు కావాలండీ" అన్నాడు.

"నీ పేరు రామారావేకదూ, నీ కోసమే వచ్చాను బాబూ" అంటూ సింహాద్రి ప్రక్కనున్న కుర్చీలో కూలబడి "కొంచెం మంచినీళ్ళిప్పించు" అన్నాడు. రామారావు గ్లాసుతో మంచినీళ్ళిస్తే గడగడ తాగి కండువాతో మొహం తుడుచుకుని "ఈ ఊళ్ళో నన్నెరగని మనుషులు లేరు బాబూ. ఐనా నువ్వు నన్నెరక్కపోవచ్చునులే. కాని నిన్ను నేను ఎరుగుదును. సింహాద్రి అంటారు. ఆవేళ వీరాస్వామి యింటి గుమ్మందగ్గర కనిపించావు" అన్నాడు సింహాద్రి.

"అలాగా, వీరాస్వామిగారూవాళ్ళు మీకు బంధువులా?"

"ఛ. ఛ. వాళ్ళు మాకేం బంధువులయ్యా. వీరాస్వామి మా కులస్థుడే అనుకో. అయినా అతగాడ్ని కులంలోంచి వెలివేసేరుగా."

"అయితే మీకు వాళ్ళని బాగా తెలుసునన్నమాట."

"ఆహా! తెలియకేం? వాళ్ళ కులగోత్రాలన్నీ నాకు తెలుసుబాబూ. వాళ్ళ గుట్టంతా కూడా నాకు తెలుసు. ఆ అమ్మాయిని గురించి నీకంటే నాకెక్కువ తెలుసు. నువ్వంటే కొత్తోడివి కానీ మేము పాతోళ్ళమే."

లక్ష్మి నేనూ కలిసి చదువుకున్నాం. చాలా మంచి మనిషి" అన్నాడు రామారావు ఈ సంభాషణ యిక్కడితో ఆపేస్తాడేమోనని. కాని సింహాద్రి అక్కడితో ఆపివేయడానికి రాలేదు.

"మనుషుల మంచితనం మాటలను బట్టి ఏం తెలుస్తుందయ్యా పిచ్చోడా? కులమూ, సంప్రదాయమూ, గౌరవమూ, మర్యాదా ఇలాంటివన్నీ చూడాలి గదా. నువ్వేదో అమాయకుడిలాగున్నావు. కొంపదీసి ఆ పిల్లమీద ఏదైనా ఆశపెట్టుకున్నావేమిటి?"



"పెట్టుకుంటే తప్పేమిటి?"

"తప్పులేదుగానీ, ఆ పిల్ల తల్లీదండ్రీ వారి చరిత్రా కూడా తెలుసుకోబాబూ. నేనేదో పెద్దోడ్ని. నీ మంచికోసమే

చెబుతున్నానయ్యా. లేకపోతే నాకేం బట్టిందిదంతా చెప్పడానికి. వీరాస్వామి మా కులస్థుడే దర్జీపని చేసేవాడు, యిప్పుడూ అదేపని చేస్తున్నాడు. ఈ పార్వతమ్మ వాళ్ళింటి పొరుగునేవుండేది. ఈ లక్ష్మిని కన్న ఆర్నెల్లకే మొగుడు పోయాడు. చాల పేదవాళ్ళు దిక్కూ మొక్కూ లేకపోతే యీ వీరాస్వామి వాళ్ళని చేరదీశాడు. అప్పట్నుంచీ వాళ్ళిద్దరూ కాపరం చేస్తున్నారు. పెళ్ళి పెటాకులూ లేవు. తెలిసిందా. ఆ తల్లి చరిత్ర మంచిది కాదయ్యా బాబూ అందుకే ఇన్నాళ్ళూ పిల్లకి పెళ్ళి కాలేదు సరే ఇంతకీ ఏదో తెలీక ఆ పిల్లతో స్నేహం చేశావు, అయినా ఇప్పటికేనా మించిపోయిందేం లేదులే, యీ గొడవలోంచి తప్పుకో. ఏదో పెద్దోడ్ని. నాకు తోచిన సలహా ఇచ్చాను. మరేమనుకోకు ఇక నే వెళ్ళొస్తాను బాబూ" అంటూ లేచాడు సింహాద్రి. అతను గబగబ మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

రామారావు యీ కథంతా తొలిసారిగా విన్నాడు. కథ ఆసక్తి జనకంగానే వుంది. భర్త చనిపోయేక విధవ వివాహం చేసుకోవడంలో తప్పుకోలేదు. కాని వివాహమనేది లేకుండా కాపరం చేయడం వివాహ వ్యవస్థను తృణీకరించడమే అవుతుంది. వివాహ వ్యవస్థ నాగరిక సమాజ లక్షణం. దానిని త్రోసి పుచ్చడం అవినీతికదా? అయితేఇందులో లక్ష్మి చేసిన తప్పేముంది? ఆ తల్లికి పుట్టడమే ఆమె చేసిన పాపమా? కానితాను లక్ష్మిని వివాహ మాడితే ఆ వివాహాన్ని తన తల్లీ తండ్రీ ఆమోదించరు. వాళ్ళ యిష్టానికి వ్యతిరేకంగా తాను నిలబడవలసి వుంటుంది. రామారావు ఆలోచిస్తూ మంచం మీద నడుం వాల్చేడు. సింహాద్రి రాకతో అతని మనస్సంతా గందరగోళమైంది.

సాయంత్రమైంది. అస్తమించే సూర్యుని కిరణాలు కిటికీలోంచి గదిలోకొచ్చి పడుతున్నాయి. రామారావు నిద్రనుండి లేచాడు. తలంతా భారంగా నొప్పిగా వుంది. సింహాద్రి యివాళ తన రోజంతా పాడుచేశాడు. మంచం మీంచి లేచి టేబిలు డ్రాయరుతీసి అందులోంచి ఒకతల నొప్పి మాత్రతీసి నోట్లో వేసుకుని మంచినీళ్ళు తాగి మళ్ళీ మంచం యెక్కి కూర్చున్నాడు.


తలుపు చప్పుడైతే లేచి తలుపు తీశాడు లక్ష్మి లోపలికొచ్చింది. "ఏమలా వున్నావ్. సాయంత్రం అయిదు గంటలకి మా స్కూలు దగ్గర కొస్తానన్నావు. రాలేదేం? నీ కోసం చూసి చూసి ఇలా వచ్చాను."

అవును, తాను ఆ సంగతే మరచిపోయాడు.

"ఏం, ఒంట్లో బాగు లేదా?"

రామారావుకి అబద్ధ మాడడం ఇష్టం లేదు.

"పడుకుని లేచాను, కొంచెం తల నొప్పిగా వుందంతే మరేం లేదు."



"అంతేగద. రోజంతా గదిలో నిద్ర పోతున్నావు గాబోలు. నిద్ర ఎక్కువై తలనొప్పి వచ్చిందేమో" అందినవ్వుతూ.

"లేదు లక్ష్మీ, ఇప్పుడే గంట క్రితం పడుకున్నాను. ఇవాళంతా ఏ పనీ చెయ్యలేదు. వేస్టయింది. ఎవరో సింహాద్రిట. మీ నాన్నగారికి తెలిసిన వాడట. ఇక్కడకొచ్చి ఒక గంటసేపు నాకు లెక్చరిచ్చి వెళ్ళేడు." అన్నాడు రామారావు.

"ఓహో, సింహాద్రి గాడొచ్చాడా? ఈ మధ్య వాడు మా మీదెందుకో కత్తి కట్టేడులే మా స్కూలు టీచర్లతో నా మీదా మా అమ్మమీదా లేనిపోని మాటలన్నీ చెప్పేడట. పరమ నీచుడు, వెధవ ఇంతకీ ఎందుకొచ్చాడు. ఏం కావాలంటాడు?"

"ఏం కావాలో చెప్పలేదు. నే నడక్కుండానే ఏదో సొదంతా ఏకరవు పెట్టేడు."

"ఏం చెప్పేడు? నాతో చెప్పకూడదా? వాడేదో చెప్పడానికే, నువ్వు డల్ గా వుండడానికీ ఏదో సంబంధం వున్నట్టుంది" అన్నది లక్ష్మీ.

"నే నడక్కుండానే మీ కుటుంబ విషయాలన్నీ చెప్పుకొచ్చాడు లక్ష్మీ. వీరాస్వామిగారు మీ తండ్రి కాదనీ, మీ నాన్నగారు పోయేక మీ అమ్మగారు

వీరాస్వామిగారితో వుంటున్నారనీ, ఏదేదో చెప్పేడు.''

''ఛి. ఆ వెధవకి సిగ్గులేదూ యీ మాటలన్నీ చెప్పడానికి నీకు నా మీద అయిష్టం కలిగించాలని వాడి వుద్దేశం ఆ వెధవని నాలుగు చెప్పుదెబ్బలు కొట్టి పంపించలేక పోయావా?'' అన్నది లక్ష్మి.

''వాడి వుద్దేశం నీచమైనదే కావచ్చు కాని వాడన్నదాంట్లో అబద్ధ మేమైనా వుందా?''

''నిజమో అబద్ధమూ ఆ వెధవ మాట లన్నీ శ్రద్ధగా వింటూ కూర్చున్నావన్న మాట అవన్నీ వినడం నీకు సరదాగా వుందన్న మాట ఇంతకీ నాతో సంబంధం తెంపుకోమన్నాడు. అంతేనా?''

''అవును. నీ స్నేహం మానుకోమని సలహా యిచ్చాడు.''

''వాడి సలహా పాటిస్తావా? నాతో స్నేహంవల్ల పరువు మర్యాదలకీ గోత్రాలకీ భంగం కలుగుతుందని భయపడు తున్నావా? ఇంత చదువుకున్న వాడివి కదా. నీకు నేను ముఖ్యమో నా తల్లి తండ్రులు ముఖ్యమో తేల్చుకోలేవా? నేను ఎలాంటిదాన్నో నువ్వు తెలుసుకో వాలిగాని నా వంశ మెలాంటిదో నీ కెం దుకు? నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా? నా వంశాన్ని ప్రేమిస్తున్నావా? ఈమాత్రం నిర్ణయించుకో లేవా?''

''అనవసరంగా ఉద్రేక పడకు లక్ష్మీ. ఇంతకీ నీ స్నేహం మానుకుంటానని నే నన్నానా!''

''అనలేదు కాని నీ మనస్సు గందర గోళంలో పడింది. నీ తల్లి తండ్రులూ, బంధువులూ యిష్టపడనీ వాళ్ళని వ్యతిరే కించవలసి వస్తుందనీ భయపడుతున్నావు అంతేనా?''

''భయపడడం సహజమే కాని ..''

లక్ష్మి చేతిరుమాలుతో కళ్ళు తుడుచు కుంది.

రామారావులోని ఉత్సాహం చల్లారి పోయిందనీ, అతని మనసు దృఢ నిశ్చ యానికి రాకుండా ఊగిసలాడుతుందనీ అనుకుంది లక్ష్మి. ఇది తన కెంతో అవ మానకరంగా తోచింది. పౌరుషంతో కోపంతో మనసు ఉద్రేక పూరితమైంది,

''అవును రామారావుగారూ వెళ్ళండి. వెళ్ళి మీ తల్లిదండ్రులకూ, బంధువు లకూ తలొంచండి. నాతో స్నేహం చేస్తే మీ కేం లాభం? మీ విద్యకూ మీ సంస్కారానికీ మంచి రాణింపువస్తుంది'' అన్నది లక్ష్మి ఉద్రేకంగా కన్నీళ్ళు తుడుచుకుంటూ.

''ఎందుకలా అర్థంలేకుండా ఉద్రేక పడతావులక్ష్మీ, అనుమానాలకీ, భయా లకీ నేను లొంగిపోతే నువ్వు నిందిం చినా అర్థముంది. ఇప్పుడేం కొంప మునిగిందనీ. పద లక్ష్మీ! నీ మనసు బాగు లేదు. మీ ఇంటివరకూ దిగబెట్టి వస్తాను పద'' అంటూ లేచాడు రామారావు.

"అక్కర్లేదు. నాకెవ్వరూ తోడు రాకక్కర్లేదు రామారావుగారూ. మీ కంటే నేను లక్షరెట్లు ధైర్యంగలదాన్ని. నేను ఒంటరిగా వెళ్ళగలను, ఒంటరిగానే బతగ్గలను రామారావుగారూ. నేను చెయ్యని పాపానికి నన్నెవ్వరూ నిందించక్కర్లేదు. నా మీద సానుభూతి చూపక్కర్లేదు. జాలి పడక్కర్లేదు. వెళ్తాను రామారావు గారూ. మీరుండండి" అంటూ కోపంగా గబగబా నడచి బయటికెళ్ళిపోయిందిలక్ష్మి

* * *

లక్ష్మి మానసిక సంక్షోభంతో సతమతమవుతూంది. ఊళ్లోనూ, తన స్కూల్లోనూ, తనమీద జరిగే దుష్ప్రచారం ఆమెకు బాధ కలిగించాయి. ముఖ్యంగా రామారావు ఉదాసీనతఆమె మనసును గాయపరచింది. రామారావు విద్యావంతుడూ సంస్కారవంతుడూ కావడంవల్ల చప్పున ఒక నిర్ణయానికి వచ్చి తనకు ధైర్యం కలిగిస్తాడనుకుంది. నిజానికి రామారావు లక్ష్మిలా ఉద్రేకపడేవాడు కాడు.అదే ఆమెఅర్థం చేసుకోలేక రామారావును నిందించింది. తన తల్లీ తండ్రీ ముందే ఈ విషయం ఎందుకు చెప్పలేదు. చెప్పివుంటే ముందే రామారావుకు చెప్పి అతని అభిప్రాయం తాను తెలుసుకొనేది. లక్ష్మికి తన తల్లిమీద కోపంవచ్చింది. ఈ గొడవ లోంచి బయటపడితేగాని తన మనసుకు శాంతి అనేది వుండదు. అందుకే తనకీ ఊరు నుంచి బదిలీ కావాలని అర్జీ పెట్టుకుంది. గుంటూరు గవర్నమెంటు గరల్స్

ఒకసారి మహానగరంలో భూకంపం వచ్చేసరికి ఒక ఆవిడ బాత్‌రూమ్‌లో స్నానంచేస్తూ ఉంది. ఆ భూకంపం అదురుకి ఆవిడ ఖంగారు పడి అలాగే వీధిలోకి పరుగెత్తు కొచ్చింది. వంటచేస్తున్న పక్కింటి ఆవిడ కూడ వీధిలోకి వచ్చి, "ఏమండోయ్! ఏమి మర్చిపోయారో చూసుకోండి" అంది మొదటి ఆవిడను ఉద్దేశించి.

ఆ మొదటి ఆవిడ ఒక నిముషం సేపు ఆలోచించి ఖంగారుపడి "ఆఁ.... అవునవును.... మనీపర్సు మరచిపోయాను." అంటూ ఇంట్లోకి పరుగుతీసింది,

—కె. మురళీధర్.

హైస్కూల్లో ఒక టీచరు ఈ ప్యూరు రావాలని చాలాకాలమై ప్రయత్నం చేస్తూండటంవలన వారం రోజుల్లో లక్ష్మికి గుంటూరు బదిలీ అయింది.

లక్ష్మి ఈ వారంరోజులు యింట్లో తల్లిదండ్రులతో సరిగ్గా మాట్లాడకుండా అన్నం సరిగ్గా తినకుండా తప్పించుకు తిరగడం, ఉషారుగా లేకపోవడం పార్వతమ్మ కనిపెట్టింది. ఈ వారం రోజుల్లో రామారావు కూడా రాక పోవడంతో వీళ్ళిద్దరి మధ్య ఏదో కలతలు ఏర్పడి వుంటాయనుకుంది. వీరాస్వామి బాధ పడతాడేమోనని అతనితో లక్ష్మి విషయం చెప్పలేదు. కాని వారం రోజులైనా పరిస్థితి మారకపోవడంతో పార్వతమ్మకు భయం వేసింది. అసలుసంగతేమిటో తెలుసుకోకుండా రోజులు గడపడం దుర్భరంగా వుంది. ఒక రోజు వీరాస్వామి లేకుండా చూసి లక్ష్మిని సంగతేమిటో చెప్పమని బ్రతిమాలింది. లక్ష్మికి ఏం చెప్పాలో తెలియలేదు. పువ్వుల్లో పెట్టి పెంచిన తన తల్లీ తండ్రీ తన కన్యాయం చేశారనీ, అవినీతిగా ప్రవర్తించారనీ చెబుతుందా? అందుకే ఏమీ చెప్పకుండా తనకి గుంటూరు బదిలీ అయిందనీ, ఆ వేళ రాత్రే బయలుదేరి వెళ్ళాలనీ చెప్పింది. బదిలీరద్దు చేసుకోడానికి ప్రయత్నించమని ఎంతో బ్రతిమాలింది తల్లి లక్ష్మి చిరాకుగా "వెళ్ళాలి వెళ్ళి తీరాలి. నాకు వెళ్ళాలనుంది వెళతాను. అంతే" అంది మొండిగా. పిల్ల మొండితనం చూసి పార్వతమ్మకు నోట మాట రాలేదు. ఇందులో ఏదో గొడవున్నదనీ, ఇది మామూలు బదిలీ కాదనీ అనుకుంది. ఈ విషయం తనే కనుక్కోవాలి, విడదీయగలిగితే ఈ చిక్కుతానే విడదీయాలి. అంతేగాని ఇది వీరాస్వామి వరకూ వెళ్ళకూడదు. అందుకే పార్వతమ్మ ధైర్యం చేసి మళ్ళీ అడిగింది.

"ఏమయిందమ్మా నీకు, ఎందుకలా మాట్లాడుతున్నావు? మేమిద్దరం కాలం మళ్ళిన వాళ్ళంకదా మమ్మల్ని వదిలి నువ్వు ఒంటరిగా వుంటావా? నీ వెవరో ఏదో చెప్పి పెట్టేరేమిటి?" అంది పార్వతమ్మ.

"నా కెవరూ ఏవీ చెప్పక్కర్లేదు. నేనేం చిన్నపిల్లనా?"

"నిజమే. పెద్దదానివైనావమ్మా! అందుకే కొంచం ఆలోచించు తల్లీ. మేమేం పాపం చేశామని మా మీద నీకేం కక్ష చెప్పు? నిన్ను పెంచి పెద్దదాన్ని చెయ్యడమే మా పాపమా" అంటూ పార్వతమ్మ చీర కొంగుతో కళ్ళు తుడుచుకుంది. తల్లి కన్నీళ్ళు చూడగానే లక్ష్మికి కూడా ఏడుపొచ్చింది.

"అలా చెయ్యకపోయినా బాగుండేదమ్మా. నన్ను చిన్నప్పుడే ఏ నూతిలోనో పారేస్తే బాగుండి పోయేది. నన్నెందుకు పెంచి పెద్దదాన్ని చేశారు మీరు నేను అందరి చేత అవమానాలు భరించడానికా? మా నాన్న నేను పసిపిల్లగా వున్నప్పుడే చచ్చిపోతే నన్ను

చంపి నువ్వు కూడా చచ్చిపోలేక పోయావా? ఏ నూతిలోనో పడలేక పోయావా? నువ్వు ఎందుకీ బతుకు బతికేవు? అందుకు నేను శిక్ష అనుభవించాలా'' అంటూ ఉద్రేకంతో ఉక్కిరి బిక్కిరయింది.

ఇప్పుడు పార్వతమ్మకంతా అర్థమైంది లక్ష్మి ఎందుకు బాధపడుతూందో తెలిసింది. ఏ విషయమైతే లక్ష్మికి తెలియకుండా వుంటే బాగుండుననుకుందో అది తెలిసింది. ఇంక యిప్పుడు చెయ్యగలిగిందేమీ లేదు. లక్ష్మికి ఇరవై ఏళ్ళొచ్చినాయింకా చిన్నపిల్లే. జీవితానుభవం లేదు. లోకాన్ని జీవితాన్ని అర్థం చేసుకునే స్థాయికి రాలేదు. అయినా తాను చెప్పవలసింది తాను చెప్పాలి అనుకుంది పార్వతమ్మ

''పిచ్చి తల్లీ. నే నెందుకు బతికున్నానని అడిగేవు. చదువుకున్న దానివికదా ఆ మాత్రం అర్థంచేసుకోలేవా? మనిషి ఏ బావిలోనో పడి చావడం సులువేనమ్మా. బతికి బయటపడడం, పిల్లల్ని పైకి తీసుకురావడం కష్టంగానీ. మీ తండ్రి చచ్చిపోయాక ఆర్నెల్ల పాపను పెట్టుకుని దిక్కులేక తిండికి మలమల మాడుతూ నిస్పృహతో ఆత్మహత్య చేసుకుందా

మనే అనుకున్నానమ్మా. కాని నాకిక్కడ ఆశ్రయం దొరికిందమ్మా. అభయం లభించింది. మనిషిగా బతికే అవకాశం వచ్చింది. మనిషి చచ్చి సాధించేదేమీ లేదనీ, బతికి జీవితం సార్థకం చేసుకోవాలనీ నిశ్చయించుకున్నాను. బి. ఏ. లూ ఎమ్. ఏ. లూ చదివిన వాళ్ళలోనూ, వేలూ లక్షలూ డబ్బు గడించిన వాళ్ళలోనూ లేని సంస్కారం వీరాస్వామిలో నాకు కనిపించిందమ్మా. మేమిద్దరంఒకే లక్ష్యంతో కలసివున్నామమ్మా. నిన్ను పెంచి పెద్ద చదువు చెప్పించి వృద్ధిలోకి తేవడానికి మేం బతికేం తల్లీ, అందుకోసమే మేము లోకాన్ని లెక్కచేయలేదు. మనుషుల్ని సహజమైన బతుకు బతకనీయకుండా హానిచేసే లోకనియమాలను మేములక్ష్యపెట్టలేదు తల్లీ. ఇందులో నేను సిగ్గుపడవలసినదేమీ లేదమ్మా. మనం ఇతరులకు అపకారం చేస్తే సిగ్గుపడాలిగాని మంచిపని చేయదలచుకున్నప్పుడు సిగ్గుపడక్కర్లేదు, ఇంకొకరికిభయపడక్కరలేదు. నిజానికి నిన్ను ఇంతదాన్ని చేయగలిగినందుకు, మేము సంతృప్తిగా బతికి మా బతుకులు సార్థకం చేసుకున్నందుకు మాకెంతో గర్వంగా వుందమ్మా” అన్నది పార్వతమ్మ. తల్లి చెప్పిన మాటల్లో ఏదో నిజం, ఏదో ఒక కఠినమైన సత్యం వున్నట్లు అనిపించింది లక్ష్మికి.

కాని ఏమైనా సరే కొన్నాళ్ళపాటు ఈ వూరు వొదిలి వెళ్ళడమే మంచిదనుకుంది. ఊళ్ళోవాళ్ళకీ, రామారావుకీ కొన్నాళ్ళు దూరంగావుంటేగాని తన మనసు శాంతించదు. అందుకే తానా రాత్రి గుంటూరు ప్రయాణం మానుకోలేనని చెప్పింది.

లక్ష్మి మనసు మెత్తబడిందని గ్రహించింది పార్వతమ్మ. క్రమంగా లక్ష్మి ఈ గందరగోళంలోంచి బయటపడగలదనే నమ్మకం కలిగింది.

(సశేషం)

రచయితలకు మనవి

కథలు, వ్యాసాలు ప్రచురణార్హము కానిచో త్రిప్పి పంపగోరువారు తగినన్ని స్టాంపులు అతికించిన కవర్లు జతపరచి పంపవలసినదిగా కోరుతున్నాము. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

కథలు ఫుల్‌స్కేప్ సైజులో పది పేజీలు. వ్యాసాలు నాలుగు పేజీలు మించకుండా పంప ప్రార్థన.

—ఎడిటర్.

ఉగాది సూర్యుడు

కొత్త చిగురు తొడిగి
నిన్నటి చిగురు కుట్టుకోవచ్చని ఆశ.
కనిపించని గడుసుప్రాణి
అనిపింపజేసిన మామిళ్ళకూతలు
మొన్ననూతబడిన స్వరధునులు
రసధునులు కాగలవనే ఆకాంక్షలు.
గతంకళతం వెళిపోయి
మిగిల్చిపోయిన అనుభవం పాపాయిని
కొత్తరూపుతో, కొత్తగొంతుతో
పెంచుకుంటూ పోవడంకోసం
నా ఆకాశం ముంగిట ఇదిగో మళ్ళీ
ఉగాది సూర్యుడు ఉదయించాడు.
ప్రమాదీచ పేరుచెప్పి
గుండెగడపనెక్కాడు.
జ్యోతిలో నింపుకున్న
ఈ కవితావరణలో
శుభాకాంక్షాపరస్పర పరిష్వంగనలకై
ఇప్పుడు అందరిలో నేను
నాలో అందరూ ఇకపై.

—సుధామ.



పగ

యస్. పురుషోత్తమాచార్య

కుక్కి మంచంలోంచి కుమిలి పోతున్న మనస్సు నరికట్టుకుని దిగ్గున లేచి నుంచున్నాడు శేషగిరి. ప్రతీకారవాంఛ పడగలెత్తిబుస కొట్టసాగింది. మెలికలు తిరిగిన కండరాలుగల తన దేహాన్ని క్షుణ్ణంగా పరీక్షించుకున్నాడతను. నిగనిగ లాడు



తూన్న తన శరీరం రఘుపతి పెంపకంలో నిగ్గుతేరింది. తను అతని ఉప్పు తింటూ బ్రతుకుతున్నాడు.

శేషగిరి మేధస్సు క్షణం మూగవోయింది.

"యిన్నాళ్ళూ తను బ్రతికింది ఎవరి కోసం?" ప్రశ్నించుకున్నాడతను.

అతని అంతరంగం మారు పలికింది.

"రాజ్యం కోసం! నీ చెల్లిలి సౌభాగ్యం కోసం!"

"అవును! తను బ్రతికింది రాజ్యం కోసమే! కాని రాజ్యం సౌభాగ్యమూ, మాన ప్రాణాలూ, రెండూ మంట గలసిపోయాక కూడా తానెందుకు బ్రతికి వున్నట్టు?"

"రాజ్యం కోసమే!" అంతరాత్మ అరిచింది.

నిజం! తాను జీవించి వున్నది నిజం! కాని తను [illegible]ప్రాణంతో, కొన ఊపిరి

వున్న మనిషిపడే వేదనను యింటివ ఎను బాధని గరళంలా మ్రింగుతూ ఈలోకంలో యింకా జీవించే వున్నాడు.

"ఎందు కోసం?"

"నీ చెల్లెలికోసం! ఆ గొంతు కోసిన వ్యక్తిపై ప్రతీకారాన్ని తీర్చుకోవటం కోసం!" అంతరాత్మ ఖచ్చితంగా పలికింది.

నిజం! నిజం! తను జీవించి వున్నది అందుకొరకే! తనలో దావానలంలా దహించి వేస్తోన్న ప్రతీకార వాంఛ తనకు జీవాన్ని పోస్తోంది. రాజ్యం రగిల్చి వెళ్ళిన పగల సెగల ఆవిర్లు తనకు ప్రాణాన్ని పోసి యింకా నిల్పుతున్నాయి.

"కాని పగసాధించేదెవరిపై."

"రఘుపతిపై!"

"ఎలా? ఎలా కోరేవు చెల్లీ? రఘుపతిపపై శేషగిరిక్ని పగ జనించదని!"—శేషగిరి అరుస్తూ కుప్పలా కుక్కి మంచంలోకి జారేడు. అతని అరవులు పెంకుటింటి కప్పు చిల్లులోంచి దూసుకుపోయేయి.

దోసిల్లో మొహాన్ని చేపగిలవేసి నిర్లిప్తంగా ఆలోచనలోకి జారేడు శేషగిరి. అలజడి గమనించి పడగనేల వాల్చి పరుగులు తీసిన నాగరాజులా అతని ఆవేశం చప్పున చల్లారిపోయింది.

"అన్నయ్యా!"

రాజ్యం కంఠస్వరం వినిపించినట్లు ఆ చెంత. ఏ [illegible] పన! మంచంలో కూర్చునే చుట్టూ కలయ చూచాడతను. ఎక్కడ చూచినా ఏ వైపు పరికించినా రాజ్యం వదనమే లీలగా కనిపిస్తూన్న అనుభూతికి లోనయ్యాడతను. చివరికి కండ్లు గట్టిగా మూసుకున్నాడు.

మనుషుల్లోని రంగులింత త్వరగా మారతాయని తానెన్నడూ విశ్వసించలేదు. తన్ను కుడి భుజంగానూ, రాజ్యాన్ని సోదరిగానూ స్వీకరించిన రఘుపతి నైజంలో యింతటి మార్పు రావటమూ, తద్వారా యింతటి నైచ్యాని కొడిగడతాడని తాను స్వప్నావస్థలో కూడా ఊహించలేక పోతున్నాడు. అందుకే తొలికోడి కూసేవేళ ప్రాణాలు వదులుతోన్న తన చెల్లెలి నోటనే ఆ విషయం విని కూడా తను నమ్మలేక పోతున్నాడు. తను తింటోన్న ఉప్పుకలిగించిన ఘాఢమైన నమ్మకమది!

"కాని జరిగిందేవిటి?" సింహావలోకనం చేసుకోసాగాడు శేషగిరి.

—రఘుపతి పెద్ద దామందు! తను ఫోర్తు ఫారం దాకా చదువుకున్న అతని పరిచారకుడు. అతను వేటకెళ్ళినప్పుడు టాపులేని జీపులో వెనుక వైపునుంచి లోనికి దూకనున్న చిరుతపులికి ఎదురుగా నిలిచిన తన బలమైన పిడికిలిపోటు దాని డొక్కలో శరాఘాతంలా పనిచేసింది. నాటినుంచే తను అతని కుడి భుజమూ

బహిఃప్రాణమూ అయి కూర్చున్నాడు. ఆ రోజున్నే వేట ముగిసింతర్వాత తనని తమ పెంకుటింటి ముందు దింపుతుండగా వెలికి వచ్చిన రాజ్యాన్ని "చెల్లెమ్మా!" అని సంబోధించిన రఘుపతి నెలా అనుమానించేది?

పంచినీళ్ళకని వెళ్ళి దిగుడు బావిలో జారిపడిన రాజ్యాన్ని తన కళ్ళముందే పట్నం డాక్టరు దగ్గరికి తీసికెళ్ళి ఆదుకున్న రఘుపతే ఈ నేరంచేసి వుంటాడా? తను నెల్లూరి కోడెల్ని ఖరీదు చేయటానికి వెళ్ళిన పది రోజులూ తన చెల్లెలి ఆలనా పాలనా గమనించిన రఘుపతిబాబు నెలా అనుమానించేది?

కాని తను నెల్లూరినుంచి రాగానే రాజ్యం ఏమంది?

"అన్నయ్యా! పెద్ద కాపందులకు మనింట ఏం పని? ఆయన అనుక్షణమూ మనింటికి రావటం నా కెంత మాత్రమూ ఇష్టంలేదు." రాజ్యం పలుకుల్ని తానా నాడు వినిపించుకోకుండా ఎలా వుండగలిగేడు? తనందంత మట్టి బుర్రేం? అవును! రాజ్యం తనది మట్టిబుర్రనే అంటూ వుండేది. కావచ్చును మరి!

శేషగిరికి తల బద్దలయిపోతున్నట్లుగా తోచింది. కాళ్ళు ముడుచుకుని కణతలు నొక్కుకుంటూ కళ్ళు గట్టిగా మూసుకున్నాడు.

"రాజ్యం చితి యింకా ఆరలేదేమో?" గొణుక్కున్నాడతను. రాజ్యంలేని ఆ యింట్లో పదహారు గంటల కాలం నిశ్శబ్దంగా గడిచింది. మళ్ళీ అతనిలో ఆలోచనలు ముసురుకోసాగాయి.

రఘుపతి తండ్రిగారి హయాం నుండే ఆ కుటుంబానికి అనుచరులుగా సాగి వస్తోన్న తమ సంబంధాలు తననీ నాడు రఘుపతికి కుడిభుజంగా నిలబెట్టాయి. గ్రామంలో రఘుపతికెంత పలుకుబడి వుందో తనక్కూడా అతని మూలంగా అంతే వుండేది. అతనిక్కూడా భయపడని వారు తనని సింహస్వప్నంగా తలపోసేవారు. కాని ఈ స్వల్ప వ్యవధి అనగా ఈ పదహారు గంటల కాలంలోనే తనని ఎంతో లోకువగా చూస్తున్నారెందువల్ల ?

"అయ్యో పాపం!" అనిపించుకుంటున్నది పదహారు గంటల క్రితమే కాలగర్భంలో కలసిపోయిన తన ఒక్కగానొక్క చెల్లెలు రాజ్యం.

కాని తను? "చచ్చు వెధవ! కండబలమేగాని బుద్ధిబలం లేని దౌర్భాగ్యుడు! పౌరుషంలేని బడుద్ధాయి!" యిలా ఎన్నో రకాల వాఖ్యానాల్ని పదహారు గంటల కాల మధ్యంలోనే విన్నాడు.

శేషగిరి విసురుగా లేచి నుంచున్నాడు.

కిటికీ వంక చూచాడు.

ఆవల చీకటి చిల్లుల కంబళిని సవరించుకొంటోంది. అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ

సైరన్ ధ్వని దూరంగా రైల్వేస్టేషను ప్రక్కనుంచి వినిపిస్తోంది. సాయంకాలం ఏడయింది.

చలిగాలి ఝంయ్! మంటూ వీచింది, దీపం నిలువెల్లా ఊగిపోయింది. శేషగిరి నీడ గోడపై అల్లల్లాడింది. దీపాన్ని కిటికీలోంచి తీసి వెనక్కి నడుస్తూ పక్కన ఆగిపోయాడతను. కిటికీ తలుపులు దడదడ లాడాయి. దీపం ఆరిపోయింది. అతని మస్తిష్కం తీవ్రంగా పనిచేయసాగింది.

తను గత సాయంకాలమే క్రొత్తగా ఖరీదు చేసిన కోడెల్ని పొలంనుంచి తోలుకొస్తున్నాడు. శివాలయం దాపులోకి రాగానే చెప్పుల్ని విడిచి నమస్కరించటం తన కలవాటు. తను అప్పుడే విన్నాడు.

"అన్నయ్యోయ్!" అనే ఆక్రందనని. ను ఎన్ని జన్మల పాపాన్ని మూటకట్టుకున్నాడో? అందుకే అప్పుడు రాజ్యం గొంతుకని పోల్చుకోలేకపోయాడు.


అప్పుడే శివుని గుడిలోంచి ఓ ఆకారం పరుగెత్తింది. గాజులు గలగల్లాడాయి. ఆ స్త్రీ ఆకారాన్ని తరుముతూ మరో వ్యక్తి వెడుతుండడం లీలగా కనిపించింది.

"పాణీ! నీ వాప్రక్కనుంచి రా!" ఆ స్త్రీని తరుముతూన్న మనిషి ఎవరినో హెచ్చరించింది.

దాంతో మరో నీడ రెండవవైపుకు పరిగెత్తింది. ఇంతలో తన చేతి నుండి ఓ నెల్లూరి కోడె తప్పుకొంది. సందిగ్ధంలో పడిపోయాడు తను. పల్లెటూరిలో సర్వసాధారణంగాజరుగుతూండే ఇలాంటి గొడవల్లో కాలు దూర్చేదా? లేక కొత్తగా కొన్న కోడె దూడ జాడకెళ్ళేదా? ఏదో మొగుడూ పెళ్ళాల గొడవ కావచ్చునని తాను సరిపెట్టుకుని కోడె వెళ్ళిన దిశకి పరిగెత్తేడు. దాన్ని వెంటనేపట్టుకోని పక్షంలో అది నెల్లూరి వైపు పరుగు తీస్తుంది. పశువు క్రొత్తచోట మచ్చికయ్యే వరకూ ఆ కొన్న వాళ్ళు పడేబాధని అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది. చివరకి దాన్ని చాలా దూరంలో పట్టుకుని పశువుల దొడ్లో కట్టేసి యింటికెడుతూ అలవాటు ప్రకారం పశుపతిబాబుకి చెప్పటానికి వెళ్ళాడు. అప్పుడతను దీర్ఘాలోచనలో మునిగిపున్నాడు. తనను చూచి ఉలిక్కిపడినట్లుగా యిప్పుడు జ్ఞాపకం వస్తోంది.

"వెళ్ళొస్తానండి!" అన్నాడు తను. "వెళ్ళచ్చుండవోయ్!" అంటూ ప్రతిరోజులా పలక్కుండా పశుపతి మౌనంగా అంగీకార సూచకంగా తలూచటం తన నెంతో ఆశ్చర్యపరచింది.

తను యిల్లు చేరేసరికి రాజ్యం ఇంట్లో లేదు. ఆవిడ గురించి ప్రక్కింట్లో వాకబు చేయగా బంగారయ్య శెట్టింట్లో పేరంటానికెళ్ళిందని తెలిసింది. చాలాసేపు ఎదురు చూసి విసిగి తను బంగారయ్య శెట్టింటికి వెళ్ళాడు. చీకటిపడకముందే అక్కడ



నుంచి వెళ్ళిపోయిందట రాజ్యం. మరె
క్కడి కెళ్ళివుంటుందో తెలీక ఆవిడ
తరచూ వెళ్ళే యిళ్ళన్నీ తిరిగివస్తూ వచ్చి
బండకేసి చూడగా అక్కడ జనం గుమి
గూడి వుండడం గమనించి అటుకేసి వెళ్ళ
టంతోనే తెలిసిన విషయం వినగానే తన
అరికాళ్ళ క్రింది నేల కదిలిపోయినట్ల
యింది. లోకంలో తనని పన్నెండో ఏటా
రాజ్యాన్ని ఎనిమిదో ఏటా వదిలి గోదా
వరి వడవమునకలో ప్రాణాలు కోల్పో
యారు తన తల్లిదండ్రులు. ఆనాటి నుంచీ
రాజ్యాన్ని తన చేతులపై పెంచాడు తను.
ఆ రాజ్యం కాస్తా మంచినీళ్ళ బావిలో పడి
పోయిందన్న సంగతి తెలియగానే తనకేమీ
తోచక పిచ్చిగా ఆ వంక పరుగుతీశాడు.

కొన ఊపిరివున్న తన చెల్లెల్ని తన
చేతులతోనే బావిలోంచి పైకి తీశాడు తను.
చివరిసారిగా కన్ను తెరిచిన రాజ్యం
తన్ను మనసారా తడుముతూ అన్న
మాటలే తనప్రాణాల్ని ముక్కలుముక్క
లుగా చెక్కేస్తున్నాయి.

"అన్నయ్యా! రఘుపతి.... వాడు....
వాడు.... నన్ను నాశనం చేశాడు.... వాడి
అంతం చూడు!...." అంటూండగానే
రాజ్యం కళ్ళు మూతలు పడ్డాయి. అంతే:

తన చెల్లెలి చితి మండింది. ఇంకా మండు తూనే ఉండవచ్చు.

తన చెల్లెలి శీలాన్ని దోచుకుని దాని మరణానికి కారణ భూతుడయిన వాడు రఘుపతేనన్న విషయాన్ని ఊరంతా నమ్ముతోంది. కాని తనే నమ్మలేక పోతు న్నాడు. హఠాత్తుగా అతని వెన్నునెవరో చరిచినట్లయింది.

"మరి! మరి! శివాలయం? ఆ ఆక్రం దన." శేషగిరి హృదయం ఘోషిల్లుతూ గర్జించింది.

"పాణి!" తను విన్న పేరు తటాలున బుర్రలోకి వచ్చింది శేషగిరికి. గుండెల్లో అగోచరమయిన గుబులు బయలుదేరింది. పాణి!? రఘుపతి తన తరఫున ప్రక్క గ్రామంలోని ఎన్నికల్లో అతన్ని నుంచో బెట్టేడు. నిజం నిప్పులా కనిపించింది శేష గిరికి.

అతను యింట్లోంచి తూనీగలా పరి గెత్తా డవతలికి. పలుపు లెన్నో వెనుక బడిపోయాయి. చెరువుకట్టా, కాలువగట్టూ అన్నీ వెనకబడ్డాయి. ప్రక్క ఊరి నిర్మా నుష్యపు వీధుల్లో నడవసాగేడతను. పాణి యింటి దాపులోకి రావడంతోనే ఏవో మాటలు లీలగా వినిపించసాగాయి.

"తన కుడిభుజంలాంటి శేషగిరి చెల్లెల్నే నాశనం చేసేడుగదా? మన క్కూడా అలాంటి అపకారమేదీ రఘుపతి తల పెట్టడన్న నమ్మక మేవిటి? పోలిం గయ్యేలోగా ఏదో ఒకటి నిర్ణయించుకో వాలి మనం." అంటున్నా రెవరో.

"అవును. అదీ నిజమే! రాత్రి ఆ వెధవపనికి సహాయం కూడా తీసుకోవటం నాకెంతో బాధగా వుంది. పాపం! ఆ పిల్ల ప్రాణాన్ని నిలుపునా తీసుకుంది" అంటూన్న పాణి కంఠస్వరాన్ని విన్నాడు శేషగిరి.

అంతే!

సర్పానికి విషం కోరల్లోకి వచ్చినట్లుగా శేషగిరి అంతరంగంలోంచి ప్రతీకార వాంఛ పళ్ళ మధ్యకి వచ్చి నలిగిపోయింది. అతని ప్రక్కటెముకల అంతర్భాగంలో చేటలు విసిరినట్లుగా ఊగిసలాడసాగా యతని శ్వాసకోశాలు.

శేషగిరి కదిలేడు. ఈసారి అతను పరుగెత్తటం లేదు. అతని ఎదజ్వలించి పోతోంది. ఆవేశార్ద్ర నయనాలతో భారంగా కదులు తున్నాడతను. తమగ్రామం పొలి మేరలోకి రాగానే అతని అడుగులు కాస్త వడివడిగా పడసాగేయి.

తలుపులు తెరిచి క్షణం ఆగేడు శేష గిరి. గదిలో ఓ మూలగా నుంచో బెట్టిన గునపం అతని మనసులో మెదిలింది. దాన్నందుకుని విసురుగా భుజాన వేసుకుని కదిలాడతను. ఈసారి అతని ప్రతి అడుక్కీ నేల అదిరి పోసాగింది.

అర్థరాత్రి!

రఘుపతి యింటిగేటు వేసివుంది. పిట్ట

గోడ ఎక్కి నడుస్తూ మేడపైకి సులభంగానే చేరాడు శేషగిరి. గదిలో వెలుగు కనిపిస్తోంది. కిటికీ సందుల్లోంచి చూచాడు. గది మధ్య మంచంలోంచి బిక్క చచ్చి కూర్చుని వున్నాడు రఘుపతి. దిక్కులు చూస్తూన్న రఘుపతినా స్థితిలో చూచిన శేషగిరిలో ఆవేశం కట్టలు త్రెంచుకొంది. తలుపును గునపంతో ఒక దెబ్బ వేసేసరికి రెక్కవిరిగి నేలపై పడిపోయింది.

ఎగిరి పడ్డాడు రఘుపతి. అతని చేతిలో పిస్టల్ నిగనిగ లాడుతోంది. కాని అతను వణికిపోతున్నాడు. కాల్చాలన్న వివేకం నశించింది మనిషిలో.

శేషగిరి గునపాన్ని లేవనెత్తేడు విసురుగా.

రఘుపతి భయంతో వెర్రికేక వేయటానికి నోరు తెరిచేడు కాని అంతలోనే "కెవ్వు!" మన్న కేకవినిపించింది. అది ఓ స్త్రీ కంఠస్వరం! ఎక్కణ్నుంచో దీనంగా వినిపిస్తోంది. శేషగిరి ఆగిపోయేడు.ఆ కంఠస్వరం రాజ్యం ధ్వనిలా తోచిందతనికి. దాంతో అతను వచ్చిన పనిని మరిచి పోయాడు. లతనిలోని మానవత్వం మేల్కొంది. గిర్రున వెనుదిరిగి పిట్ట గోడదూకి ఆ కేక వినిపించిన వైపుకు పరిగెత్తాడతను.

రఘుపతి ఆ సంఘటనతో కోలుకోగలిగేడు. వికటాట్టహాసం చేస్తూ మరో గదిలోకెళ్ళి తలుపులు మూసుకున్నాడు.

రఘుపతి యింటి వెనుక పెరట్లో మామిళ్ళ మధ్య ఎవరో పెనుగులాడుతూ వుంటం గమనించాడు శేషగిరి. మసక చీకట్లో కనిపిస్తోన్న స్త్రీమూర్తి రఘుపతి భార్య నర్మద! ఆమెని బలాత్కరిస్తూన్న వ్యక్తి ఆవిడ మేనబావ భుజంగరావు.

క్షణం శేషగిరిలో జ్ఞాపకాల తెరకదలాడింది. నర్మదను రఘుపతితో వివాహం కాకముందు ఆవిడ తలిదండ్రులు రామెని భుజంగానికే యివ్వాలనుకోగా ఆవిడ అంగీకరించకపోవటం విషయ మతనికి తెలుసు. కాని యిప్పుడీ భుజంగరావక్కడికెలా తయారయ్యాడో అతని కెంతకీ అంతు పట్టలేదు.

నర్మద గింజుకొంటూ మళ్ళీ అరిచింది నిస్సత్తువగా.

రోగి: నాకేంటో అప్పుడప్పుడూ నన్ను చంపేసుకోవాలని పిస్తుందండి డాక్టారూ!

డాక్టరు: ఆ సంగతి నా కొదిలెయ్యవోయ్!

రాజ్యం జ్ఞాపకం వచ్చింది శేషగిరికి. అతనిలో ఆవేశం ఆవహించింది. తన చెల్లెలికి చేసిన అన్యాయానికి రఘుపతికీ ఏకంగా విధి ప్రతీకారించబోతోంది. పతిత కానున్న భార్యతో అతను జీవితాంతమూ కుమిలి చావాలి! చాలు! అతనిపై పగ యిక సాధించేదేమీ లేదనుకుంటూ వెనుదిరిగిపోయాడతను.

నర్మద అసహాయంగా మరోసారి కేక వేసింది.

శేషగిరి ఓ అడుగు వెనక్కి వేసేడు.

నర్మద దీనంగా భుజంగరావుని ప్రార్థిస్తోంది.

శేషగిరిలో ఆవేశం స్థానే కరుణ నిండుకుంది. అతనికీ రాజ్యానికి జరిగిన అవమానం కళ్ళముందు భయంకరంగా కనిపించింది. "అంతే? ఈ దుష్కార్యం తర్వాత నర్మద కూడా నిండు ప్రాణాన్ని బలవంతంగా కోల్పోతుందా?"

జరగబోయేదతని కళ్ళముందు కదలాడింది.

వెనక్కి విసురుగా తిరిగేడు.

తన చెల్లెలికి జరిగిన అన్యాయం లాంటి దెవరికయితేనేమి? మరో స్త్రీకి జరగరాదు.

త్వరపడ్డాడు శేషగిరి.

గునపాన్ని బలంగా భుజంగరావు వంక విసిరేడు. దానికి విద్యుద్ఘాతంలా తగిలిన గునపం దెబ్బకి విరుచుకు పడ్డాడు భుజంగరావు. నర్మద అతన్ని తప్పించుకోబోయి జారిపడటంలో నుదుటికి దెబ్బ తగిలి స్పృహ కోల్పోయింది. కంగారులో పరిస్థితిని గమనించకుండా ఆవిడను లేవనెత్తడానికి వంగేడు శేషగిరి.

అంతే!

అలా వొంగిన శేషగిరి వెన్నులోకి అప్పుడే వెనుక వైపునలేచి నుంచున్న భుజంగరావు చేతిలోని గునపం విసురుగా దూసుకెళ్ళింది.

"అమ్మా!" అన్న ఆర్తనాదం నిశీధిలో ప్రతిధ్వనించింది.

మేడ మీద రఘుపతి అదిరిపడ్డాడు!

ఊరు ఉలిక్కిపడి లేచింది!

అప్పుడే తొలికోడి కూసింది!!



గాడ్రాలి

పవని నిర్మలప్రభావతి

"ఈరోజు హైద్రాబాదు నుంచీ, రాలొచ్చాయి జయా!" గది విజయవాడనుంచీ రెండుత్త గుమ్మంలో అడుగెడుతూ

అంటూన్న భర్త మాటలకు, కుట్టుమిషన్ ముందు కూర్చుని, గౌనుమీద ఎంబ్రాయిడరీచేస్తున్న జయమ్మ తలెత్తి చూసింది. "విశేషా లేమిటి?" అన్నట్లు కళ్ళెగరేసింది

విజయవాడలో మీ తమ్ముడి పెళ్ళి ముహూర్తం పెట్టుకున్నారుట. నిన్నూ, నన్నూ త్వరగా బయల్దేరి రమ్మనమని, మీ నాన్నగారు, అమ్మ, అన్నయ్య, వదిన ఒకే కవరులో నీకూ, నాకూ తలకో పేజీ వ్రాసేశారు!" నవ్వుతూ అన్నాడు గోపాలరావు.

"ఉహూఁ! రెండు రోజులు ముందుగా వెడితే చాలులెండి. మా అక్కయ్యలూ, చెల్లాయీ ఎలాగూ ముందుగా వస్తారు. మిమ్మల్నిక్కడ ఇబ్బందిపెట్టి, నే వెళ్ళి మాత్రం చేసేదేముంది? మరా రెండో ఉత్తరం?" అంది జయలక్ష్మి, గౌను జాగ్రత్తగా మడిచి మిషన్ డ్రాయర్లోపెట్టి మిషన్‌మీద డోమ్ వేస్తూ.

"హైద్రాబాద్‌లో వున్న నా స్నేహితుడు రామారావుకు, అనాథ శరణాలయంలోని ఓ బిడ్డను తెచ్చుకుని మనం పెంచుకొనే విషయంలో, ఆ అనాథ శరణాలయం అధికారులతో మాట్లాడి, వారి నిబంధనలేమిటో వ్రాయమని వారంరోజుల క్రితం ఉత్తరం వ్రాశాను. అతడా వివరాలన్నీ వ్రాశాడు. ఓ పది రోజుల్లో వచ్చి, మనకు నచ్చిన బిడ్డను తీసికెళ్ళచ్చని వ్రాశాడు.

"ఉహూఁ! ఎలాగూ విజయవాడ పెళ్ళికి వెడుతున్నాంగదా? అటునుంచటు వెళ్ళివద్దాంలెండి, మీకు వీలైతే!" అంది వంటింటికేసి నడుస్తూ.

క్షణకాలం గోపాలరావు నివ్వెరపోయాడు. తను చెప్పిన రెండు కబుర్లూ ఆమెలో తనాశించిన ఉత్సాహాన్ని కలుగ చేయలేదు. పైపెచ్చు "చూద్దాంలెండి" అన్న ధోరణిలో నిర్లిప్తంగా వుంది! "భోజనం చేద్దురుగాని రండి!" అంది జయలక్ష్మి లోపల్నుంచి.

డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని, మౌనంగా తలవంచుకొని అన్నం కలుపుకుంటున్న ఆమెకేసి చూస్తూ అన్నాడు గోపాలరావు. "ఇంతకూ నీకు ఆడపిల్లని పెంచుకోవాలనుందా, మగపిల్లాణ్ణా?"

ముద్ద నోట్లో పెట్టుకోబోతున్న జయలక్ష్మి మృదువుగా నవ్వింది. "ఇంకా పదిహేను రోజులు పైముందిగా. ఇద్దరం నిదానంగా ఆలోచించుకుందాం. మీరు భోజనం చెయ్యండి. మీకు కాలేజీకి టైమ యిపోతుందల్లే వుంది!"

ఇక తరచి తరచి అడిగినా ఆమె ఏమీ చెప్పదని తెలుసు గోపాలరావుకు. మౌనంగా భోజనం ముగించి వెళ్ళిపోయాడు. ఆయన కారు కదలివెళ్ళాక,

...యి ఎన ఎనుఅయిగుతున్న జయలక్ష్మికి, ఎదురింట్లో వుంటున్న బ్యాంకి ఏజంటు ప్రభాకరరావు భార్య రేణుక మాటలు గట్టిగా వినిపించాయి.

"ఆవిడే జయలక్ష్మిగారంటే! ప్రొఫెసర్ గోపాలరావుగారి భార్య. పిల్లల్లేరు పాపం!"

చివ్వున వెనుదిరిగి చూసింది జయలక్ష్మి. రేణుక ప్రక్కవాటాలో కొత్తగా అద్దెకు దిగిన ఎకనమిక్స్ లెక్చరర్ వాసుదేవరావు భార్య పద్మజకు తన పరిచయం చేస్తోందన్నమాట! ఆ చివరి "పాపం!" ఏమిటో బోధపడలేదు జయలక్ష్మికి.

"ప్చ్! అందుకే అదోలా వుంది!" పద్మజ సానుభూతి చూపుతోంది.


"ఎలా వున్నాను?" పెద్దగా అంది జయలక్ష్మి.

అనుకోని ఆ ప్రశ్నకు వాళ్ళిద్దరూ నిర్విణ్ణులైనారు.

"అబ్బే! ఏంలేదు. మిమ్మల్ని పరిచయం చెయ్యమన్నారీవిడ. సాయంత్రం తీరిగ్గా వస్తాం!" అంటూ బెదిరిపోయినట్లు లోపలికి పరుగెత్తింది రేణుక. ఆ పద్మజ కూడా అనుసరించింది.

"ఛీ....ఛీ.... ఏం మనుషులు!" చిరాకుగా లోపలికి వచ్చింది జయలక్ష్మి. ఇలాటి వారి సానుభూతి అంటే ఆమెకు తగని అసహ్యం. తనకు పిల్లల్లేక పోవడమన్నది. ఎవరినీ బాధించే సమస్యకాదే. ఇదోరకమైన హింసాత్మకమైన ఆనందం! ఎదుటివారిలోని బలహీనతను తెలుసుకుని దానిని పదేపదే గుర్తుచేసి హింసించడం దానికే "సానుభూతి" అని పేరుపెట్టడం ఓ వింత జబ్బు! నిజానికి ఇందాక వాళ్ళిద్దరూ అన్న ఆ "పాపం!" తనక్కాదు. వాళ్ళగురించి, వారిలో జీర్ణించుకు పోయిన "ఆ జబ్బు" గురించీ, తననుకోవలసిన మాట.

మొన్ననో రోజు ఇలాగే ఓ విచిత్రం



జరిగింది. జయలక్ష్మి ఆలోచనలు ఆ మొన్నటి సంఘటనమీదకు మరలాయి.

* * *

శ్రావణ శుక్రవారంనాడు పేరంటాళ్ళతో కళకళలాడి పోతోంది జయలక్ష్మి ఇల్లు. ఆవరణంతా . గేటువరకూ పిల్లల గోలలతో, ఆటలతో మారుమ్రోగిపోతోంది. "పిల్లలెంతమంది జయలక్ష్మి గారూ!" ఎవరో కొత్తావిడ అడిగింది.

మొదట్లో ఈ ప్రశ్న చాలా బాధాకరంగా, భయంకరంగా, అవమానకరంగా తోచేది జయలక్ష్మికి. "లేరు" అని చెప్పేసరికి తలప్రాణం తోకకువచ్చేది.

ఆ వెంటనే రెండో ప్రశ్న వచ్చేస్తుంది. "అసలు పుట్టలేదా? పుట్టి చచ్చిపోయారా?"

"అసలు పుట్టనే లేదు!" అదేదో కేవలం తన తప్పులా చెప్పాలి!

"పాపం!"

"ఇదే అర్థంగాని ముక్క!

"పోనీ... గుంటూరు జనరల్ హాస్పిటల్‌లోనో, వైజాక్ కె. జి. లోనో.... మద్రాస్ జనరల్ హాస్పిటల్లోనో.... ఎగ్జామిన్ చేయించుకోలేకపోయారా? పిల్లలదేమిటి ఈ రోజుల్లో! కావాలంటే పుడతారు. వద్దంటే ఆగుతారు!"

అవి సలహాలు కావు, సానుభూతులు కావు. తన గొడ్రాలితనాన్ని ఎత్తి పొడవటం.... తమ "పిల్లలు కనగల" అర్హతను ఎగ్జిబిట్ చేసుకోవటం.... అనిపిస్తుందాసమయంలో జయలక్ష్మికి.

కానీ రాను రాను ఆమెలో ఓ మొండి ధైర్యం వచ్చేసింది. ఏమిటి వీళ్ళందరిలో వున్నతనం? తనలో లేనిదేమిటి? ఒక్క పిల్లలు పుట్టమన్నదే స్త్రీ వ్యక్తిత్వాన్ని ఒరుపులేయగల అర్హత అయితే పందులు కుక్కలు, పిల్లులు....వగైరాజంతువులు ఒకేసారి ఐదారు పిల్లలను కనగల సామర్థ్యం కలిగి వుండటంవల్ల వీరికంటే గొప్పవి!

"పరధ్యాన్నంగా వున్నారా జయలక్ష్మి గారూ! మీ కెంతమంది పిల్లలని....కొత్తగా వచ్చిన సుభద్ర గారడుగుతున్నారు! గట్టిగా పిలుస్తూ అంది వైదేహి. కవల లిద్దరూ చాలా చక్కగా అందంగా, బొద్దుగా వుంటారని ఆ వీధి వారంతా ముద్దు చేస్తుంటారు. అదోగర్వం వైదేహికి! జయలక్ష్మి ఆలోచనలు వదిలి. నవ్వింది "చాలా మంది. లెక్కపెట్ట లేదు."

వైదేహితో బాటు సుభద్ర కూడా "షాక్" తిన్నట్లు చూచింది. అంతలోనే అది కప్పి పుచ్చుకుంటూ నవ్వేసింది "పిల్లులూ, కుక్కపిల్లలూ కాదండీ జయలక్ష్మిగారూ! పిల్లలు...."

"అవుననుకోండి. మనుషులకంటే మీరు చెబుతున్న ఆ పిల్లులూ, కుక్కలే

నయం. వాటికెంతో విశ్వాసముంటుంది. మాటలతో వాదించపు ఎపుటి వారిని. ఎందుకూ నా పిల్లల సంఖ్య కాదూ లది గారు...షుమారు పాతికమందికి పైగానే వున్నారీ రోజు.

వైదేహికి బాగా కోపం వచ్చింది.

"ఈ వీధిలో వున్న పిల్లలందర్నీ లెక్క-వేసి చెబుతున్నారు మీరు.

"ఎందుకు కారూ? వాళ్ళంతా నా దగ్గరకు ప్రేమగా వస్తుంటారు. నేనూ వాళ్ళను ప్రేమగానే చూస్తున్నాను. కాకున్నా, బ్రతికుండగానే తలిదండ్రులకు తల కొరివి పెట్టె పిల్లలు పుట్టడంకంటే, ఇలా పిల్లల్లేని తల్లిగా, గొడ్రాలిగా వుండటమే నాకు హాయిగా వుంది. అందుకు నేనెప్పుడూ బాధపడను!"

ఈ చివరి బాణం, నేరుగా వైదేహికి గుచ్చుకుంది. ఆమె తలిదండ్రులకు నలుగు రాడపిల్లలు. ఒక్క-డే కొడుకు. రెండోదైన వైదేహి, ప్రేమలోపడి, కులాంతర వివాహం చేసుకుని, వాళ్ళ కుటుంబానికి చిచ్చు పెట్టింది. అసలే అతి ఆచారాలతో మ్రగ్గే కుటుంబం కావటంవల్ల, మిగతా ఇద్దరాడపిల్లలకూ పెళ్ళిళ్ళు కావటం సమస్యైపోయింది. ఆ ఒక్క- "మగబిడ్డ" అతిగారాబంగా పెరిగి, వెధవలా తయారై అమ్మ నాన్నలకు తల కొరివిలా తయారయ్యాడు....ఈ వివరాలన్నీ వైదేహి ఇక్కడి కొచ్చిన కొత్తల్లో ఇతరుల కబుర్లే మోసుకురావటం "హాబీ" గాగల మీనాక్షి చెప్పింది.

వైదేహి ముఖం మాడ్చుకుంది. ఆ పేరంటం ఇక ఆప్టే సంభాషణలు లేకుండానే ముగిసింది. ఆ తర్వాత ఇంటికివచ్చే పిల్లల సంభాషణ ద్వారా జయలక్ష్మికి తెలిసింది "ఆ జయలక్ష్మిగారికి చాలా తల పొగరు. లయిందానికీ కానిదానికీ కాలికి కత్తి కట్టుక వస్తుంది." అని వైదేహి ప్రచారం చేస్తోందట!"

జయలక్ష్మి నవ్వుతుంది. తనను అనవసరంగా రెచ్చగొట్టి, మాటలతో హింసించే కుసంస్కా-రులకు సరైన సమాధానం చెప్పటమే "తల పొగరు" అయితే.... పొగరు జన్మజన్మలకూ తన కుండాలని కోరుకొంది.

ప్రతిరోజూ సాయంత్రం మయ్యేసరికి ఆ వీధిలోని పిల్లలందరూ జయలక్ష్మిగారి ఇంటి ఆవరణలోకి వచ్చి ఆడుకుంటారు. ఆ ఇల్లు వీధి చివరగా వుండటమూ, చుట్టూరా ఎక్కు-వగా ఖాళీ స్థలం వుండటం ఒక్క-టే కాదు కారణం. జయలక్ష్మి వారం దరిపట్ల చూపే ఆదరణ. పిల్లలకోసం ప్రత్యేకం ఇనుప గొలుసుల ఉయ్యాల వేయించిది. ఉయ్యాల చుట్టూరా మెత్తని ఇసుక పోయించింది. పిల్లలెవరేనా పడినా దెబ్బ తగలకుండా పిప్పరమెంట్లో, బిస్కెట్ ముక్క-లో, జంతికలో, చేగోడీలో, ఏవో ఒకటి తల కొకటి పెడుతూ

ఖబుర్లు చెబుతుంటుంది వాళ్ళతో "అత్తా", 'పిన్నీ," అంటూ అందరు పిల్లలూ హుషారుగా వుస్తారు. ఇళ్ళల్లో జారికి "వెధవా అల్లరి చేస్తే చంపేస్తాను. బట్టలు మాపుకొంటే ఛావ కొడతాను!" వగైరా దీవెనలే ఎదురౌతాయి ఎక్కువగా.

మొన్ననో రోజు పనిమనిషి సుబ్బులు కూతురు నాలుగేళ్ళది, తనూ ఉయ్యాల ఎక్కి ఊగాలని వస్తే, లెక్చరరుగారబ్బాయి రఘు నాలుగు తగిలించాడు. ఇంట్లో పని చేసుకుంటున్న జయలక్ష్మి ఏడుపువిని పరుగెత్తుకువచ్చి "ఏమిటంది?"

"చూడత్తా! ఈ మురికిపిల్ల ఉయ్యాల ఎక్కుతానంటోంది. పనివాళ్ళ పిల్ల ఎక్కడేనా ఉయ్యాలమీద కూర్చోవచ్చా?" ఆరిందలా చేతులు తిప్పుతూ చెప్పాడు రఘు. ఫక్కున నవ్వింది జయలక్ష్మి వాడి మాటలకు. అంతలోనే గంభీరంగా మారిపోయింది. "తప్పురా రఘూ! అలా అనకూడదు. పనివాళ్ళ పిల్లయినా అదీ పసిపిల్లేరమా? నీలానే దానికీ ఉయ్యాల ఊగాలని వుంటదమా? రావే లక్ష్మి! నే ఎక్కిస్తా రా!" అని ఆ పిల్లని ఉయ్యాల మీద కూర్చోబెట్టి చూపించింది.

వారంరోజులు రఘు ఇటుకేసి రాలేదు. తర్వాత ఓ రోజు వాడు ఒంటరిగా [illegible] ఆవరణలో తచ్చాడుతుంటే, జయలక్ష్మి దగ్గరకు పిలిచి అడిగింది.

"ఏరా రఘూ! రావటంలేదు?" అని.

వాడు బెదురుతూ చెప్పాడు "మా అమ్మ వెళ్లొద్దంది!".

"ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగింది.

"నువ్వు మంచిదానివి కావుట!" అమాయకంగా అన్నాడు వాడు. చటుక్కున వాణ్ణి దగ్గరకు లాక్కుని ఒడిలో కూర్చోబెట్టుకొని క్రాపుసరిచేస్తూ నవ్వింది జయలక్ష్మి "ఎందుకుట?"

"మురికి వెధవలని నెత్తికెక్కించుకుంటావుట. మరారోజు నన్ను కోప్పడి, పనిపిల్ల లక్ష్మిని ఉయ్యాలమీద కూర్చోపెట్టలేదూ?" బుంగమూతి పెట్టుకున్నాడు వాడు.

సంగతి బోధపడింది జయలక్ష్మికి. రఘు తల్లి రమ, కేవలం తను పనిపిల్లను ఉయ్యాల మీద కూర్చోబెట్టి నందువల్లే, మురికి అయిందన్న ఆలోచనతో రఘును వెళ్ళవద్దనలేదు! అంతకు మించిన స్వార్థమేదో ఆమెలో వుంది. రఘు ఒక్కడే తనకు ప్రీతిపాత్రుడు కావాలి. వాడొక్కడికే తను బిస్కట్లూ, తినుబండారాలూ పెట్టాలి. వాడికి మాత్రమే ఇక్కడ ప్రత్యేక స్థానం వుండాలి. ఇదెక్కడి స్వార్థం? ఇదెక్కడ ప్రారంభమౌతోంది?


చాలామంది స్త్రీలను చూసింది తను. కొడుక్కు పెట్టిన తినుబండారం మనవడికి పెట్టేరు! అక్కడ భేదభావమే! కూతురి బిడ్డలకు ఒకరకంగా కొడుకు బిడ్డలకు ఒక రకంగా పెడతారు! ఒకే స్త్రీ అంతరం

గంలోని ప్రేమలో ఇన్ని మినహాయింపులు! ప్రేమ పంచి ఇవ్వటంలో యిన్ని పక్షపాతాలు. ఎందుకని? ఏమో!

తనకెందుకో పిల్లలందరూ, ఎవరిపిల్లలయినా సరే, లక్షాధికారి అనంతంగారి అమ్మాయి అయినా, పనిమనిషి అప్పలమ్మ కూతురు రామి అయినా....వాళ్ళ చిలిపి చేష్టలు ఒక్కలానే కనిపిస్తున్నాయి కాకుంటే తొడిగే డ్రెస్సులూ, మాట్లాడే భాషా కాస్త తేడాగా వుంటాయంతే!

ఈ వీధిలోని స్త్రీలంతా వస్తారు. 'మీకు టెయిలరింగ్ చాలా బాగా వచ్చని విన్నాం....మొన్ననో టెయిలర్ వెధవకిస్తే మా రవిగాడి జుబ్బా నాశనం చేసుకొచ్చాడు. ఏమనుకోకపోతే, వాడి ఆది చొక్కా పంపిస్తాను. చొక్కా గుడ్డ పంపిస్తాను. కాస్త కుట్టి పెడుదురూ. ఈసారి మీరు కుట్టిన చొక్కానే ఆదికిస్తాము!" అంటూ ఒకామె, "గౌను మీద ఎంబ్రాయిడరీ కావాలంటోంది పాప....నాకు రాదు....మీరు కాస్త వేసివ్వగలరూ?" అంటూ మరొకామె....అస్తమానం వాళ్ళ పిల్లల బట్టలు కుట్టటంతోనే సరిపోతోంది తనకు!

"నీకెందుకీ బాధ్యతలన్నీ జయా! ఓ టెయిలరింగ్ షాప్ ఓపెన్ చేసినా, నీక్కావలసినంత డబ్బు వస్తుందిలా అయితే!" అంటూ మందలిస్తుంటారు గోపాలరావు. తనకేమిటో ఆ చిన్న చిన్న జుబ్బాలూ, గౌన్లూ కుడుతుంటే, ఏదో తృప్తి....ఆ



తృప్తి మాటున.. హృదయపు అట్టడుగు పొరల్లో వున్న చిన్న అసంతృప్తి అణ గారి పోతుంటుంది.

* * *

"ఏమిటి జయా! ఆలోచిస్తున్నావు? ఓ మహానాయకుడు చనిపోయినట్లు తెలి సింది. కాలేజికి శలవు డిక్లేర్ చేసి వచ్చే శాను!" దగ్గరగా వినిపించిన భర్త మాట లతో త్రుళ్ళిపడింది జయలక్ష్మి. ఆమెఆలో చనలు ఎక్కడి వక్కడ ఎగిరిపోయాయి. బిలబిలమంటూ పిల్లలెవరో ఆవరణలోకి పరుగెత్తుకు వచ్చారు.

* * *

పదిరోజుల తర్వాత, జయలక్ష్మి గోపాల రావు, విజయవాడకు బయల్దేరారు! జయ లక్ష్మి సూటుకేసుతోబాటు, "డిక్" లో పెట్టిస్తున్న సరంజామా చూచి నిర్ఘాంత పోయాడు గోపాలరావు. రెండు పెద్ద డబ్బాలు, రెండు పెద్ద స్టీలు కారీయర్లూ, ఒక ప్లాస్టిక్ వైర్ బుట్ట (సీలువేసి!)

"ఏకంగా మన సంసారం విజయ వాడలో. మీ పుట్టింటికి మార్చిస్తున్నా వేమిటి జయా!" అన్నాడు గోపాలరావు.

"ఊహూ! పెళ్ళికి మా అక్కయ్యా పిల్లలు చెల్లాయిల పిల్లలూ ..యింకా ఇంకా చాలా మంది పిల్లలొస్తారు వాళ్ళ కోసం మురుకులూ చేగొడీలూ ఏవేవోలెండి కాసిన్ని చేసిపట్టు కొస్తు న్నాను!"

గోపాలరావు జాలిగా ఆమెకేసిచూశాడు ఈ నాలుగు రోజులుగా.. .తను కాలేజికి వెళ్ళిన టైంలో, అవన్నీ చేస్తూ .ఎంత శ్రమపడిపోయిందో ఈ మనిషి, అన్న భావంతో ఆయన గుండె ఆర్ద్రమైపోయింది

పెళ్ళింట్లో తినుబండరాలు వుండవా? కానీ తన చేతులతో ఏద్తో చేసిపెట్టాలన్న తాపత్రయం అంతే!

"ఊ! నీ చాదస్తం పద పద కారెక్కు. టైమయి పోతోంది. అన్నాడు అలసి పోయినట్లున్న ఆమె కేసి చూస్తూ.

పెళ్ళిల్లు ఎటు చూసినా కోలాహలంగా వుంది. పిల్లలకైతే అదో తిరణాల! ఇళ్ళ దగ్గర తలిదండ్రుల భయానికి, కట్టిపడేసిన ట్లుండే పిల్లలందరికీ స్వేచ్ఛలభించింది.

"ఏమిటే జయా! నీచుట్టూరా చిన్న సైజు "కాకా హోటల్" సృష్టించినట్లు న్నావ్! పిల్లవెధవలంతా తెగ తినేస్తు న్నారు!" అంటూ జలయక్ష్మి అన్నయ్య మోహనరావు అంటుంటే.

"పోన్లెండి! వదినగారి పుణ్యమాని.... పిల్లను నా వెంటపడి వేధించకుండా వున్నారు అంతే చాలు ." అంటోంది వదిన సీత.

"చూడు జయా! నాకు తీరి చావలేదు. ఈ పిల్లకి కాస్త రెండు జడలు వెయ్యి. ఆ చేత్తోనే దాని రిబ్బన్లు కాస్త సబ్బు పెట్టి ఆరేస్తావుకదూ? అదుగో ఆ పెద్ద వెధవలాగు బొత్తాములు తెంచేసు

కున్నాడు. అవి కాస్త కుట్టిపెట్టు" అలా చెల్లాయిళ్లూ, అక్కలూ, పిన్నికూతుళ్ళూ, పురమాయిస్తుంటే.

"అత్తా! నాకు పూలజడ కుట్టవూ? పిన్నీ ఈ స్కర్ట్ హుక్ సరిగా పెట్టవూ! అత్తా! నా కాకలేస్తోంది. ఏదైనా పెట్టవూ?" అంటూ పిల్లమూక చుట్టుకున్నారు.

జయలక్ష్మికి ఊపిరి సలపటంలేదు .. పదింట్లో ఏ వేడుక జరుగుతోందో ఆమె కసలే అంతుపట్టటంలేదు ."దాని పూల జడముందు కుట్టావా?" అని ఓ పాప బుంగమూతి పెడితే, దాన్ని ఓదార్చేసరికి మరో చిన్న వెధవ అలక.

పిల్లలందరికీ అన్నీ అమర్చి, అలస టగా అలా వెనక్కువాలి పడుకుంది జయ లక్ష్మి. ఆ అలసట ఆమెకు బాధాకరంగా లేదు ఎప్పుడు పట్టిందో చిన్నకునుకు పట్టింది . ఆ కునుకులోనే ఉలిక్కి పడి నట్లు లేచింది జయలక్ష్మి. దగ్గరగా గుస గుసలు.

"ఒరేయ్ రాజూ! గుట్టుగా, ఇక్కడే తినేసెయ్! వాళ్ళెవరికీ చూపించకు.... అందరూ కావాలంటారు. మీ దొడ్డమ్మ పిల్లలైతే మరీనూ. వెధవలు ... తెగ తింటారు."

నిర్ఘాంతపోయింది జయలక్ష్మి. తన చెల్లెలు హేమలత. ఆమె కొడుకు రాజుకు చాటుగా "బాదుషా" తినిపిస్తోంది.

"మీ దొడ్డమ్మ" అంటే ఎవరు? స్వంత అక్కయ్య. స్వంత అక్క పిల్లలు. పిల్లలుకారా? వాళ్ళనీ పిల్చి పెడితే ఏం పోయిందీ?

"ప్లేట్సి తలా ఒకటి ఇవ్వరాదుటే హేమా?" అంది ఆపులిస్తూ. హేమ క్షణ కాలం తత్తరపోయింది. తనను తను సంబాళించుకుంటూ నవ్వేసింది "నువ్వు మేలుకొనే వున్నావుటే అక్కయ్యా! ఈ రాజుగాడుగోల చేస్తుంటే పెడు తున్నాను. పదిమంది పిల్లలూ పడే తిన్నా రంటే, ఇక డిన్నర్‌కు ఏం మిగులు తాయి?" అంది.

"అందుకని చాటుగా నీ కొడుక్కు ఒక్కడికీ తినబెడుతున్నావా? డిన్నర్‌కు తగ్గేంత కక్కుర్తిగా టిఫిన్స్ ఎప్పుడూ చేయించరు అమ్మా, నాన్న, అన్నయ్యా!"

❋ డాక్టరు : చెప్పడానికి నాకొంచెం 'ఎబ్బెట్టుగానే ఉందను కోండి గాని, మీరిచ్చిన చెక్కు తిరిగి వచ్చింది.

రోగి : చాలా విచిత్రంగా ఉందే! నా జబ్బు కూడా అలాగే తిరిగొచ్చిందండి !

"పోన్లే! నేనే చెడ్డదాన్ని! నా బిడ్డకు ఒక్క "బాదుషా" పెట్టుకున్నాననే కాదూ నీ ఏడుపంతా?" అక్కసుగా అరిచింది హేమలత.

"అది కాదే హేమా !" ఏదో చెప్పబోయిన జయలక్ష్మి మాటలకు అడ్డొస్తూ వెర్రిగా అరిచింది హేమలత.

"ఏది కాదు? కని పెంచేవాళ్ళకి తెలుస్తుంది కడుపుతీపి. రాజుగాడు ఏ స్వీటూ తినడు. ఇదొక్కటే తింటాడు. అందుకని కాస్తంత పెడుతుంటే చూడలేకపోయావు. పొద్దున్న వాడిలాగు బొత్తాములు కాస్త కుట్టిపెట్టమంటే .... అందరు పిల్లలకూ అన్నిపనులూ చేశాక. చివరగా వాడు ఏడుస్తుంటే కుట్టిపెట్టావు! నీ గుణం నాకు కొత్తా ఏమిటి? అందుకే దేవుడు నీకు బిడ్డల్నివ్వలేదు! ఇంకా నయం! మా రాజును! నీకు పెంచుకోవటానికివ్వమని బావగారు అడిగారు నిన్న! వాడి గొంతుక కోశానుకాదు" ఇంకా ఏదేదో అరుస్తూ, రాజు తింటున్న స్వీటు గబుక్కున లాక్కుని జయలక్ష్మి ముందుకు విసిరి పారేసి, ఏడవబోయిన వాణ్ని ఒకటి తగిలించి, మరీ లాక్కు వెళ్ళింది హేమలత.

ప్రాన్పడి నిల్చుండిపోయింది జయలక్ష్మి. తన ఉద్దేశ్యం వాడికి పెట్టవద్దని కాదు ఒకవేళ మిగతా పిల్లలు అడిగినా పెట్టవచ్చుగదా, అలా చాటుగా ఎందుకు పెట్టడం అన్నదే! హేమ ఎంత అపార్థం చేసుకుంది.

మెల్లిగా వంట పందిరివేపు నడిచింది జయలక్ష్మి . .అక్కడ వంటవాళ్ళొకవేపు హడావుడిగా తిరుగుతుంటే, ఓ వంటావిడ చిన్నపిల్లలకు మళ్ళీ మళ్ళీ అన్నాలు పెట్టాల్సి వచ్చిందని విసుక్కుంటోంది.

జయలక్ష్మి అక్క రాజ్యలక్ష్మి తన పిల్లలకూ, అన్నయ్యపిల్లలకూ అన్నాలు పెట్టిస్తోంది. హాల్లో ఓ వారగా దూరపు బంధువులూ, కాస్త జరుగుబాటు తక్కువగాగలవారూ, వారి పిల్లలూ బిక్కు బిక్కుమంటూ కూర్చుని వున్నారు. వాళ్ళపిల్లలు "ఆకళ్ళో," అంటున్నారు.

వంట పందిట్లో పెత్తనమంతా రాజ్యలక్ష్మిదే!

"ఆ పిల్లలకూ అన్నం పెట్టించండి మామ్మగారూ! పెద్ద వాళ్ళ బంతివరకూ వాళ్ళు ఆగ గలరా?" అంది జయలక్ష్మి, జాలిగా వున్న ఆ బిడ్డల మొహాలు చూస్తుంటే ఆమెకు కడుపులో కెలికినట్లయ్యింది.

ఆ దూరపు బంధువు ఆ పెద్దావిడ... "పెట్టిద్దామంటే అక్కడ ఖాళీలేదని చెప్పిందమ్మా" అంది మనమళ్ళనూ. మనవరాళ్ళనీ చుట్టూరా కూర్చోపెట్టుకుని.

"ఎంత ఖాళీ కావాలి' రండ్రా నే పెట్టి

ప్తాను!" అంటూ వాళ్ళని వెనక వేసుకు వచ్చింది జయలక్ష్మి వంట పందిరిలోకి.

"వీళ్ళకూ అన్నాలు పెట్టించ క్కర్లేదా!" అంది రాజ్యలక్ష్మితో రాజ్య లక్ష్మి ముఖం చిట్లించింది.

"ఇక నాకిదే పనిచే జయా! కాస్సేపు. పెళ్ళి జరిగే చోటికి పోనక్కర్లా? ఈ వెధవ మూకకు తిండిపెట్టడమేనా నా డ్యూటీ? కాకున్నా. ఎక్కడెక్కడి సంతునూ వేసుకొస్తావు. వాళ్ళకిప్పుడేం తొందర ఇందాకేగా ఉప్మాలు మెక్కారు!"

"మన పిల్లలూ మెక్కారుగా ఉప్మాలూ స్వీట్సూ, పళ్ళూ, పాలూ!" జయలక్ష్మి కోపంగా అరిచింది.

రాజ్యలక్ష్మి ఒక్కసారిగా రెచ్చిపోయింది "మన పిల్లలకూ వాళ్ళకూ పోటీ ఏమిటి? వాళ్ళిళ్ళల్లో వాళ్ళిలాగే టైం ప్రకారం తింటున్నారా? అసలు నీతో వాదనేమిటి? నాకు ఓపికలేదు వంటావిడ కూడా ఓపికలేదు కాకున్నా గొడ్రాలికేం తెలుసు బిడ్డ నొప్పులని. మా పిల్లల పద్ధతులు నీకెలా తెలుస్తాయి?" అంటూనే తన పిల్లలకు చేతులూ, మూతులూ కడగటానికి వెళ్ళిపోయింది.

జయలక్ష్మికి చివుక్కు మనిపించినా వెంటనే నవ్వు ముంచుక వచ్చింది తను గొడ్రాలే తనకు బిడ్డ నొప్పులు తెలీవు అదొక్కటే తనను ఎత్తిపొడిచేందుకు అందరూ ఉపయోగించుకొనే ఆయుధం....కానీ, పిల్లలందరికీ 'ఆకలీ', అల్లరి బాధా, సంతోషమూ ఒకటేనని తనకు తెలుసు.

"రండర్రా!" అంది ఆ పిల్లలవేపు చూచి జయలక్ష్మి. వంటావిడ గొణగటం ప్రారంభించింది సందు చూచుకొని, జయలక్ష్మి కసురుకుంది "మీ రిక్కడ వున్నది అన్నాలు వడ్డించడానికే నవి మర్చిపోకండి.!" ఇక వంటావిడ నోరెత్త

లేదు. అందాకా, ఇక ఈ పూటకు తిండి ప్రాప్తి లేదని సరిపెట్టుకున్న మామ్మగారు కూడా పిల్లల పక్కన వచ్చి కూర్చుంది. పిల్లలు రాజ్యలక్ష్మి కసుర్లతో బెదిరి పోయి వున్నారేమో బెరుగ్గానే కూర్చున్నారు. దగ్గరుండి తినిపించింది జయలక్ష్మి!

"నీ కడుపు చల్లగా పిల్లలకు వేళ కింత తిండి పెట్టించావు! అంతే చాలు తల్లీ!" అంటూ పిల్లల్ని తీసుక వెళ్ళి పోయింది మామ్మగారు.

"పెళ్ళయిపోయిందిగా! ఇక హైదరాబాదు వెడదామా?" అన్నాడు గోపాలరావు ఆ సాయంత్రం జయలక్ష్మితో.

"వద్దు! మన ఊరికే వెళ్ళిపోదాం." అంది జయలక్ష్మి.

"అనాథ శరణాలయంలో "గోపాలరావు మాటలు పూర్తిగాక ముందే దృఢంగా అంది జయలక్ష్మి "ఒద్దు ప్రస్తుతం నాకా ఆలోచనే లేదు."

"ఏం? పోనీ మీ అక్కచెల్లెళ్ళ బిడ్డలలో ఎవరినేనా తీసుకుందామని ఉందా?" అన్నాడు మళ్ళీ.

"ఊహూ! ఇందాకా దోలాందోళితంగా వున్న నా మనసు ఓ నిశ్చితాభిప్రాయానికి వచ్చేలా చేశారు వాళ్ళంతా— ఈ పెళ్ళి పుణ్యమాని."

"అదేమిటి?" విస్మయంగా అడిగాడు గోపాలరావు.

తన అనుభవాలూ, ఆలోచనలూ అన్నీ చెప్పింది జయలక్ష్మి....గోపాలరావు సాలోచనగా నవ్వాడు.

"అవును జయా! నువ్వు తల్లివి కాలేదు కాబట్టి, నీ కివన్నీ కొత్తగా, వింతగా వున్నాయి. ప్రతి తల్లీ అంతే! మనిషి ఒక చేతిలోని ఒక వేలికీ, మరో వేలికీ పోలిక వుందేమో చూడు! పరాయి బిడ్డల వరకూ ఎందుకు? చాలా మంది తలిదండ్రులుతమ స్వంత బిడ్డలలోనే తరతమ భేదాలు పాటిస్తారు! వారి ప్రేమ హెచ్చు తగ్గులుగా ప్రవహిస్తుంటుంది

డబ్బుగల కొడుకు మీద ఒక రకంగా డబ్బులేని కూతురు మీద ఇంకో రకంగా, దగ్గరున్న కొడుకును ఓ రకంగా, దూరంగా వున్న కొడుకును మరో రకంగా అర్భకుడైన బిడ్డను మరో రకంగా ఇలా కన్నతల్లి ప్రేమలోనే హెచ్చుతగ్గులు తప్పనిసరిగా వుంటాయి కనుగీటువార తేడా వుంటూనే వుంటుంది.

అయితే, పిడికిలి బిగించి వున్నపుడు గుంభనంగా వుండే చెయ్యిలానే అసమానత తెలియని వ్రేళ్ళలానే తల్లి ప్రేమ బిడ్డలందరిమీదా సమంగా వున్నట్లు పైకి కనిపిస్తుందంతే! పిడికిలి విడదీసినపుడు చేతి వ్రేళ్ళలా, అంతరంగంలో ప్రవర్తనలో మాత్రం వేరు దాన్ని స్వార్థమను, పక్షపాతమను, తల్లిప్రేమ

అను మరేదేనా అను ఇది ఫంతకాదన్నా, ఏ తల్లి కాతల్లి ఎంతగింజుకున్నా తనను తానెంత సమర్థించుకున్నా యుగయుగాలుగా వుండేదే. స్వంత బిడ్డల విషయంలోనే బేధభావమున్నపుడు వేలు ఎడమయిన బిడ్డలమీద పరిపూర్ణమైన ప్రేమానురాగాలు ఎలా వర్షించగలదు స్త్రీ? రేపు నువ్వయినా తల్లివయితే అంతే! అది సృష్టి రహస్యం!" మనసులో రేఖామాత్రంగా వున్న అనుమానాలకూ, ప్రశ్నలకూ జవాబు దొరికినట్లయ్యింది జయలక్ష్మికి. ఒద్దు ఒద్దు. అలాటి స్వార్థం తనకు ఒద్దు. తనిలాగే వుండిపోవాలి తను తల్లికాకూడదు.

ఏ బిడ్డనయినా పెంచుకోవడం మొదలెట్టినా అంతే! "నా స్వంతం" అన్న స్వార్థం, మమకారం మొదలవుతాయి ఆ బిడ్డతోబాటు! ఇక ఈ విస్తృతమైన ప్రేమ ఎగిరిపోతుంది. తనూ అక్కయ్యలా చెల్లాయిలా, రఘు తల్లి రమలా


ఇతరబిడ్డల ఆకలిగానీ, వారి అనుభూతులుగానీ అర్థంచేసుకోలేని అంధురాలిగా తయారౌతుంది. తనలోని మాతృప్రేమ ఒక్కబిడ్డకే పరిమితమై లక్కడితో అంతమౌతుంది.

తనలోని ఈ మాతృప్రేమ పుష్పకవిమానంలా అందరు పిల్లలకూ చోటివ్వాలి. ఏ ఒక్క బిడ్డకోకాదు తను ఏ ఒక్క బిడ్డకూ తల్లి కాకూడదు. ఈ జన్మకేకాదు జన్మజన్మలకూ.

గొడ్రాలన్న దెప్పులుపడినా ఫర్వాలేదు. అందరు పిల్లలకూ తల్లిగానే వుండిపోవాలి.

"ఏమిటి జయా! నీ అభిప్రాయం చెప్పావు కావేం?" అన్నారు తిరిగి గోపాలరావు

"చెప్పటానికేముంది. నేనెవర్నీ పెంచుకోను నాకు పిల్లయీ వద్దు ఇలాగే గొడ్రాలిగా వుండిపోతాను హాయిగా! పదండి సామాను సర్ది పదినిముషాల్లో తయారై వస్తాను. డ్రైవర్ని కారు రెడీ చేయమనండి." అంది జయలక్ష్మి. ఆమె కళ్ళల్లో ఎన్నడూ చూడని వెలుగు సంతృప్తి చూశాడు గోపాలరావు క్షణంలో.



వస్తువిశేషములు

సుగుణ

ఇంగువ

ఇంగువవాసన చాలా మందికి గిట్టదు. ఒకవిధమైన వెగటువాసనగ నుండును. కాని కొంతమందికి ఆ వాసన చాలా ఇష్టము చాలా వంటల్లో ఉపయోగిస్తారు. ముఖ్యముగా సాంబారు, రసము, ఇంగువ లేనిదే సరైన వాసన, రుచీ రాదంటారు.

ఇంగువ మలమూత్ర ద్వారాములందు కలిగెడు శూలను తగ్గించును. పడిశెము, వాతము, క్రిమిరోగములను, విషవాయువు వీనిని హరించును. కడుపులోని ఏలిక పాములను చంపును, జీర్ణమును కలుగ జేయును. ఆగిఆగి వచ్చు కడుపునొప్పిని, అజీర్ణపు కడుపునొప్పిని తగ్గించును. పప్పు జాతులవల్ల కలిగే అజీర్ణమును పోగొట్టును. దీనికి ఉబ్బసమును కూడ తగ్గించు గుణ మున్నది. నరములు అదురుటను పోగొట్టును. ఇంగువ ప్రసవ స్త్రీల రక్తమును వెడలించును. ప్రసవానంతరము స్త్రీలకు పిండోత్పత్తి స్థానమునకు మేలుచేయును. ఇంగువ అరఖునే (టించర్) అందురు. అప్పుడు తగిలిన గాయములపై ఈ అరఖువేసిన రక్తప్రవాహము కట్టును. గర్భిణీ స్త్రీలకు అంత మంచిది కాదు.

చందా దారులకు మనవి

"జ్యోతి" సంవత్సర చందా పన్నెండు రూపాయలు. దీపావళి ప్రత్యేక సంచికతోసహా పదిహేను రూపాయలు. దీపావళి సంచిక రిజిష్టర్ పోస్టులో పంపగోరువారు పదిహేడు రూపాయలు పంపవలసి వుంటుంది

సంచికలు సక్రమంగా మీకు చేరాలంటేమీ అడ్రసు వివరంగా వ్రాయ వలయును.

మీ చందా మనియార్డరు ద్వారా గానీ, డ్రాఫ్ట్ ద్వారాగానీ పంపండి. వివరాలకు : మేనేజర్, జ్యోతి, 7 ఎ, శివాజి స్ట్రీట్, టి. నగర్, మద్రాసు–600017

—మేనేజర్.



గణేష్ పాత్రో

"చూడు శ్యామలం! నీకు తెలీదు. ఆశయాలు, ఆదర్శాల పేరుతో నీ కాలికింద నువ్వే గోతులు తవ్వుకుంటే చచ్చిపోయిన మీ అమ్మకి శాంతిగా వుంటుందనుకున్నావా? నేను మీ అమ్మ పట్ల చేసిన నేరానికి బాధపడుతున్నాను. ఎలాంటి పరిస్థితుల్లో అలా ప్రవర్తించానో నీకు తెలీదు. అయినా నీ దగ్గిర సిగ్గుపడుతున్నాను. నేనే కాదు. మా అమ్మ కూడా చాలా బాధపడింది. చచ్చిపోతూ కోడల్ని తలుచుకొనే కన్ను మూసింది. అందుకు ఏం చెయ్యమన్నావో చెప్పు? నీ యిష్టంవొచ్చిన పిల్లని-కులం, గోత్రం అనకుండా ఆస్తి, అంతస్థుల ప్రమేయం లేకుండా చక్కటి పిల్లని, మంచి పిల్లని చూపించు. నిముషాల మీద ముహూర్తం పెట్టించి పెళ్ళి చేయిస్తాను. నా యింటికి కోడల్ని తీసుకొచ్చి పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను. ఈ ఇంటికి రాణీని చేస్తాను. అంతేగానీ ఒక రోగిష్ఠి పిల్లనిచ్చి నీకు కట్టబెట్టను. చూడు, నా మాటంటే నీకు లక్ష్యంలేదని తెలుసు నాకు. కానీ ఎందుకు సహించానో తెలుసునా? మీ అమ్మని తలచుకునే! ఇప్పుడు మీ అమ్మకే అన్యాయం చెయ్యాలనుకుంటున్నావు; ఇది మాత్రం సహించను! అమాయకంగా, నువ్వు ఆడింది ఆటగా,

సీరియల్

పాడింది పాటగా, నీకు లొంగిపోతే_ నేను చచ్చు దద్దమ్మ ననుకుంటున్నావేమో? కానే కాదు! మనసు విరిగితే నేను మనిషిని కాను.''

ఇంటికొచ్చిన తరవాత రంగారావు కొడుక్కి హితబోధ చేస్తున్నాడు. చాలా కోపంగా వున్నాడు. అసలు నలుగురిలో శ్యామలరావు ప్రవర్తనే తననవమానపరచింది. అది చాలక తాను కాదన్న పిల్లని తన యెదటే 'చేసుకుంటానని' మాటిచ్చాడు. పెంకితనం కాకపోతే మరే మనుకోవాలి? కొడుక్కి పాతికేళ్ళు నిండిన తర్వాత ఇప్పుడనిపించింది రంగారావుకి, శ్యామలరావు నదుపులో పెట్టకుండా వుండి దిద్దుకోలేని తప్పుచేశానని!

ఐతే శ్యామలరావు కూడా మంచి ఆవేశంలోనే వున్నాడు. అతను సరిగ్గా కోరుకున్న అమ్మాయి, కలలు కంటున్న భార్య-దొరకబోతుంటే మరేమీ తోచడం లేదు.

సీతాపతి, కాంతమ్మ చాలా దిగులు పడుతున్నారు.

ఇంతకు ముందు సంబంధాలు తప్పిపోయాయ్.

'పెళ్ళి కాదు' అని ముద్ర పడిపోయింది సరోజని మీద.

సరోజని అమాయకంగా, అన్యాయంగా రోగంతో బాధపడుతోంది. దేవుడు చేసిన దురన్యాయానికి మనషులు సజీవసమాధి తీర్పు చెప్తున్న సమయంలో తానెందుకు ఆ పిల్లని ఆదరించకూడదు! తనకి చేతనౌను. అందరిలాగ స్వార్థపడడం తనకి చేతకాదు. సరిగ్గా ఇలాంటి సజీవసమాధిలోనే తన తల్లి జీవితం ఆహుతైపోయింది.

యిప్పుడు తండ్రి మంచితనంతో తనని లొంగదీసుకోనేట్టు కనిపిస్తున్నాడు కులం, ఆస్థిపాస్తులు అక్కరలేకుండా కోడల్ని రాణీని చేస్తానంటున్నాడు. ఆ మంచి తనం మరి తను కోరిన పిల్లపైనే చూపించొచ్చును గదా.'

"మాట కూడా ఇచ్చాను." నిబ్బరంగా అన్నాడు.

"ఎవడ్నడిగి మాటిచ్చావు?" ఖస్సుమన్నాడు రంగారావు, "ఏం, నిన్నడగకుండా మేం ఎవ్వరికీ మాటివ్వకూడదని ఆంక్ష పెట్టావే? — మరి మమ్మల్ని అడగకుండా నువ్వు-నీ బోడి పెత్తనమేంవిటి? అసలు అక్కడికక్కడే నువ్వు మాటిచ్చేయవలసిన ఆ తొందరెందుకొచ్చిందిరా? మంచివాడివని అక్కడి వాళ్ళంతా మెచ్చుకొని మేకతోళ్ళు కప్పుతారనా? మంచి తనం, అదేదో బజారు సరుకు కాదబ్బాయ్, నాలుగు రోజులు పోతే కుళ్ళిపోవడానికి! దాన్ని నిదానంగా వాడుకోవచ్చు ఆదరాబాదరా ఎక్కడ ఇంకిపోతుందో, కాలదోషం పట్టేస్తుందో అన్నట్టు ఖర్చుపెట్టేసుకుంటే_ఆ మంచి తనం బెడిసికొడుతుంది! చూడు, వర్షపు చినుకు సరిగ్గా స్వాతికాలంలో, ముత్యపుచిప్పలో

జరిగిన కథ:

శ్యామలరావు, కృష్ణమోహన్ స్నేహితులు. లా స్టూడెంట్లు. శ్యామలరావు ఆశయం గొప్పది. కారణం తన తల్లి మూగది. ఆమె అనేక బాధలకులోనై, చనిపోయింది. మానసికంగా బాధపడే అమ్మాయినే పెళ్ళి చేసుకోవాలనే తన నిర్ణయాన్ని తెలుపుతాడు స్నేహితుడు. మోహన్ సెలవులకు వెళ్ళిపోతున్న రోజున మోహన్ తల్లి కామాక్షమ్మ కొడుకు విషయంలో అమిత ప్రేమ చూపుతుంది. కానీ మోహన్-సరోజ వివాహ విషయంలో మాత్రం విముఖత కనబరచింది. కారణం సరోజకు ఫిట్స్ జబ్బు. శ్యామలరావు స్నానానికి వెళ్ళినప్పుడు చౌదరాణి విచిత్రంగా కలిసింది. స్నేహితుడు సాహూ శ్యామలరావు రాకనుచూసి ఆనందపడిపోయాడు. చౌదరాణి భర్త తిరిగి వచ్చాడు. సరోజనికి వేరే పెళ్లి సంబంధము గురించి ప్రయత్నాలు జరుగుతున్నాయి, శ్యామలరావు చౌదరాణి భర్తను చూచి వచ్చేందుకు సాహూ ఇంటికి వెళ్లాడు.

ఆమె పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది, భర్త సాధింపులు ఎక్కువయ్యాయి. చౌదరాణి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమయింది. శ్యామలరావు ఆమెను ఆ ప్రయత్నంనుంచి విరమింపజేశాడు. పెళ్లిచూపులకు శ్యామలరావు సరోజనిని చూచేందుకు వచ్చిన సందర్భంలో ఫిట్సు వచ్చి పడిపోయింది. సరోజనిని పెళ్లిచేసుకోవడానికి నిశ్చయించుకుంటాడు శ్యామలరావు)

పడితేనే అదొక మంచి ముత్యం! అలాగే నీలోని మంచి తనమూను."

తండ్రి చెప్పిన ఉదాహరణ చాలా తెలివైన ఉదాహరణ అనిపించింది శ్యామలరావుకి. ఏమైనా ముఖ్య విషయాలు మాటాడేటప్పుడు, ఇలాంటి ఉపన్యాసాలిస్తూండడం తండ్రికి అలవాటే. అందులో బాగా పండిపోయాడు

గానీ వర్షపు చినుకులన్నీ ముత్యాలు కావాలనే ఉబలాటంతో కేవలం స్వాతిలోనే ముత్యపు చిప్పలలోనే పడాలా. నెత్తి మండిపోయి వేసవిలో నెరియలు పడ్డ నేలలున్నాయి. కారడవులని మసి చేసే, దహించేసే దావానలాలున్నాయ్. నిండవలసిన చెఱువులు, పండవలసిన పొలాలు వుంటుండగా, నేరుగా వెళ్ళి మహాసముద్ర తీరంలో మంచి ముత్యపు చిప్పలలోనే పడాలా చినుకులు ?

తండ్రి వాదన వితండ వాదన! తాను లొంగిపోకూడదు

తానా పిల్లని చేసుకుని తీరాలి.

తన ఉత్తరం కోసం ఎదురుచూస్తుంటారు సీతాపతిగారు

అయోమయంగా వుంది శ్యామల

రావుకి. తండ్రిమాట కాదని స్వతంత్రించగలడు. గానీ అందుకు సీతాపతి గారు మాత్రం అంగీకరించడం లేదే! "నాన్నగారు ఒప్పుకుంటేనే జరుగుతుంది బాబూ పెళ్ళి. లేకపోతే నా ఖర్మకి నేను ఏడుస్తానంతే గాని, తండ్రీ కొడుకుల్ని విడదీసి పాపం కట్టుకోను. క్షమించండి" అన్నాడు తానొచ్చేస్తుండగా. ఇప్పుడు ఇతనేమో ససేమిరా ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదనే పట్టుపట్టాడు.

తిరపతమ్మ తండ్రీ కొడుకుల మధ్య కొచ్చింది.

రోగిష్టి పిల్లని శ్యామలరావుకి కట్టిపడేసే శుభం కోసం ఎదురు చూస్తున్న తిరపతమ్మకి పెళ్ళిచూపులనాడే ఆశాభంగమయింది. ముడిపడకముందే అన్నకి తెలిసిపోవడం వల్ల, మొండిపట్టు పట్టుకూర్చున్నాడతను. తన దురదృష్టానికి బాధపడిపోతోంది తిరపతమ్మ. ఇంతలో భగవంతుడి కృపవలన శ్యామలరావే ఆ పిల్లని చేసుకుంటానని పట్టుపడుతున్నాడు. ఆ అవకాశాన్ని ఆమె జారవిడుస్తుందా? కావలసిన శుభాన్ని జరిపించకపోతే మరెందుకు తను?

"బాబూ! శ్యామలం నువ్వెళ్ళు. మేం మాట్లాడతాంలే. నువ్వెళ్ళు" అని అక్కడనుండి శ్యామలరావుని పంపించేసింది.

ఆ క్షణం నుండి సుమారు వారంరోజులు రంగారావుని 'కురుపు సలిపినట్టుగా' సలిపింది. "లక్షణంగా మంచిపిల్ల. జబ్బుకి అదేం చేస్తుంది? మంచి సంప్రదాయస్తులు. శ్యామలరావు ముచ్చట పడుతున్నాడు. తప్పు చేస్తానంటున్నాడా? మంచిపని చేస్తాననే మొత్తుకుంటున్నాడు. పెద్దవాళ్ళు ప్రోత్సహించకపోవడం న్యాయమా? అందులోనూ శ్యామలరావు పట్టుదలకలమనిషి. నీ కొడుకే! కాస్త తెగింపులు చేసుకొన్నాడనుకో. మనం లబోదిబో మనాలి. అక్కడితో సరిపోయిందా? ఆస్థి అడుగుతాడు. వేరుపడతానంటాడు. ఎంత తలవంపు! ఆస్థి వాడి మొహాన్నేసి కొడతాం. గాని అయిన వాళ్ళ ఎదుట ఎంత చులకనైపోతాం. వాడు అంత పనీ చేస్తాడు. ఉద్దండుడు! ఆ సంబంధమే చేసుకోనీ! కాకపోతే మందులిప్పించుదాం. అమెరికా పంపిద్దాం. డబ్బుతో ప్రాణాలనే కొనుక్కోవచ్చునే? ఆరోగ్యం కొనుక్కోడం ఒక లెక్కా? నీకు వాడంటే యెంత ప్రాణమో ఎరిగినిదాన్ని కనుక, ఆ తరువాత నువ్వు బాధపడటం చూడలేని అప్పచెల్లెల్ని కనుక ఇంతదూరం చెబుతున్నాను. రాసై. వాళ్ళకి వెంటనే రాయి. ముహూర్తం పెట్టించుకోమను. శ్రావణంలో చేసి తీరాలంటున్నారు మరిన్నాళ్ళు. పదిహేను రోజులుంది. మనం కాస్త ముందు రాయకపోతే భావ్యంకాదు. మనం యే క్షణమైనా సిద్ధమే. గానీ మరి వాళ్ళుండొద్దా?"

చెల్లెలు తీయగా కలిపిచ్చిన విషాన్ని



భయపడుతూనే అందుకున్నాడు రంగారావు. ఆ విషయం ఆలోచించడానికి ఒప్పుకోనివాడు, ఇప్పుడు కొంచెం ఆలోచనలో పడినంతవరకు జారిపోయాడు.

కొడుకు తెగతెంపులు చేసుకొంటేనో?

అమ్మో. బతుకులో ఒక్కగానొక్క తీపు. కోపమొస్తూంది. బాధగా వుంది. అయిష్టంగా వుంది, మనసుకి కష్టంగా వుంది.

"మరో మార్గం లేదంటావా?" అడిగాడు చెల్లెల్ని.

"మరేముంది?" అంది తిరపతమ్మ.

13

లా పరీక్ష ఫలితాలొచ్చాయి.

తన నంబరు కంటె ముందు శ్యామల రావు నెంబరు చూశాడు కృష్ణమోహన్. పాసయ్యాడు. శ్యామలరావు పరీక్ష పాసయ్యాడు. గానీ, విచిత్రం! తను పరీక్ష తప్పాడు. పేపరంతా కలయజూశాడు మళ్ళీ మళ్ళీ నెంబర్లు తిరగేశాడు. తన వెర్రికి తనే నవ్వుకున్నాడు. గానీ ఎలా జరిగిందిది? ఏదో పొరపాటా? తను ఫెయిలవుతాడని కలలోకూడా అనుకోలేదే! చాలా నిబ్బరంగా వున్న తన పరీక్ష చెట్టెక్కింది.

[illegible]నవ్వుకున్నాడు కృష్ణమోహన్.

గబగబా కవరు తీసి స్నేహితుడికి ఉత్తరం వ్రాశాడు అభినందిస్తూ. అనివార్యమైన కారణాలవల్ల ఇన్నాళ్ళూ ఉత్తరాలు రాయకపోయినందుకు మన్నించమన్నాడు. తను, తన పాలిటిక్స్ వ్యవహారం ఈ గుజ్జని గూళ్ళు వివరాలన్నీ 'ఉ[illegible] హాస్యధోరణిలా రాసి ఉత్తరం పోస్టు చేశాడు. తిన్నగా పార్టీ ఆఫీసు గదిలో కెళ్ళాడు. అప్పటికే చేరవలసినవాళ్ళు అక్కడ చేరుకున్నారు. విశ్వనాథం మాటాడుతున్నాడు వారితో.

'అదుగో! మోహన్ కూడా వచ్చేశాడు!' ఎవరో అన్నారు.

"రా! రారా మోహన్! నాయుడేం చేశాడో చూశావా?" విశ్వనాథం ప్రారంభించాడు. రోజూ నాయుడు ఏదో ఒకటి చేస్తూనే ఉంటాడు. ఆఫీసు గదిలో బాబాయిని కలిసినప్పుడంతా అతని మొదటి వాక్యం ఇదే.

'ఏం చేశాడు?' కూచుంటూ అడిగాడు మోహన్. ఈమారేదో పెద్ద ఘోరమే జరిపేసినట్టున్నాడు నాయుడు. గదిలో వాతావరణం అలా వుంది.

"తుమ్మలపల్లి ప్రెసిడెంటు లేడూ? బాపయ్య. అతగాడు మన పార్టీ గదా. ఆ చుట్టుపట్లంతా మన పక్క ప్రచారం కూడా అతనే మరి; ఎంత ప్రయత్నించినా నాయుడు, లొంగదీసుకోలేక పోయేడు. చివరికి నిన్న ఎమర్జన్సీ మీటింగని జీపులో రప్పించి, ఊళ్లోకి చేరక ముందే ఆ జీపుని చెట్టుకిగుద్దించేసి బోల్తా పడించేశాడు. ఆ జీపు తోలిన వాడెవడో తెలుసా? నాయుడు కొడుకే. జీపు చెట్టుకి గుద్దుకోగానే పక్కనున్న హేండిల్‌తో బాపయ్య తల చితగ్గొట్టేశాడు వాడు. వాడికేవో కాస్త గాయాలు తగిలాయట. ప్రెసిడెంటుమాత్రం చచ్చిపోయాడు" చెప్పడం ముగించాడు విశ్వనాథం.

మోహన్ గుండెలు రారెత్తిపోయాయి. పదవికోసం హత్య. ఇంతకు ముందు విన్నాడు, ఇప్పుడు కళ్ళతో చూస్తున్నాడు.

"ఏమీ యెరగని సదాచారి లాగా నాయుడు విచారిస్తున్నాడట, బాపయ్య

చావుకి. ఎంత తెలివైనవాడో చూడు. ఎవరికీ అపనమ్మకం కలగకుండా కొడుకు చేతనే జీపు తోలించాడు. ఇప్పుడు ఏక్సిడెంటు క్రింద పోతుంది. కొడుక్కి జరిమానా కట్టేసి విడిపించుకుంటాడు.''

''ఇప్పుడు మనం ఆస్పత్రిదగ్గర నిరాహార దీక్ష చెయ్యాలి!'' గఫూర్ అన్నాడు.

''ఎందుకు?''

''శవం యిప్పుడు ఆస్పత్రిలోనే వుంది. నాయుడుకూడా అక్కడే వున్నాడు. జరిగింది ప్రమాదం కాదని, హత్య అనీ రుజువుచేస్తే చెయ్యడానికి అవకాశం కోరుదాం. తలమీద గాయాలు ఇట్టే చూస్తే చాలు, అది తేలిపోతుంది. డాక్టరుకి మూతికట్టు కట్టి డెత్ సర్టిఫికెట్ పుట్టించా అనుకుంటున్నాడు నాయుడు. ఆ పప్పులేవీ వుడకనియ్యకూడదు. వాడి అంతు తేలిపోవాలి.'' చెప్పాడు గఫూర్.

ధర్మంపట్ల ఆసక్తో, నాయుడి మీద కసో- గానీ విశ్వనాథం చాలా ఆవేశంలో వున్నాడు. ఈ దెబ్బతో నాయుడ్ని కడతేర్చేలాగా కనిపిస్తున్నాడు. ''అంతే! అవసరమైతే ఆస్పత్రి ముట్టడించేయండి. హర్తాళ్ చెయ్యండి. అటువాళ్ళటు, ఇటువాళ్ళటు రాకపోకలు జరగకుండా అటకాయించండి. నాయుడ్ని అరెస్టుచేసి బయటకు పంపేదాకా ఆస్పత్రి పట్టుకొని వదలకండి.'



విప్లవశంఖం పూరించాడు విశ్వనాథం.

దోషి శిక్షింపబడటంపట్ల మోహన్‌కి కూడా ఆసక్తి వుంది. గానీ దాని వెనక కుట్రకూడా వుండడం. ఏదో కక్షి అయి పోయినట్లుంది మోహన్‌కి. అంతేగాక ఆ కుట్ర పన్నుతున్నవాళ్ళు ధర్మప న్నాలు చెబుతూ ఇంట్లో కూర్చుంటారు. పూనుకున్న వాళ్ళు కుట్రదారులుగా లోకుల నిందకి గురౌతారు. ఇది మరీ అన్యాయం.

"మోహన్! నువ్వెళ్ళి చలపతినికలు. అతనితో ఇలా చెప్పావంటే చాలు! మన కాలేజీ కుర్రవాళ్ళనందరినీ కూడ తీసుకొచ్చేస్తాడు. అరగంటలో హాస్పిటల్ దగ్గిర నినాదాలు చేస్తుండమను. ఇంతలో గపూర్ అక్కడికి చేరుకుంటాడు. త్వరగ వెళ్ళు! క్విక్! అక్కడే పట్టాలి నాయుడ్ని. సమయం జారిందంటే తుర్రుమంటుంది పిట్ట" విశ్వనాథం పురమాయించాడు.

అయిష్టంగానే లేచాడు మోహన్.

నాయుడికి, బాబాయికి ఏదోవుంటే వాళ్ళిద్దరూ కిందా మీదా పడాలిగానీ, మధ్య కాలేజీ కుర్రాళ్ళని ఈడవడమెందుకు? తేరగా వున్నారనా? వాళ్ళకేం. యేదో ఒక నెపాన చదువు ఎగ్గొడితే చాలు. పదుగురు కోతిమూక ఒకచోట చేరి, ముటాచేసుకొనే వీలు కలిగితే చాలు. అది సమ్మెకానీండి. సినిమాహాలు కానీండి. రెండూ ఒకటే వాళ్ళకి. చిన్న 'గెట్ టు గెదర్!'

'సమ్మె' అనగానే తుమ్మ మీద ఈగలు వాలినట్లు కుర్రాళ్ళు బిలబిల మని ముసురుకున్నారు. కలరాలాగా ఊర్లో వ్యాపించిపోయింది సమ్మెవార్త. ఇంకా కాలేజీలు తెరవలేదు. పైవూరి కుర్ర వాళ్ళు పై వూళ్ళలోనే వున్నారు. గానీ ఇప్పటికొచ్చిన మూక చాలు, ఆస్పత్రిని ఆ పళంగా కప్పెట్టడానికి. అరగంటలో ఆస్పత్రి ప్రాంతం గగ్గోలయి పోయింది. రోగుల్ని నిలబెట్టేస్తున్నారు. లోపలికి వెళ్ళనియ్యడం లేదు. డిస్చార్జి అయి ఇళ్ళకి పోతున్నవాళ్ళని అటకా యిస్తున్నారు.

"అన్యాయాన్ని అరికట్టాలి" "బాపయ్య పవిత్ర ఆత్మకి శాంతి కలగాలి" "నాయుడు డౌన్ డౌన్!" "డాక్టరూ డౌన్ డౌన్!" "మహాత్మా గాంధీకి జై!" "భారతమాత జిందాబాద్!" "ఇందిరా గాంధీ..." కలగాపులగంగా నినాదాలు, కంఠస్తమొచ్చినవన్నీ వల్లె వేస్తున్నారు కుర్రాళ్ళు! వెర్రాళ్ళు.

ఔను, అవన్నీ కావాలి!

గానీ, రోగులకి మందులు కావాలి.

పోవలసిన వాళ్ళు ఇళ్ళకి పోవాలి.

మర్యాదగా చెప్పగలిగినదంతా చెప్పారు వాళ్ళు. గానీ కుర్రాళ్ళు వింటారా? కావలిస్తే వాళ్ళని కూడా తమతో కలిసి కేకలు వెయ్యమని బలవంతం చేశారు. నొప్పులు పడుతూ రిక్షాలో ఆగి

పోయిన ఒక ఆడకూతుర్ని చూసి మోహన్ జాలిపడబోయాడు. _ తంతాం తన్నారు!

అని పూరుకోకుండా ఒక పెద్ద పెవ్వడో ఆవిడ్ని చూసి వేళాకోళమాడాడు. అంతే! మొదలైంది యుద్ధం. జనానికి, పత్రాళ్ళకి (క్షమించాలి, పత్రాళ్ళు కూడా జనమే!) దొమ్మీ సాగింది ఘోరంగా.

కలక్టరుగారి దృష్టికెళ్ళేగాకా మన కెందుకులే పొమ్మని జాగ్రత్త పడ్డారు పోలీసు వాళ్ళు. కలెక్టరుగారి చెవిని సోకింది వ్యవహారం. మరి తప్పింది కాదు. పెళ్ళాం బిడ్డల్ని చివరి మారు చూచుకొని, దేవుళ్ళకి దండాలు పెట్టి, అవసరమైన అప్పగింతలు పూర్తి చేసుకొని ట్రక్కులెక్కారు పోలీసులు.

అలా మొదలైన రగడ ఆరు రోజులు నిర్విరామంగా సాగింది. అన్నీ బంద్! గెరిల్లాయుద్ధం. చచ్చినవాళ్ళు చచ్చారు. గాయాలు తిన్నవాళ్ళు సరే. సుష్టుగా తిన్నారు. కొందరు పత్రాళ్ళు డిబారు కాగా, మరికొందరు జైళ్ళకి కూడా వెళ్ళారు. పట్నంలో దైనందిన పౌర జీవితంలో ప్రతిష్టంభన ఏర్పడింది! పత్రికలలో వార్తలు! మినిష్టర్ల రాకలు! విందులు, వినోదాలు! రోజుకూలి చేసుకునేవాళ్ళు ఆరు రోజులు పస్తులు! కొండొకచో చావులు!

ఏడోరోజు తెలతెల వారుతుండగా నాయుడుగారొచ్చి విశ్వనాథం కాళ్ళు పట్టేసుకుని నెత్తి బాదుకున్నాడు.

ఖర్చులు నిమిత్తం, నష్టపరిహారంగా బోలెడంత పైకం ముట్టజెప్పాడు. పగలు పది గంటల వేళకి, ఎన్నికల్లో తాను పోటీనుండి విరమించుకున్నట్టు ప్రకటన జారీ చేశారు విశ్వనాథంగారు.

స్వస్తి పరిభ్యాం సుఖినోభవంతు...

14

సా, గా శ్యామలరావు ఎప్పటిలాగ స్వీట్లు తింటున్నారు మిద్దె మీద కూచుని "పెళ్ళి కూతురెలా వుంది?" అడిగాడు.

చాలా అందంగా వుంది" చెప్పాడు శ్యామలరావు.

---

* ఏమోయ్! డ్రాయరుతో వస్తున్నావ్? స్విమ్మింగ్‌కా?
  అబ్బే! క్లబ్బునుంచి ఇంటికి పోతున్నా!
* పత్రికా సంపాదకుడు రచయితతో :- మీ నవలంతా ఓపికగా చదివానండి. కె. జి. ఐదు రూపాయలు చొప్పున తీసుకుంటాం! ఇష్టముంటే ఇవ్వండి!

వెలిచేటి శ్రీనివాసరావు.

"ఎప్పుడు పెళ్ళి?"

జవాబు చెప్పలేకపోయాడు. మౌనంగా కూచున్నాడు.

"ఏమిటయ్యా పరధ్యానం? మమ్మల్ని మరిచిపోయేకాలం ఇంకా ముందుంది. అందాకా కాస్త మాటాడు." పక్కనున్న సాహూ శ్యామలరావుని ముడుకుతో పొడిచాడు. సాహూకి జరిగిందంతా వివరించాడు శ్యామలరావు. విన్న తరవాత సాహు కూడా ఏం మాటాడలేక ఊరుకున్నాడు.

"ఏం చెయ్యడానికీ తోచడంలేదు. సాహూ! వాళ్ళ పరిస్థితి చూస్తే అలా వుంది. నాన్నేమో గొడవచేస్తున్నాడు."

"అసలు నీ నిర్ణయం ఇలా వుందేమిటి? అనాధల్ని చేరదియ్యడం మంచి గుణమే గానీ, దానికోసం ఇంత చెయ్యాలా నువ్వు?"

ప్రతీవాళ్ళు తన ఆశయాన్ని వెక్కిరిస్తూన్నట్టు కనిపించింది శ్యామలరావుకి, తనేమైనా తప్పు నిర్ణయం తీసుకున్నాడా? తనదేనా పొరపాటు? కాకపోతే ఇంతమంది ఒకే మాట చెప్తున్నారేం తనకి!

"పెళ్ళి, మనిషి జీవితంలో పెద్ద మార్పు తెచ్చే సంఘటన సాహూ," జనాంతికంగా ఆలోచిస్తున్నాడు శ్యామలరావు. "నీ శేష జీవితంలో చాలా యెక్కువ భాగం నీ పెళ్ళిమీద నిశ్చయంగా ఆధారపడుతుంది. అలాంటప్పుడు నీ తత్వానికి తగినట్టు భార్యని నువ్వెంచుకోవాలి. ఈ యెంచుకోవడమే నీ తత్వాన్ని కూడా డిజైన్ చేస్తుంది. నా భార్య విశ్వాసానికి, కృతజ్ఞతకి తిరుగులేకుండా పాత్రుడ్నికావాలని నా ఆశ. నన్నెందుకు తప్పు పడతారు మీరు?" అడిగాడు.

ఆ చివరి వాక్యం తప్ప మరేమీ అర్థం కాలేదు సాహూకి.


ఆలా మౌనంగా కాసేపు గడిపిన తర్వాత కిందికి దిగేరు. అంతవరకు వరండాలో లడ్డూలు కడుతూన్న సరోజని వీళ్ళని చూడగానే లేచి నిల్చుంది. పక్కకి తప్పుకుంది.

శ్యామలరావు కుముదినిని చూశాడు.

ఎక్కడో పరారీ అయిపోయాడు, మరి తిరిగి రాడనుకున్న గోపాల్ చౌదరి; కుముదిని జీవితంలో మళ్ళా చొచ్చుకొచ్చి, ఆవిడ పసుపుకుంకుమల్ని మంటగలిపాడు. తల బోడిచేసి పోయాడు. శోభనంతటినీ కొల్లగొట్టి కన్నుమూశాడు. ఆ చావడం ఎక్కడో చచ్చిపోయినా, కుముదిని ఈ పదెనిమిదేళ్ళ వయసులో ఇలా ఎనభైఏళ్ళగంగా భాగీరథీ సమానురాలి అవతారం దాల్చే అవస్థ కలగకపోయేదనుకున్నాడు శ్యామలరావు.

సాహూ ఇంటి లోపలికెళ్ళాడు.

"మీ పెదనాన్నగారు ఇంకా పట్నం నుండి రాలేదా?" ఏదో ఒకటి మాటా



డాలని శ్యామలరావడిగాడు కుముదినిని.

"రాలేదు" ముక్తసరిగా జవాబు చెప్పింది.

సాహుకోసం ఎదురుచూస్తు నిల్చున్నాడు.

"మీకు పెళ్ళి ప్రయత్నాలు జరుగుతున్నాయట? అన్నయ్య చెప్పాడు".

శ్యామలరావు కొంచెం విస్మయంగా కుముదినివైపు చూశాడు. ఏం జవాబు చెప్పేవాడోగాని సాహు తిరిగొచ్చాడు

ఇద్దరూ కాలవవైపు నడక సాగించారు.

"నన్ను కుముదిని ఒక విషయం కోరింది" ఉపోద్ఘాతం ప్రారంభించాడు సాహు.

"ఏమిటది?" అనాసక్తంగానే అడిగాడు శ్యామలరావు

"ఎలా చెప్పాలో ఇరుకుగా వుంది నాకు. భర్తపోయి పదిహేను రోజులయినా కాకుండా ఒక హిందూ ఆడది పోకూడని పోకడ ఇది" అన్నాడు. శ్యామలరావుకేం అర్థం కాలేదు.

'ఏమిటి?' అడిగాడు.

"ఇక ఏం చెయ్యదలచుకున్నావని దాన్నడిగాను శ్యామూ! ఇన్నాళ్ళూ మొగుడికోసం ఎదురు చూడటంతోటే కాలం గడిపింది అనుకుంది. అనుకుంటే

ఇక ఆ పనికూడా లేకుండా పోయింది కదా! పోనీ పిల్లలుంటే సాకుతూ కాలక్షేపం చేస్తుందనుకోవచ్చు, బ్రతుకులో ఏ ఆశ లేకుండా మోడుబారిపోయి బ్రతకడంకన్నా చచ్చిపోవటం మేలుకదా"

నిజమే! కుముదిని బ్రతుకులో మరే ఆశ లేదు. శ్యామలరావుకు జాలేసింది.

"మాట్లాడకుండా కూర్చున్న దాన్ని రెట్టించాను. 'మరో పెళ్ళి చేసుకుంటా' నని నిర్భయంగా చెప్పింది. తెలిసిందిగదూ?" చెల్లెల్ని మెచ్చుకుంటూ స్నేహితుడివైపు చూశాడు,

'మరో పెళ్ళా?" ఆశ్చర్యపోయాడు శ్యామలరావు.

"అవును. ఆశ్చర్యపోతావేం? నువ్వే ఒకమారు జోస్యం చెప్పావుగా? దాని అందానికి పెద్దమ్మలూ, పిన్నమ్మలూ భద్రతలూ కాలేరని? ఎవరితోనైనా లేచిపోతుందని? లేచిపోవడం కాదు. గానీ సుమారు అలాంటిది చేస్తానంటున్నది."

"మళ్ళీ పెళ్ళికి మీలో ఎవరొప్పుకుంటారు? తప్పుకాదా?"

"తప్పే! ఎవరొప్పుకుంటారు?" అన్నాడు సాహు. "అందులోనూ మొగుడు చచ్చి. కొడుకొకడు కూడా పుట్టిచచ్చినముండనెవరయ్యా ధైర్యంగా చేసుకుంటారు? గానీ కుముదినికి భయం లేదు. ఎవరూ గాకపోతే, చేసుకోకపోతే మామూలు విధవా జీవితానికి అలవాటు పడిపోతుంది. దాన్నిగూర్చి కుముదినేం గట్టిగా ఆలోచించడం లేదు. నా ప్రశ్నకి మనసులోని జవాబు చెప్పిందంతే!"

"అప్పుడు నువ్వలాంటి ప్రశ్నలు వెయ్యకూడదు సాహూ!" చిరాకుపడ్డాడు శ్యామలరావు. బ్రతుకుమీద తీపు నాగుబాము లాంటిది. కదిపితే కస్సుమని పడగెత్తి నిలబడుతుంది.

"ఏం? ఎందుకు వెయ్యగూడదు? మా యింట్లో జీతం బత్తెంలేని పనిమనిషిగా వాడుకునే స్వార్థంకోసమైతే ఏ ప్రశ్న వెయ్యకుండా తప్పుకోవాలి. దాని బ్రతుకుమీద ఏ మాత్రం శ్రద్ధవున్నా తటస్థంగా ఊరుకోలేను."

"అవుననుకో! గానీ మరీ పదిహేను రోజులు..."

"ఏం పదిహేను రోజులైతే? పదిహేను రోజులలో కుముదినికి ఆకలికాకడం లేదా? నిద్రరావడం లేదా? మొగుడు పోయి పదిహేను రోజులయినా కాకముందే దాన్ని ఇంటిపనులకు వాడుకోవడం తప్పు కాకపోగా, భవిష్యత్తును గూర్చి ప్రశ్నించడం తప్పా?"

సాహు చెప్పింది సబబే.

కానీ కుముదిని జీవితం మరింత సమస్యల తోరణమై పోతుంది.

"ఎవరినైనా వరుడ్ని వెతికావా?" అడిగాడు శ్యామలరావు.

"వెతకడంకాదు, సిద్ధంగావున్నాడు.

"శుభం. ఐతే వెంటనే పెళ్ళి జరిపించెయ్యి గాని మీ నాన్నతో ఏం చెప్తావు?'

"ఏమీ చెప్పను చెప్పకుండా తంపేస్తాను నేనైతే! కానీ ఈ పెళ్ళి నేను చెయ్యగలిగింది కాదు. పెళ్ళికొడుకే చేసుకోవలసింది"

"ఇంతకీ ఆ పెళ్ళికొడుకెవరు?"

"నువ్వు!"

ఉలిక్కిపడ్డాడు శ్యామలరావు "ఏమిటి? నేనా?"

"అవును నువ్వే! ఏం నీకూ అభ్యంతరమేనా? "

"అభ్యంతరమని గాదు గాని సాహూ, అసలు నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలుసునా అని "

"నేననుకున్నాను శ్యామలరావ్!" పేలగా నవ్వాడు సాహూ "కబుర్లు చెప్పడం వరకూ తేలికే! కార్యసాధనకొస్తే తేలిపోతుంది వ్యవహారం! అందుకే నువ్వయితే అభ్యంతరం లేదని కుముదిని అన్నప్పుడు, అలాంటి ఆశలు పెట్టుకోవద్దని హెచ్చరించాను దాన్ని. గానీ నువ్వయితేనే అది రెండోపెళ్ళికి సిద్ధమట లేకపోతే విధవగానే జీవితం గడుపుతానంటుంది "

"సాహూ !" చాలా అయోమయావస్థలో శ్యామలరావు పడ్డాడు, "నేనెందుకు మధ్య మీ మాటల్లో ప్రవేశించాను. అలాంటి అభిప్రాయం కలిగించలేదు కుముదినికి. స్నేహపూర్వకంగా ప్రవర్తించాను. ఆవిడ కష్టాలపట్ల సానుభూతి చూపాను. అంతకంటే మరేవిధంగానూ ప్రవర్తించలేదు నేను నన్నయితేనే చేసుకుంటాననడం, అసలు నన్ను చేసుకుంటాననడం నాకు విచిత్రంగా వుంది"

"ఆ ఆసక్తి నీకెందుకోయ్ అసలు?" మధ్యలో సాహూ నిలదీశాడు. "పూరికే కాలక్షేపానికి పరాయి ఆడవాళ్ళమీద

ఏ పురుషుడూ ఆసక్తి చూపడు. ఆ నిజం ముందు తెలుసుకో నువ్వు."

శ్యామలరావుకి ఆశ్చర్యం వేసింది.

తన ఆసక్తి వెనక ఏమైనా వుందా?

ఇప్పుడు సాహూ చెప్తే వున్నట్టే వుంది.

"చూడు, నువ్వింత బెంబేలు పడి పోవడం దేనికో నాకాశ్చర్యం వేస్తుంది. ఇప్పుడిప్పుడే చెప్పావు గదా? మీ నాన్నగారు ఎలాంటి పిల్లనైనా కోడలిగా చేసుకోవడానికి ఇష్టపడుతున్నారని? అతనికి ఇష్టంలేని ఆ జబ్బుమనిషి మీద నువ్వు కురిపించబోయే నీ మంచితనం,—అతను సరిపెట్టుకోగలిగిన మా చెల్లెలు మీద చూపించు! నీ శ్రేయస్సు కోరిగదా ఆ పిల్లని చెయ్యనంటున్నారు? మా కుముదినిని చేసుకుంటే మీ శ్రేయస్సుకేం భంగం కలగదు. ఏదైనా అపకీర్తి కలగొచ్చు. గానీ అపప్రథకంటే శ్రేయస్సు ముఖ్యమని మీ నాన్నగారే అంగీకరిస్తున్నారు."

నాన్నగారి అంగీకారం సరే!


గానీ తన మాటేవిటి?

సరోజిని పరిస్థితి చూసినప్పటినుంచి తప్పకా పిల్లని చేసుకుని, సుఖపెట్టాలన్న కోరిక బలంగా రోజు రోజుకూ పెరిగిపోతుంది. గడుస్తున్న ప్రతిరోజూ దుర్భరంగా గడుస్తుంది. ఏదో వేళ దాటిపోతుందన్న వ్యథ పీకేస్తోంది. ఇప్పుడు తానీ కొత్త సమస్యపట్ల ఎలా మొగ్గగలడు.

"నువ్వు వాళ్ళకింకా మాటివ్వలేదు. మించిపోలేదు. నేనైతే మా కుముదినికి బ్రతుకుమీద ఆశలు రేకెత్తించాను. అందుకు పరోక్షంగా ఎంతో కొంత నువ్వు కూడా దోహదం చేశావు. ఇప్పుడు నిన్ను చూస్తే కుముదినికి ఏమీ అనిపించదంటావా? ఎప్పుడైనా కష్టం కలిగినవేళ నువ్వు జ్ఞాపకం రాకపోతావంటావా? నీకిప్పుడు అనుకుంటున్న ఆ పిల్ల కనీసం నిన్ను చూడనైనా లేదు. గానీ కుముదిని అలా కాదు. చూసింది. చూస్తోంది_ఇకమీద చూస్తుంది కూడా!!!

"నే నేం చెప్పలేకపోతున్నాను సాహూ." తేరిపి జేసుకుని జవాబు చెప్పాడు శ్యామలరావు. "గానీ అపకీర్తి ఎక్కువా, శ్రేయస్సు ఎక్కువా అని లెక్కలు కట్టుకోలేను నేను. నాకు రెండిటిమీద శ్రద్ధ లేదు. ఒక అసహాయుని ఆదరించి, ఆ గొప్పను అనుభవించే వీలు నాకు కావాలి. అప్పుడు నా శ్రేయస్సు నా కీర్తిప్రతిష్టలు నాకు లెక్కలోవి కావు" అన్నాడు.

"ఐతే ఆదరించడమన్నది మా కుముదిని పట్లనైతేనే నిజమైన ఆదరణ ఔతుంది. నువ్వే ఆలోచించి చూడు. కేవలం మా చెల్లెలి సుఖంకోసం నేను పక్షపాత బుద్ధితో నీకు చెప్పడం లేదు. ఆ పిల్లకి అసలు పెళ్ళే కాలేదు గదా, ఇంతవరకూ? గంతకు తగ్గ బొంత ఎవరో దొరుకుతారు. గానీ కుముదినికి పెళ్ళి



యింది. మరో పెళ్ళి వూసెత్తలేము. ఎవరిప్పుడు నిజమైన అవసరంలో వున్నారో నువ్వే చూడు."

తండ్రిని బలవంతంగా ఒప్పించడానికి కాయశక్తులా శ్రమపడుతున్నాడినాళ్ళు. ఇప్పుడక్కరలేదు, ఇంకోపిల్లని చేసుకుంటాననడం ఎంత హాస్యాస్పదం? గానీ మరోవైపుచూస్తే తన తండ్రికి కొంతలో కొంత నచ్చేపనీ-తనకీ తృప్తి కలిగే పనీ చేసినవాడౌతాడు, కుముదినిని చేసుకుంటే!

తాను తిరిగొస్తుంటే సీతాపతిగారు చూసిన దీనమైన చూపు గుర్తుకొచ్చింది శ్యామలరావుకి. కాంతమ్మ అనుమానంలేని నిరాశతో తలొంచుకుని నిల్చోవడం కళ్ళలో మెదిలింది. పెళ్ళి చూపులకు చక్కగా ముస్తాబై, కాబోయే మొగుడి ఎదట కుందనపు బొమ్మలాగా కూర్చుని సిగ్గులు పోవలసిన సరోజిని-రోగంతో మెలికలు తిరిగిపోతూండడం శ్యామలరావు గుండెలో కొట్టుకులాడింది.

కుముదిని!

భర్తలేకపోవడం ఒక పెద్ద ట్రేజడీ. భర్తపోయిన తరవాత పెళ్ళిచేసుకు సుఖపడాలన్న కోరిక కలగడం మరో పెద్ద ట్రాజడీ!

ఏం జవాబు చెప్పగలడు తను?

కాసేపు కాలవగట్టుమీద కూర్చున్నారిద్దరూ. చీకటి పడుతూండగా వెనక్కి బయల్దేరినప్పుడు, "ఒక స్నేహితుడి కోరికగా గౌరవించి ఆలోచించు శ్యామలరావు, నాకు మా కుముదినంటే ప్రాణం. అది సుఖపడాలి" అని చేతులు పట్టుకుని చెప్పాడు సాహు.

ఎవరిళ్ళకు వాళ్ళు చేరుకున్నారు.

రంగారావు గదిని దాటి తన గదిలోకి పోతున్న శ్యామలరావుని గమనించి వెనక్కి పిల్చాడు రంగారావు.

"ఆ వూరు ఉత్తరం రాశాను, పెళ్ళికి అంగీకరిస్తున్నామని. నీమాట ప్రకారమే కానీ! బహుశా మరి కొద్ది రోజుల్లో ముహూర్తం పెట్టించుతారు."

శ్యామలరావు అప్రతిభుడై నిలబడిపోయాడు. (ఇంకా వుంది.)

ఏప్రిల్ ఫూల్

రచన: రాజా (ముదునూరు)

ఏప్రిల్ వస్తున నన్ను 'ఫూల్' చేసి వెళ్ళావు
నిజంగా 'ఫూల్' నయ్యానావేళ–
నా తాంబూలంలో కొరికిన సగంతో
ఎరుపెక్కిన నీ పెదాలు
వెన్నెలవానలో నను కవ్విస్తూంటే
నిజంగా 'ఫూల్' నయ్యానావేళ
కసిగా కొరుక్కున్న పెదవుల పగుళ్ళనుండి చిమ్మిన రక్తంతో
నా పెదాలూ, నీ పెదాల్లా ఎర్రబడ్డాయి—

నేను 'ఫూల్'ని కదూ!

పిల్లగాలులు చేసే చిలిపి అల్లరికి
అలల్లా నీఫాలాన లేచిపడుతున్న ముంగురులు
నా నరాల సరాలను మీటుతుంటే
నిజంగా 'ఫూల్' నయ్యానావేళ
వెర్రిగా మొహంమీదికి జుట్టును చిందరవందరగా పీక్కున్న

నేను 'ఫూల్'ని కదూ,

కలహంసలా నువు కదిలివెళ్తూంటే
నీ నడకలో నాకుదూరమౌతున్న
అపూర్వ నాట్యసంపదనుచూసి
నిజంగా 'ఫూల్' నయ్యానావేళ
పిచ్చిగా నినుచూస్తూ కోతిలా కుప్పిగంతులేసిన

నేను 'ఫూల్'ని కదూ,

సృష్టికర్తచేసిన అపూర్వసృష్టివి నీవు
అందని తియ్యని ద్రాక్షపండువు నీవు
అందమే అందలం పట్టిన నీ శిల్పంచూసి
నిజంగా 'ఫూల్' నయ్యానావేళ
మింటమెరిసే తారకవని తెలిసీ నిన్నాశించిన నేరానికి

నేను 'ఫూల్'ని కదూ!



నాట్ ఫర్ హైర్

రాయప్రోలు లలిత

స్వంత వాహనం ప్రతివారికి వుండటం అన్నది అనాదిగా ప్రిస్టేజ్ ,యిష్యూయే! పూర్వకాలంలో ఎంతటి వీరుడివైనా షికారుకు వెళ్ళటానికి రధం కొనకపోతే ఆ యింట్లో శాంతి పూజ్యం అని నా నమ్మకం. సైకిల్ కొన్నందువల్ల యింటావిడికు పెద్దగా ఉప

యోగం లేక పోయినా ప్రక్కింటి వాళ్ళ అబ్బాయిని బజారుకు పంపడానికి ఉపయోగిస్తుంది. అందువల్ల ప్రతియింట్లో వారి వారి ఆదాయాన్ని బట్టి వాహనం కొనడానికి నిరంతర ప్రయత్నం జరుగుతూనే వుండటం అందరికీ అనుభవంలో వున్నదే!

మా యిల్లు కూడా ఈ విషయంలో అందరితోబాటు లోకాన్ని అనుసరిస్తున్నది రెండు వందలరూపాయలు ఆదాయం వున్నప్పుడు సైకిలుతో సరిపెట్టుకొన్న 'ప్రిస్టేజ్'' యిప్పుడు స్కూటర్ లేకపోతే చాలా క్రిందికి దిగి పోయినట్లయింది. పోనీ స్కూటర్ కొందామా అంటే వెస్పాకి ఏడేళ్ళు, లాంబ్రెటాకి ఐదేళ్ళు వెయిటింగ్ తోనే సరిపోతుంది. స్కూటర్ ఖరీదంత బ్లాక్ మనీ యివ్వటానికి మనసొప్పదు. మిగతా రకాలు చీప్‌లో కొని 'ప్రిస్టేజ్'ని నిలబెట్టు కొందామంటే సైకిల్ వేగాన్ని మించవు. ముఖ్యంగా శ్రీమతులు కూర్చొనేందుకు సరిపోవు. (ఊహించే వుంటారు మా ఆవిడ బరువు) ఆఖరుకు బాగా ఆలోచించి ఎప్పుడొస్తే అప్పుడే కొందామని వెస్పాబుక్ చేశాము. నెలకోసారి వెళ్ళి లిస్ట్‌లో మా నెంబరు ఎంత ముందు కొచ్చిందో వాకబు చేయటంలో మూడేళ్ళు పట్టింది. ఇప్పుడు మాకు వెస్పాతో పని లేకుండా పోయింది. మా జనాభా మొత్తం 2+2 అయింది.

ఒక రోజు ప్రొద్దున్నే మా బావమరిది గారు దిగ బడ్డారు. ఏం మహానుభావా అంటే! అతనూ వాళ్ళన్నయ్యా ఆస్తులు పంచుకొన్నారట. ఆడబడచుకదాని మా ఆవిడగార్కి చెరో వెయ్యి యిచ్చేందుకు నిశ్చయించుకొన్నారట. ఇచ్చి పోదామని వచ్చారాయన. నాకు చటుక్కున ఒక ఐడియా వచ్చింది. మా ఫ్రెండ్‌కి నెక్ట్స్ మంత్‌లో వెస్పా అలాట్‌మెంట్ అయిందట. ఏదో చిన్న బండి యున్నాళ్ళు వాడుతున్నాడు. అది అమ్మేయాలనుకున్నట్లు మాటల సందర్భంలో అన్నాడు. అదినేను తీసుకొంటేనో! అనే ఆలోచన బయట పెట్టి శ్రీమతిగారి పూర్తి అంగీకారం తీసుకొని (స్త్రీ ధనం కదా) బావమరిదిగారితో కలిసి ఫ్రెండింటికి వెళ్ళాను. బేరం సెటలయి పోయింది తొందరగానే!

మా గాడి బ్రహ్మాండంగానే రోడ్డుమీద జారిపోతుందిగాని ఒక్కటే డిఫెక్ట్. శబ్దం ఎక్కువ స్పీడు తక్కువ. ప్రొద్దున్న స్టార్ట్ చేస్తే స్టార్టింగ్ ట్రబుల్ వుండదని బండి కొన్నప్పుడు స్నేహితుడు సలహాఇచ్చాడు. రోజూ అదో కార్యక్రమం. దాన్ని స్టార్ట్ చేసినప్పటి మోతకి మా పిల్లలిద్దరూ కుయ్యోమంటూ లేచి కూర్చొనేవారు. మా ఆవిడ కూడా పదిరోజులు వాళ్ళ గోలనీ నా గోలనీ ఐమీన్ స్కూటర్ గోలనీ భరించింది కానీ ఇంక భరించలేక కొంచం విసుగుని ప్రదర్శించటం మొదలుపెట్టింది. ఈ సమయంలోనే మాకు హైదరాబాద్

ట్రాన్స్‌ఫర్ అయింది. అంత అందమైన వూరికి ఈ డబ్బా స్కూటర్ పట్టు కెళ్ళొద్దు అమ్మేద్దామని మా ఆవిడ,నువ్వూ ఆ ఊర్లో ఉండ తగనని నేనూ. నేను మటుకు ఆ స్కూటర్ తీసుకెళ్ళటానికి ఒప్పుకోను అని ఫైనల్ వార్నింగ్ యిచ్చింది మా ఆవిడ. ఏం చేస్తాం ఖర్మ! ఆడవాళ్ళదే రాజ్యం అనుకొని బండిని తీసుకెళ్ళి నేను కొన్నతని అప్పగించి 'నాయనా ఎంతిచ్చినావాలు' అన్నాను.

చిన్న చిన్న ఊళ్ళల్లో అయితే స్కూటర్ మీద ఇంతమందే ఎక్కాలన్న రూల్ లేదు కాని, ఈ ఊళ్ళో మటుకు మూడో తలకాయని ఎలౌ చెయ్యరట! అన్నట్లు చెప్పటం మరచిపోయా, మేము వెస్పాకి రిజిస్టర్ చేస్తే దానిపేరు 'బజాజ్' అని మార్చుకున్నది కానీ మా కింకా ఎలాట్‌మెంట్ కాలేదు. మా శ్రీమతి చెప్పిన శుభ వార్త విని ఇక స్కూటర్ విషయం మర్చిపోయి వేరే ప్రయత్నం మొదలు పెట్టాల్సి వచ్చింది.


కారు— మా ప్రస్తుత జనాభాకి సరి పోయే వాహనం. మా బడ్జెట్‌కు ఎక్కడా అందనిది. సెకండ్‌హాండ్ కారు ఐదారు వేలకే దొరికితే చూద్దామని ఒకరిద్దరితో చెప్పాను. రెండు కార్లు చూపారు కానీ రెండూ వింటేజ్ కార్ రాలీ (Vintage car rally) కి పనికొచ్చేవే! కొంచెం లేతవయస్సు లేక మధ్య వయస్సులో వున్నవి కొనడానికి డబ్బుకోసం నాకు మధ్యవయస్సు వచ్చేదాకా ఆగాలి. ఈ అన్వేషణలో నా శ్లోక ఆలోచనవచ్చింది. అదే ఈ రచనకు ఆధారం.

పెద్దపెద్ద పట్టణాలలో వ్యాపారస్తులు. బాగా డబ్బున్నవారు ఎంత దూరమైనా తీరుబడిగా వెళ్ళడానికి రిక్షాలు వుంచు కొంటారట. కానీ ఈ జెట్ యుగంలో రిక్షాకొనటం నా కెందుకో రుచించ లేదు. కారు మన అందుబాటులో లేదు. అప్పుడో ఆలోచన వచ్చింది— ఆటోరిక్షా!

ఆటో రిక్షాలు స్వతంగా వాడుతున్న వాళ్ళని ఎందువల్లనో నేను చూడలేదు. డెలివరీ వానులుగా అద్దె రిక్షాలుగా చూశాను. అదయితే మాకు అన్నివిధాలా సరిపోతుంది. వాకబు చేసి మూడు నాలు గునెలలలోగా ఆటోరిక్షా సంపాదించ గలి గాను.

ఇక మొదలయింది కథ!

రిజిష్ట్రేషన్ చెయ్యడానికెడితే ఆటో రిక్షాకు ప్రైవేటు రిజిస్ట్రేషను కుదరదు. పబ్లిక్ కేరియర్‌గా చెయ్యాలంటారు. నేను నా స్వంత వాడకానికి కొన్నానని చెప్తే నమ్మరుకదా ఖర్మ. "ముందు ఇలా రోడ్‌టాక్స్ తగ్గుతుందని చేస్తారు కాని అసలు అద్దెకే నడుపుతుతారు. ఇంతకీ మీ ఆటోకి ఫేర్‌మీటరు లేదు. రిజిష్ట్రేషన్ చెయ్యడానికి వీల్లేదు." అని ఖచ్చితంగా చెప్పాడక్కడి మహానుభావుడు. అతన్ని



ఎలాగైతేనేం నమ్మించి ప్రైవేట్ వెహికల్‌గా రిజిష్టర్ చేయించడాన్కి నా తల ప్రాణం తోకకొచ్చిందంటే నమ్మండి.

మర్నాడు మంచి టైము చూసి, మా ఆవిడనీ, పిల్లల్నీ ఎక్కించుకుని బయల్దేరాను. మర్చే పోయాను చెప్పడం. మా ఆటో రంగు విషయంలోకూడా కొంచం శ్రమపడాల్సి వచ్చింది. కంపెనీ ఒరిజనల్‌గా నలుపూ పసుపూ వేసి పంపించింది. అది మార్చి నా కిష్టమయిన నీలంవేయించడాన్కి రెండు మూడు గారేజ్‌లు తిరగాల్సివచ్చింది. వాళ్ళందరూ "మీకు తెలియదండీ! ఆటోలకి పసుపూ నలుపే ఉండాలి. మేము ఎన్నిటికి వేస్తున్నాము" అనేవాళ్ళు. ముందుగా మా బంధువుల ఇంటికి వెళ్ళాము. అక్కడ గుమ్మందగ్గర ఆపి, తాళంవేసి లోపలికి వెళ్ళాము. ఈ లోపల ఇద్దరు ముగ్గురు గుమ్మం దగ్గర కొచ్చి, "ఏ య్ ఆ టో! చ ల్తే క్యా" అన్నారు. వాళ్ళకి ఇది స్వంత ఆటో అని

చెప్పటం వ్యర్థం అవిపించి, నహీ చలేగా అని చెప్పి పంపించేశాను.

సాయంత్రం సినిమాకి అని బయలు దేరాము. సినిమాహాల్స్‌లో కార్లకీ, స్కూటర్లకీ, సైకిళ్ళకీ వేర్వేరు జాగా లున్నాయి. మా ఆటో ఎక్కడ ఉంచడమో అర్థం కాలేదు. కార్లు పెట్టేచోట పెడితే అక్కడి అటెండర్ ఆటోలకి ఇక్కడ పార్కింగ్ వీల్లేదన్నాడు. వాడితో నా కథంతా చెప్పి ఆటో నా స్వంతందని, డ్రైవర్ని నేనేననీ నమ్మించి అక్కడ ఉంచాను.

మర్నాడు ఆఫీసుకి ఆటో తీసుకెళ్ళాను, మా వాళ్ళందరూ కొంచం వింతగానూ, చూసారు. ఏమయినా మధ్యాహ్నం కాఫీ పార్టీతో వాళ్ళని సంతృప్తి పరచగలిగాను. సాయంత్రం ఆఫీసు అవగానే మంచి స్పీడులో వస్తున్నాను. ట్రాఫిక్ లైటు దగ్గిర ఆగగానే ఒకాయన ఎక్కి కూర్చు న్నాడు అటీడ్స్‌చలో అని అతన్ని దిగ మందామనుకునే లోపే గ్రీన్ లైటు వెలి గింది. వెనకాల వాళ్ళు హారన్ మ్రోగిం చడం మొదలు పెట్టారు. సరేనని లైటు దాటించి ముందుగా ఒక ప్రక్కన ఆపి ఆయనని దిగమన్నాను. ఎందుకు దిగాలి! అన్న ప్రశ్న వేసాడు ఇది మిమ్మల్ని తీసి కెళ్ళదు కనుక. అని పెంకెగా సమాధానం చెప్పాను. ఎందుకు తీసికెళ్ళదు? నీ నంబ రెంత! ముందు ట్రాఫిక్ కానిస్టేబులు వద్దకి నడు. బొంబాయిలో టాక్సీలు పాసిం జర్ని ఎక్కించుకోకపోతే పోలీసు వాళ్ళు ఆ డ్రైవర్ని మరామ్మత్తు చేస్తారు. ఇక్కడ కూడా ఆ పద్ధతి వస్తేగాని బాగు పడదు. అని దిగకుండానే కబుర్లు చెప్పటం సాగించాడు. ఈ ఆటో నా స్వంతందయ్యా! అద్దెదికాదు. అని చెపుతుంటే ఓనర్ డ్రివెన్ అయినా ఆటో రిక్షా పాసింజర్ సిటీలో ఎక్కడికి తీసికెళ్ళ మంటే అక్క డికి తీసుకెళ్ళాలి. నీకు తెలియకపోతే తెలిసిన వాళ్ళనడుగు చెప్తారు. అవిదిట్టంగా కూర్చున్నాడు. కాలర్ పట్టుకులాగి అవ తల పారేద్దామనుకుంటుండగా అదృష్ట వశాత్తూ ఒక ట్రాఫిక్ కానిస్టేబులు అటు వచ్చాడు. నేను ఈ గొడవ చెప్పేలోగా అతను అడిగిన మొదటి ప్రశ్న, "నీ ఫేర్ మీటర్ ఏది?" అని. ఎలాగైతేనేం, నా లైసెన్సు, ఆటో 'సి' బుక్కూ అన్నీ చూపించి ఆ కూర్చున్న పెద్ద మనిషిని దింపించి, చుట్టూ మూగిన గుంపుని చెదర గొట్టి బయల్దేరడానికి పదిహేను నిముషాలు పట్టింది.

ఇంటికిరాగానే జరిగిందంతా మా ఆవిడతో చెప్పాను. అసలు ఆటో కొన్న ఆనందమే లేకుండా మొహం ఇంత చేసు కుని ఇంట్లో జరిగిన విషయాలు నాతో చెప్పింది. మా పనిమనిషి ఎవళ్ళ ఇంటికో వెళితే వాళ్ళన్నారట, "రిక్షాయే నయం కనీసం తొక్కేవారు వేరే ఉంటారు

ఆటో నడిపేదీ ఆయనే. వెళ్ళేదీ ఆయనే పార్టు టైము పని చెయ్యడానికి వీలుగా ఉంటుందని తెచ్చినట్టున్నారే. బాగానే ఉంది. అని మా పనిమనిషి కాస్త మా పక్షంగా మాట్లాడుతుంది. ఆవిడతో చిన్న ఘర్షణ పెట్టుకుని వచ్చి ఊరికే ఉండ బట్టక ఆ విషయం మా ఆవిడ నేను చెప్పిన విషయాలు విని రేపుతీసి కెళ్ళి అమ్మేస్తారా లేదా అని పట్టుపట్టుకూర్చుంది. మెల్లిగా నచ్చచెప్పి మర్నాడు ఊళ్ళో కాస్త వాకబుచేసి, ఆటో రిక్షాని అద్దెకి తీసుకునే వాళ్ళని వెతికి పట్టుకుని, అద్దె ఆటో తతంగం అంతే రంగు మీటరు వగైరాలు జరిపించి వదిలించుకున్నాను.

నా సలహా ఏమిటంటే ఆటో రిక్షా స్వంతానికి వాడుకుందామనుకునే వాళ్ళు ఆటో చుట్టు "స్వంత వాడకానికి" నాట్ ఫర్ హైర్," "ఖుద్ కాగాడీ" అని త్రిభాషా సూత్రాన్ని పాటిస్తూ నాల్గు పక్కలా వ్రాయించి, ఇరుగు పొరుగు వాళ్ళ మాటలు ఖాతరు చెయ్యకుండా ఉండ గలిగితే కోనండి. లేకపోతే వద్దు. *

పెండ్లి చూపులలో

మగపెళ్ళివారు: మీ అమ్మాయి క్వాలిఫికేషన్స్ ఏమిటి?

ఆడపెళ్ళివారు: మా అమ్మాయి, జై ఆంధ్రా వుద్యమంలో ప్రధమ పాత్ర వహించింది. నిరాహార దీక్షలలో పలుసార్లు పాలుపంచుకుంది. మరి మీ అబ్బాయి సంగతి?

మగపెళ్ళివారు: మా అబ్బాయి ఏం తక్కువ కాదండోయ్! రెండు బస్సులు, ఒక జీపు, పోస్టాఫీసు, రైల్వే క్యాబిన్ తగులపెట్టాడు. అంతే కాదు లాఠీ చార్జిలో రెండువేళ్ళు కూడా ఇరగ్గొట్టుకున్నాడు!

—ఎన్. బాజ్జీ.

ప్రకటన్ల(ల) ఘాషన్లు

(ఈ మధ్య దేశంలో హ్యూమర్ తెగపెరిగిపోయింది. ముఖ్యంగా రేడియో వ్యాపార ప్రకటనల్లో పత్రికాప్రకటనల్లోను, ఇంకా సిటీలో కనబడే టెక్స్టైల్ పబ్లిసిటీ బోర్డుల్లోగూడా బోల్డు దొరుకుతున్నది. అలా దొరికే దాంట్లో కొంత భాగం ఇది.

1. మౌలానా లుంగీల్లో హాయిహాయిగా ఉండండి.
2. సుఖ భోజనానికి త్యాగరాజు మార్కు తంగభస్మం వాడండి.
3. నిష్పక్ష సినీ రివ్యూలకు తెలుగు పత్రికల్ని తిరగేయండి.
4. శీఘ్ర తలనొప్పి నివారణకి తెలుగు సినిమాలు చూడడం మానండి.
5. దగ్గు, తలనొప్పి, పడిశం వ్యాధులకు 'రాజుమార్కు' మందును తగ్గేదాకా రాయండి.
6. ఎక్కడ చౌకబియ్యం దుకాణం ఉందో అక్కడ స్టాకే ఉండదు.
7. అందమైన అమ్మాయిల చిరునవ్వుల కోసం అప్సరా డ్రై క్లీనర్స్‌కి దయచేయండి.
8. అరువులో పత్రికలు చదవడం ఆంధ్రులనుండి నేర్వండి.
9. తక్కువ జాగాలో ఎక్కువ తొక్కిడితో నిలబడి ప్రయాణం చెయ్యడానికి ఇండియన్ రైల్వేలనే వాడండి.
10. ఆత్మహత్యతో బాధపడకుండా సులభతర మరణానికి మా రోడ్లు వాడండి. (ఇట్లు, విజయవాడ మునిసిపాలిటీ)
11. కావలసినంత ఇరుకులో పుష్కలం అయిన చెమటలో సుదూర ప్రయాణానికి 'మీ సేవే మా ధర్మం' బస్సుల్ని వాడండి.
12. పరీక్షలు లేకుండా పై తరగతులకు వెళ్ళడానికి మీ పిల్లల్ని ఆంధ్రదేశం పంపండి.
13. కరెంటు తక్కువ ఉన్న రాష్ట్రాలు విజయవాడ రేడియో స్టేషన్ ప్రోగ్రాముల్ని ఆదర్శంగా తీసుకోవాలి.
14. నిరుద్యోగంతో బాధపడ్తోన్నారా? మా అభిమాన నటుడి సాంస్కృతిక సంఘం ఆరంభించండి.

15. అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్‌కి క్వాలిటీసౌ చిత్రాలు నిర్మించడం తెలుగు నిర్మాతలనుండి నేర్వండి.

16. తిట్టు కవితకి ఆవేశం కావాలంటే అం. ప్ర. ప్రభుత్వ ఉద్యోగుల కరువు నివారణ పనులు గమనించండి.

17. బలం అయిన బరువులు మొయ్యడానికి 'బ్రా' మార్క్ బట్టల్నే వాడండి.

18. అసలైన 'సన్యాసి' మార్క్ కాషాయరంగు సూటింగ్స్ వాడి మీ స్నేహితురాళ్ళను జిగేలు మనిపించండి.

19. భూమిమీద ధ్వని నివారణకి తమిళనాడును, పరిసరాల పారిశుధ్యానికి విజయవాడను శరణు వేడండి.

20. మా 'నల్లి' మార్క్ దుప్పట్లలో సుఖంసుఖంగా నిద్రపొండి.

21. రోజంతా లంగర్ మార్కు చుట్టల్తో మజామజాగా ఉండండి.

22. కవుడును ద్రవపదార్థంగా పుచ్చుకోవడానికి 'హార్లిక్స్' వాడండి.

23. ఠక్కుగా పద్యాల్లో తిట్టుకోడానికి మా ప్రాచీన నాటకాలు వేయండి.

24. హాయిగా నిద్రపట్టడానికి తెలుగు రేడియో ప్రోగ్రాములు వినండి.

25. ఎప్పుడూ రెండు లేక మూడు సీరియల్స్ కావాలంటే తెలుగు వారపత్రికల్ని చదవండి

26. ఎక్కువ ధరలో తక్కువ మేటర్‌కి తెలుగు పత్రికల్ని కొనండి.


27. భావి ప్రాచీన తరాల పుస్తకాల ముద్రణకి మా 'అనాధమీ' ప్రెస్‌కి వేంచేయండి

28. నెలనెలా మా 'పమిట' పత్రికలో చిక్కని సెక్స్ కథల్ని చదివి ఆద మరచి నిద్రపొండి.

29 వారం వారం మా పత్రికలో 'కొంటి హార్మోనియం' శీర్షిక చదివి, ఉత్తరాలు రాయండి- తప్పకుండా ప్రచురింపబడటానికి

30. మీ అదృష్టం మా చేతిలో ఉంది. వివరాలకి ఐదు రూపాయలు పంపండి.

—ప్రశాంత



కె. రామలక్ష్మి

(గత సంచిక తరువాయి)

గుడిసెలో అంతా చీకటి నీడలే గాలిలో అలముకొన్న పొగ కళ్ళు చిట్లించేలా చేస్తోంది దుర్గంధ భూయిష్టమైన స్తబ్ద వాతావరణం ఓ క్షణం తల తిరిగేలా చేసింది వసంతని హాయిగా చల్లని గాలి లోంచి రాగానే దీనికి తట్టుకోలేకపోయింది మైకం వస్తుందా అనిపించింది ఎలాగో నిలదొక్కుకుంది పక్కమంచం దగ్గి రగా ముక్కాలి పీటని లాక్కుని వెంకన్న తాత చెయ్యి తన చేతిలోకి తీసుకుంటూ పీట మీద కూర్చున్నారు రావు 'నేను దీన్ని భరించలేనని కాబోలు వీరి ఉద్దేశ్యం' అను కుంది వసంత

తాత ముఖంలో ప్రేతచ్ఛాయలు తాండ విస్తున్నాయి ఒసలో తను గొణుక్కుంటు న్నాడు

"పడుకో తాతా, నేను నీతో కాస్సేపు కూర్చుని వెడదామని వచ్చాను" ఎంతో ప్రేమతో అన్నారు రావు

సీరియల్

"ఒచ్చావా బాబూ, నీ తాత గుర్రం పారిపోతోంది దారి సుగమంచేయి బాబూ, చూడు దౌడు తీస్తాను" ఏదేదో అంటు న్నాడు వెంకన్నతాత తాత చేయిని మృదు వుగా రాస్తూ అలాగే కూర్చున్నారు రావు గారు.

కొంచెం దూరంగా బెంచి చివర కూర్చుంది వసంత. ఆమె కళ్ళు ఆ చీక టికీ, దైన్యానికీ కొంచెం అలవాటు పడ్డాయి పుచ్చిన తాటాకుల అడుగునుంచి బూజులు వేలాడు తున్నాయి తాత కుక్కి మంచం మీద కంబళీ పరిచివుంది. ఇంకో చింకి కంబళీ కప్పివుంది తాతకి. రావుగారి సాక్షణంలో వసంత తన కూడా వచ్చిం దన్న ధ్యాస కూడా వున్నట్టు లేదు.

దుర్గంధాన్ని అప్పుడప్పుడు నెట్టేస్తూ గుగ్గిలం కాబోలు వాసన వేస్తూంది. గది గోడకి వున్న గూడులో దేవుడి బొమ్మ ముందు దీపం సెమ్మే వెలుగుతోంది. పొగ చూరి పోయాడు దేవుడు—ఎన్ని సంవత్స రాల నుంచి అలా ఆ చిన్ని గూట్లో పడే శాలో రావుగారి కాగదిలో మరొకరి ఉనికి గుర్తున్నట్టు లేదు. వెంకన్న తాతా, తనూ ఏకాంతంగా ప్రశాంతంగా కూర్చు న్నంత నిశ్చలంగా కూర్చుని ఉన్నారు.

"నీ కోసం నేను వచ్చాను తాతా, నీ కింకేం భయంలేదు. నిశ్చింతగా వెళ్ళిపో, నీ మనవడికియిచ్చాను భూమి. వాడూ వాడి కుటుంబం హాయిగా వుంటారు. దిగులు పడకు." అంటూ తాత నుదుటి మీదచేయి వేశారు. ఎముకల గూడులా పడివున్నాడు తాత. అస్థిపంజరం చెయ్యిలా వున్న తాత చేయి అతిప్రయాసతో లేచి రావుగారి చేయి మీద పడి ప్రేలుగా నిమర సాగింది 'నాకు తెలుసు బాబూ, నే చచ్చి పోయేలోగా నువ్వు వస్తే నన్ను న్యాయం చెయ్యవని అందుకే దేవుణ్ని ప్రార్థిస్తున్నా నీ కోసం" అన్నాడు తాత. అతని కంఠస్వరం ఓసారి గట్టిగా ఒకసారి నెమ్మదిగా విన్పిస్తూంది.

వసంత రావుగారి కేసే చూస్తూంది. భుజాలు ముందుకి వంచి ప్రేమతో తాత కళ్ళంతా తనపై పడేలా సహకరిస్తున్న రావుగారినే చూస్తూంది చక్కని తల. చక్కని మెడ. ఖరీదైన బట్టలు రావు గారి మీద నుంచి చూపులు తాత మంచం కేసి తిప్పింది మంచం మీద నుంచి మట్టి గోడ. గోడ మీంచి గుడిసె కప్పు కేసి పాకాయి ఆమె చూపులు ఆ చీకటి వెల్గు లలో పుచ్చిన వాసాల సందుల్లో తేవైరంగు లో బొద్దింకలు మీసాలూపుకుంటూ చాలా బిజీగా తిరుగుతున్నాయి. ఒక్కసారి తల తిరిగి నట్టయింది వసంతకి. చూస్తూన్న కళ్ళని వాటిమీద అడ్డువేసింది. చచ్చి పోతున్న యీ వెంకన్నతాత సాన్ని ధ్యంలో తనూ రావుగారూ యిలా ఏకాం తంగా మాటా పల్కూ లేకుండా కూర్చుని వుండడం వింతగా, మరపు రానిదిగా తోచింది. 'నేనిక్కడికి రావాలని అను కున్నారు రావుగారు' ఎందుకని? ఏమి

చెప్పాలని? తనని తాను పిచ్చిగా ప్రశ్నించు తుంది ఈ క్షణాలలో తన వ్యక్తిత్వపు మరో ఛాయని నాకు తెలియ చేస్తున్నారా? తన ఆత్మలోని ఆరాటాన్ని తెలియ వేయాలని చూస్తూన్నారా? అనుకుంది.

"నా చావుకి సరిపడా దాచాను బాబూ, నేను దిక్కులేని చావు చావడం లేదు" హఠాత్తుగా గట్టిగా అన్నాడు వెంకన్న తాత అంతే మళ్ళా మాటాడకుండా పడు కున్నాడు

"తాత వెళ్ళిపోయాడు" అంటూ తెరచి వున్న తాత కనురెప్పలని ఎంతో అభిమానంతో సుకుమారంగా మూసి కంబళి పూర్తిగా కప్పేశారు రావు

రావుగారున్నారనో ఏమో, ఎవరూ గట్టిగా ఏడ్వలేదు. రావుగారు తాత మన వడ్ని దగ్గరకి పిలిచారు 'ఒరేయ్, వీరా, యింద, ఈ డబ్బు పుంచు. తాతని ఘనంగా పంపించు. వూళ్ళో మీ వాళ్ళంతా పండుగ చేసుకోండి" అంటూ పాంటు జేబులోంచి డబ్బు తీసి వీరాయ్ చేతిలో పెట్టారు.

'చిత్తం బాబూ,' అంటూ అందు కున్నాడు

'చూడు యిక నువ్వు భూషణం మనుషు

లొ స్తే మాట్లాడకు. మన సెక్రటరీగారిని చూడమను. అన్నీ నేను చూసుకుంటాను. హాయిగా తాత చేసుకుంటున్న పొలం నువ్వు చేసుకో, ఒళ్ళు ఒంచి పనిచెయ్యి. నీ పెళ్ళాన్ని కాల్చుకు తినకు" అంటూ వంగి గుడిసె గుమ్మందాటి బయటికి వచ్చారు. వసంత కూడా వెనకాలే వచ్చింది. ఇవతల అడుగు పెడుతూనే గట్టిగా ఊపిరి పీల్చుకుంది వసంత. నవ్వుతూ ఆమె ముఖంలోకి చూశారు రావుగారు.

"చూడు వీరాయి, అన్నీ ఏర్పాట్లూ కక్కుర్తి పడకుండా చెయ్యి.' అంటూ వీరాయిని హెచ్చరించి రెండడుగులు వేశారు. అప్పటికే అక్కడ వూళ్ళో చాలా మంది బీదా బిక్కీ చేరారు. రావుగారిని చూస్తూనే దండాలు బాబూ, అంటూ పల్కరించారు

'బాబులు ధర్మ ప్రభువులు. వెంకన్న తాతని చూడ్డానికి వచ్చారా' ఓ ముసలాడు పల్కరించాడు

'అవును. మాడండి తాతకి అంత్యక్రియలు ఘనంగా జరిపించండి నే వెళ్ళి వస్తా" నంటూ వసంత కేసి చూశారు వసంత ఆయనతోపాటు అడుగు కల్పింది

కొంచెం దూరం ఇద్దరిలో ఏఒక్కరూ మాట్లాడ లేదు

"మీరు కొంచెం గట్టివారే నన్న మాట." నవ్వుతూ రావుగారే ముందు మాట్లాడం ప్రారంభించారు

"తాత గుడిసెలో అంతసేపు ఉండాలంటే కొంచెం మొండితనం కావాలి" అన్నారు.

"మెచ్చదనం, దయ, మానవత్వం కూడా కావాలి. అవి మీరు తాతకిచ్చారు" అంది వసంత.

"నన్ను మరీ ఆకాశాని కె త్తేమన్నారు." నవ్వేశారు రావుగారు.

"లేదు. లేదు. మీరే నన్ను తీసుకు వెళ్ళి గౌరవం చూపారు నాకో రెండు సంగతులు అర్ధం అయ్యాయి ఈ రోజు. ఆ నిర్భాగ్యుల దైన్యం అర్థం అయింది. మీ లాంటి భూకామందులు యింకా ఎంత మంది వున్నా ఫరవాలేదు" ఆవేశంగా అంది వసంత

నడవడం ఆపి వసంతకేసి తిరిగారు రావుగారు.

"ఉన్నారు కాని కొత్త సంఘం కాని, కొత్త ప్రపంచంగాని హఠాత్తుగా సృష్టించలేరెవరూ నిజంగా నవసృష్టి జరిగేటప్పుడు రక్త పాతం, బాధా తప్పవు " నడవడం ప్రారంభించారు కొంతదూరం వచ్చేసరికి తోట వచ్చింది

"చూడండి మీరిలా ఎడమ పక్కగా వెళ్ళి తిన్నగా నడవండి. మీ రెదురు చూసే లోగా గమ్యం చేరతారు, సరేనా" చిలిపిగా నవ్వుతూ చేయి చాపేరు రావు చాపిన ఆ చేయిని చూస్తూ తన చేయి అందించింది వసంత.



"థాంక్యూ - నాతోకూడావచ్చినందుకు! నాకూగా అర్థం చేసుకునే మనిషి వుండా లనిపించింది. అందుకే మిమ్మల్ని పిలి చాను" అంటూ చటుక్కున వంగి వసంత అరచేతిలో తన పెదవులు ఆన్చి ముద్దు పెట్టుకున్నారు. రావు తక్షణం చేయి వది లేశారు.

వసంత నిలువెల్లా ఒణికింది. ఆ పెద వుల ఒత్తిడి ఆమె చేతిని వణికించింది. ఆ చేష్టతో తనని బానిసగా చేసినట్టు అనిపించింది. ఒక్క మాట మాట్లాడలేక పోయింది. రావుగారు తోటకేసి చెకచెక నడిచారు.

వసంత నిస్సత్తువగా రావుగారు చెప్పి నట్టు ఎడంవైపు తిరిగింది. సూటిగా నడ వటం ప్రారంభించింది.

వాతావరణం ఎంత హాయిగా వుందో వసంత మనస్సు అంతకల్లోలంగా వుంది. నేను వీరి చేతుల్లో చిక్కిన దాన్ని. వెనక్కు వెళ్ళకల్గే శక్తి లేదు అను కుంది. రావుగారు చెప్పినట్టే అనుకోకుండా

యిట్టే వచ్చేసింది యిల్లు. నడక వేగం హెచ్చించి యింట్లోకి వెళ్ళిపోయింది.

తిన్నగా తన గదిలోకి వెళ్ళిపోయింది వసంత. కిటికీలన్నీ తెరచింది. హాయిగా గాలీ వెలుగూ కావాలనిపించింది. ఊపి రాడనంత ఆందోళనగా వుందామె మనసు

స్నానంచేసి హాయిగా మంచంమీద నడుంవాల్చింది ఇంతలో నూకాలు వచ్చింది అమ్మాయిగారూ అంటూ.

"ఏం నూకాలూ, పిల్లలు పడుకు న్నారా!?' మంచంమీదే మోజేతులమీద లేచి అడిగింది

"బాగా ఆడి ఆడి అలసిపోయారేమో నిద్రపోయారమ్మా! మీరొస్తే వడ్డిద్దామని వున్నారు సరస్వతమ్మగారు" ఆవిడ పేరం టేనే దానికి కొంచెం నవ్వొస్తుంది. "నాకు ఆకలిగాలేదు నూకాలూ, నేను పడుకుం టాను." అంది వసంత.

"పోనీ గ్లాసుడు మజ్జిగ తాగి పడు కోండి. తెస్తాను" అంటూ వసంత బదులు కోసం చూడకుండా క్రిందికి పరుగెత్తింది నూకాలు.

నూకాలు తెచ్చియిచ్చిన మజ్జిగ తాగి పడుకుంది వసంత. పడుకుందన్న మాటే గాని నిద్రరాలేదు. తానేదో కొత్త ప్రపం చంలోకి అడుగు పెట్టినట్టు అనుభూతి కలిగింది. ఈ ప్రపంచంలో ఉవ్వెత్తునఎగసివదేమనోభావాలు. ఒకదానొకటి ఢీకొని సమసిపోతున్నాయి. పైకి ప్రశాం తంగావున్నా లోపల ప్రళయం జరుగు తూన్నట్లుంది రావుగారు తన అరచేతిలో ముద్దుపెట్టుకోవడం— తను నరనరాలలో ఒక్కసారి ఉలిక్కిపడడం పదే పదే జ్ఞాపకం రాసాగింది. "నేనిలా భావించడం సిగ్గులేనితనం కదా!" అనుకుంది కాని నా కిలా అనిపించడంలేదే' నాకు చాలా గర్వంగావుందే' ఇదే ప్రేమకాబోలు! ఇదే వాంఛ దీనికి పేరు లేదు ఇంత ఆనందంగా నేనుండేహక్కులేదు నేనిలా ఉత్తేజపడడం తప్పు" అని నచ్చచెప్పు కుంది నాకిలావుంటే రావుగారి కెలా వుందో?నన్నుగురించి ఏమనుకుంటున్నారో 'నేనంటే నిర్లక్ష్యం మటుకు లేదు.' అను కుంది మరుక్షణమే—"ఇదంతా క్షణికో న్మాదం!" అని బలవంతంగా కళ్ళు మూసుకుని నిద్రకొరిగింది

ఉదయం నిద్ర లేచేసరికి బాగా వెలు తురు వచ్చేసింది ఆదరాబాదరాగా తెమిలి పిల్లలకోసం ఎదురుచూసింది. నూకాలు శాంతి నొక్కదాన్నే తీసుకువచ్చింది.

శాంతి నొక్కదాన్ని చూడగానే ఆత్రంగా "సుందరేది" అడిగింది వసంత.

"సుందరమ్మగారికి కొంచెం జ్వరం తగిలినట్లుందమ్మా, పడుకోబెట్టాను. మీరు తరవాత వస్తారన్నారు" అంది నూకాలు.

"శాంతీ నువ్వు కూర్చుని చేతివ్రాత రాస్తూ వుండు సుందరినో క్షణం చూసి



వచ్చేసాను" అని వసంత పిల్లలగది కేసి నడిచింది

దారిలో సుబ్బారావుగారు ఎదురొచ్చారు

"నమస్తే వసంతగారూ!" నవ్వుతూ పల్కరించారు

"సుందరికి జ్వరంగా వుందంటేనూ-చూద్దామని బయలుదేరాను " నసిగింది వసంత.

"నేను మధ్యాహ్నం వూరికెడుతున్నాను. మీ కేమైనా కావాలేమో అడగాలని వస్తున్నాను." అన్నారు సుబ్బారావు

వసంతేం బదులు చెప్పలేదు.

"నిన్న వెంకన్న తాత చచ్చిపోయాట్టగా?" అడిగారు.

"అవును పాపం." ఆమె అన్న తీరులో చాలా అర్థం తోచింది సెక్రటరీగారికి

"రావుగారు " ఏదో చెప్పబోయారు

"చాలా మహనీయుడు తాత రావుగారి చేయి పట్టుకునే హాయిగా నిశ్చింతగా ప్రాణం వదిలేశాడు. ఆ జీవికి అంత సంతృప్తి కల్గించింది రావుగారి రాక"అంది వసంత. ఆమె ముఖంలో తొంగి చూసిన ఆరాధన సుబ్బారావుని చెకితుణ్ని చేసింది.

"అలాగా?" అన్నారు పైకి.

ఆశ్చర్యంగా సుబ్బారావు కేసిచూసింది వసంత.

"అయితే మీరేం గట్టివారండీ, రావు

గారి చాకచక్యానికి మీరూ యిమ్యూన్ కాదన్న మాట" నవ్వాడు.

ఆ నవ్వు చాలా అసహజంగా వెకిలిగా అనిపించింది వసంతకి.

"ఇప్పటి దాకా ఏ ఆడదీ ఆయనపట్ల ఆకర్షింప బడకుండా వుండడం నే నెరగను అయస్కాంతంలా ఆకర్షిస్తారాయన. చాలా పురుషత్వం పుట్టిపడుతూఅందంగా వుంటారు" ఏదో అనేస్తున్నాడు సుబ్బారావు.

"మీరింకో సంగతి మరిచిపోతున్నారు ఆయన నాకు ఉద్యోగం యిచ్చిన యజమాని" అంది వసంత.

ఆ కంఠంలోని తీవ్రతకి తొట్రుపడ్డాడు సుబ్బారావు వసంత ముఖంకేసి తీక్షణంగా చూశారు. ఆ ముఖంలో పైకి కనబడని శక్తి దాగొని వుందనిపించింది

వసంత మాట్లాడకుండా సుందరి గదికేసి నడిచింది.

"టీచర్, నా దగ్గిర కూర్చుంటారా?" అడిగింది సుందరి వసంత లోపలికి అడుగు పెట్టగానే.

మంచం దగ్గిరగా వెళ్ళి "తప్పకుండా కూర్చుంటాను సుందరీ. ఇప్పుడు పడుకో. శాంతికి పాఠాలు ముగించి, వచ్చి నీకు కధ చెప్తా" నంటూ సుందరి నుదుటి మీద చెయ్యివేసింది. బాగా జ్వరంగా వుంది. సుందరి కళ్ళు ఎర్రగావున్నాయి.

"నాకు భయంగావుంది టీచర్, నా దగ్గిర మీరే కూర్చోవాలి. ఆవిడొద్దు".

"నేనే కూర్చుంటానమ్మా. భయమెందుకు?" గోముగా అడిగింది వసంత.

"నాకు జ్వరంవస్తే నానమ్మకి ఏదేదో చెప్తోంది సరస్వతమ్మ. మనం తోటా దొడ్డీ తిరిగాంట గాలి సోకిందో ఏదో అంటోంది."

"అననీ మరేం ఫరవాలేదు. నేచెప్తాగా నానమ్మగారికి. నువ్వు హాయిగా పడుకో వెళ్ళనా?"

తలూపింది సుందరి.

సుబ్బారావు కూడా వసంత వెనకే సుందరి గదిలోకి వచ్చాడు ఆమెతోపాటే మళ్ళా యివతలకి వచ్చాడు

"మీకేం కావాలో చెప్పలేదు" అన్నాడు

"రావుగారుంటారుగా, వారి చేతికి రాసి యిస్తాను" అంది వసంత

సన్నగా నవ్వేడు సుబ్బారావు.

"ఇంకా యిక్కడెందుకుంటారు రావుగారు, తెల్లారుజామునే బయలుదేరి వెళ్ళిపోయారు పట్నం" అన్నాడు నవ్వుతూనే.

"నిజంగానే?" నమ్మలేనట్లుగా అడిగింది వసంత.

"నిజమే. వారినిక్కడ ఎవరూ ఆపలేరు" అన్నాడు సుబ్బారావు చాలా గంభీరంగా,

ఎక్కడలేని నిరుత్సాహం కలిగింది వసంతకి.

"ఈసారి తేవచ్చులెండి. నేను క్లాసు తీసుకోవాలి" అంటూ బదులు కోసం ఎదురు చూడకుండా చరచరా నడచి తన గదిలోకి వెళ్ళిపోయింది వసంత. ఓక్షణం అక్కడే నిలబడి సుబ్బారావు క్రిందికి దారితీశాడు. సుబ్బారావు మనస్సు గాయ పడింది. అతను ఎదురు చూసినది ఒకటి. ఇక్కడ జరుగుతున్నది వేరొకటి అనిపించింది ఓ క్షణం యింకా ఊళ్ళో ఉండ బుద్ధికాలేదు సుబ్బారావుకి.

ఆ తరువాత రెండు మూడు వారాలు ఎలా గడిచాయో ఆ యింట్లో ఎవరికీగుర్తు లేదు సుందరికి సాధారణ జ్వరం కాస్తా సీరియస్ అయి పట్నంనుంచి డాక్టర్ని కూడా పిలవ్వలసి వచ్చింది ఆ రోజు ఏం చేసినా టెంపరేచరు దిగడంలేదు. అప్పటికి నాలుగు గంటలనించీ సుందరి తలమీద ఐస్‌పెట్టి కూర్చుని వుంది వసంత. ఏం చెయ్యాలో తెలియక కాలు కాలిన పిల్లిలా సుందరి గదిచుట్టూ, కింద పూజగదిచుట్టూ తిరుగుతున్నారు శాంతమ్మ గారు. సరస్వతమ్మ నస అసలు పట్టించు కోవడం మానేసింది వసంత. గాలి అనీ, ధూళి అనీ విభూతులూ, తాయెత్తులూ, సాంబ్రాణి పొగలూ ప్రారంభించిందావిడ. ఆ రోజు తిన్నగా శాంతమ్మగారి దగ్గిర కెళ్ళింది వసంత

"ఏమిటండీ ఈ గొడవంతా సుందరి సుఖంగా వుండాలంటే యివన్నీ ఆపమని చెప్పండి అసలే అనారోగ్యంగావుంటే ఈ సొద ఏమిటి?" అని అడిగింది

"నేనెలా చెప్పను వసంతా, సరసవ తమ్మ వినడంలేదు దాన్నింకా రెచ్చ గొడుతున్నాడు దాని కొడుకు చూస్తు న్నావుగా నా పరిస్థితి" అన్నారు దీనంగా.

"అదికాదమ్మా పెద్దడాక్టరు గారు

---

* అ. రా, లింగయ్య: నీకేమి ఆస్తుందని పిల్ల నిస్తామన్నారు ?

రాజబాబు: నాకాస్తి లేకపోతేనేమండి, 9 స్టేట్ల లాటరీ టిక్కెట్లున్నాయిగా !

అ. రా. లింగయ్య: అయితే పెళ్ళెప్పుడు ?

రాజబాబు: "డ్రాలు" అయిపోయిన తర్వాత ముహూర్తం పెడతారట.

చెప్పినట్లు చేస్తున్నప్పుడు అస్తమానూ సుందరిని లేవతీసి కూర్చోపెట్టడం ఈ గోల– నాకేదో భయంగా వుంది. ఈ రాత్రికి టెంపరేచర్ దిగకపోతే ఉదయం పట్నం తీసుకెళ్ళాలని చెప్పారు ”

“సుందికి నయం అవుతుందంటావా వసంతా?” పిరికిగా అడిగారు శాంతమ్మ గారు.

“తప్పకుండా అవుతుంది పిల్లలన్నాక జబ్బులుచేయడం సహజమే. జాగ్రత్తగా మందులూ అవీ యిస్తే తగ్గడమూ సహజమే పసివాళ్ళుగదా, ఎన్నబాధకే తోట కూరి కాడల్లాగా వడిలిపోతారు అంతే మీరు సుందరిని చూసి భయపడకండి” ధైర్యం చెప్పింది వసంత

“ఏమో వసంతా. అబ్బాయి నిన్న రాత్రనగా వచ్చాడు గదిదాటి ఒయటికి కూడా రాలేదు” అన్నారు

“సుంది అలా పడివుందికదా, అందరికీ బెంగగానే వుంటుంది. కాని చేయవలసినవి చెయ్యాలికదా. మీరు ఏమీ అనుకోకపోతే నేనే మీ అబ్బాయిగారికిచెప్తాను సరస్వతమ్మగారితో మాట్లాడమని” అంది వసంత.

“వాడు చాలా కోపిష్టి వసంతా, ఆమెని పొమ్మన్నా పొమ్మంటాడు. జాగ్రత్త” శిమతంశా ఇల్లాలుగారు హెచ్చరికగా.

“అలాగే. మీరు ధైర్యంగ ఉండండి” అంటూ వసంత రావుగారి గదికేసి నడచింది.

వెంకన్నతాత పోయాక రావుగారిని ఏకాంతంగా చూడటం మళ్ళీ యిదే మొదటి సారి వసంతకి


కళ్ళకి చేయి అడ్డపెడేసుకుని ముందు బల్లమీద కాళ్ళు పడేసి కుర్చీలో జేరబడి కూర్చుని వున్నారు రావుగారు

తలుపులు ఓరవాకిలిగా వేసి ఉండడంతో లోపలికి ప్రవేశించింది వసంత.

రావుగార్ని ఆ క్షణంలో చూస్తే జాలి వేసింది. సుందరి ఎంత నిస్సహాయంగ పడుకొనివుందో రావుగారలాగే కన్పించారు వసంత కళ్ళకి. ఓసారి సుందరిని దగ్గరగా తీసుకుని ధైర్యం చెప్పినట్టే ఈయనగారికీ చెప్పకలిగితే– అనిపించింది ఆ భావన కామె చెంపలు ఎర్రబడ్డాయి. సన్నగా తన ఉనికిని తెలుపుతూ గొంతు సవరించుకుంది. ఉలిక్కిపడి బల్లమీద నుంచి కాళ్ళు క్రిందకి దించుతూ “రండి, ఎంతసేపయింది వచ్చి?” అన్నారు. రావుగారి కళ్ళు ఎర్రబడి వున్నాయి ముఖంలో అలసట అలుముకొనివుంది.

చెదిరిన క్రాపు అందంగా నుదుటి మీద పడింది. దాన్నొకచేత్తో సరిచేస్తోంటే చేతికి ఉన్న ఉంగరం మెరిసింది. వసంత కన్నార్పకుండా రావుగారినే చూస్తూంది.

ఆమె తీక్షణతని అపార్థం చేసుకున్నారు రావుగారు. మరుక్షణం కుర్చీ లోంచి హఠాత్తుగా లేచి వసంత భుజాల మీద చేతులువేసి మృదువు కుదుపుతూ



"ఏమైంది? సుందికేమైంది" అన్నారు ఆత్రంగా.

అప్పటికి కాని ఏం జరిగిందీ బోధపడలేదు వసంతకి. రావుగారి ఆరాటానికి నవ్వింది. తన భుజంమీద ఉన్న ఆయన చేతిమీద మృదువుగా తన చేయి వేసి నొక్కుతూ "సుందరి నిద్రపోతోంది ప్పుడే. అందుకే మీతో ఓమాట చెప్పి పోవాలని వచ్చాను" అంది తాపీగా.

తన ఆతృతకు సిగ్గుపడుతూ గభాలున రెండు చేతులూ వసంత భుజాలమీదనుంచి తీసేశారు రావు. "రండి, కూర్చుందాం" అంటూ ఓ చేత్తో వసంతని కూర్చోమన్నట్టు కుర్చీ చూపించారు. తను కూర్చుంటూ.

"సుంధరి గురించి చాలా భయం వేసి అలా బెదరిపోయాను. అయామ్ సారీ!" అన్నారు.

"ఫరవాలేదు. ఎవరేనా అంతేకదా. మీరే యిలావుంటే అమ్మగారెంత ఢీలా పడ్డారో ఆలోచించండి. మీరింకా ఇక్కడ వున్నారు కనుక కొంచెం ధైర్యంగావున్నారామె" అంది సూటిగా రావుగారి ముఖంలోకి చూస్తూ.

"అంతే? డాక్టర్ని పంపించడంతో నా బాధ్యత తీరిపోయిందనుకున్నారా?" పేలవంగా నవ్వాలని ప్రయత్నించారు రావుగారు. ఆయన ముఖం గంభీరంగా తయారైంది.

"లేదు లేదు. అలా ఎందుకనుకుంటాను? సుందికీ, శాంతికీకూడా మీరుంటే పండుగే. మీరు కావాలి వాళ్ళకి. అస్సలు సంగతి మరిచేపోతున్నాను. మీరు సరస్వతమ్మగారితో మాట్లాడాలి" అంది. సరస్వతమ్మ పేరు వినగానే చిరునవ్వు వెలిసింది రావుగారి ముఖంమీద. "ఏం మాట్లాడాలి మీ తరపున కాదుగదా?" *

మూడే నిబంధనలు.

1. పాటలను ప్రత్యేకంగా గమనిస్తూ పై చిత్రాలను చూచి సంగీత సాహిత్య సన్నివేశాల దృష్ట్యా మీకు బాగా నచ్చిన పాటయేదో, ఏమీ నచ్చని పాటయేదో సకారణంగా నిరూపిస్తూ మీ విమర్శ ఇన్‌లాండ్ కవరులో ఒక ప్రక్కనే వ్రాయండి.


2. ఒక కవరులో ఒక సినిమా సంగీతం గురించి మాత్రమే వ్రాయాలి. కవరుపైన సినిమా పేరు, దిగువ విలాసం ఇంగ్లీషులో వ్రాసి గడువులోగా చేరేటట్లు పంపాలి. కవరు వెనుక మీ పూర్తి పేరు విలాసం వ్రాయాలి (మీ పిన్‌కోడ్ నంబరుతోసహా.)

3. ఇన్‌లాండ్ కవరు రెండవ పేజీలో (అంటే కవరు ఒంటి పొరను ఉండగా అడ్రసు వ్రాసే చోటికి యెడమప్రక్క వుండే జాగాలో) మీరు యింతకు ముందు నేను నడిపిన యే యే పోటీలలో గెలు పొందారో ఆ చిత్రాల పేర్లు వ్రాయాలి. ఇలా వ్రాస్తే అందిన బహుమతులే తిరిగి అందకుండా చూచుకో గలను.

పై వాటిలో మీ ఒక్క నిబంధనా అతిక్రమించగూడదు.

ముగింపు తేదీ మే అయిదు, మే 15 వ తేదీకంతా నగదు మని యార్డరు ద్వారా తక్కిన బహుమతులు (48 రూపాయల విలువ చేయు రికార్డులు, పుస్తకాలు) రిజిస్టర్ పోస్టుద్వారా విజేతల కంద గలవు. జూన్ సంచికలో విజేతల జాబితా చూడవచ్చు.

V. A. K. RANGA RAO
2, SIXTH MAIN ROAD,
BHAKTAVATSALUNAGAR
Madra-600020.

ఈనెల  విడుదలలు

ఈ నాటికి మీ ఊళ్ళో డీలరు దగ్గర కొత్త యిపిలు చాలా వచ్చి వుంటాయి. అందులో మంచివి.

EMOEC 6215 లో "జీవితం"లో చక్కని మూడు పాటలు వున్నవి. రచన రెడ్డి. వరసనాయుడు. పాడినది సుశీల, రామకృష్ణ, ఈశ్వరి.

EMOEC 6232 లో "మల్లమ్మ కథ"లో నాలుగు పాటలు. ఇందులో శీల సాల యుగళం 'ఎంతటి రసికుడవో' యెంతటి చక్కనిదో వింటేనే తెలియగలదు. బాల పాడిన 'తొలివాన కురిసింది' ఒక పాత డ్రామాపాట గుర్తుకు తెస్తున్నా, జానపద ఫోణి సంగీతంలోనూ యువ్వనోత్సాహం పాడటంలోను కనీ – వినిపిస్తున్నందు వలన, బాగుంది. సంగీతం కోదండపాణి.

EMOEC 6219 లో 'జీవన తరంగాలు' పాటలు నాలుగు. రాఘవులు సంగీతం గురువైన ఘంటసాల ధోరణిలో అంటే గడబిడలు లేకుండా సాఫీగా సాగింది. పాటలుగా ఆకర్షించేవి 'పుట్టిన రోజు"(సుశీల) "నందామయా" (ఈశ్వరి బృందం). ఘంటసాల పాడిన "ఉడతా ఉడతా హూత్' తమాషా పాట.

EMOEC 6212 లో "తాతా మనవడు" చిత్రంలో పాటలున్నవి. ఇవన్నీ రాణింపుకు వచ్చేవి సినిమా చూచిన తరువాతనే. అంటే వింటానికి బాగాలేవని కాదు. చిత్రంలో వాటికి (ఈనాడే బాబు, అనుబంధం ఆత్మీయత) యేర్పరచబడిన అస్థానం అంత పటిష్టమైనదని భావం.

EMOE 9048 "చెంబరత్తి" అనే మళయాళ చిత్రంలో నాలుగు పాటలు. ఈ రికార్డు ఆంధ్రదేశంలో అంత సులభంగా దొరకకపోవచ్చు. ఆర్డరిచ్చి తెప్పించుకొనవలసినంతటి అతిమధురాలు యీ నాలుగింటిలో మూడు పాటలు. 'శరణం అయ్యప్ప' 'చక్రవర్తిని' యేసుదాసు పాడినవి. 'అంబాడితణ్ణిలో దణ్ణి' 'కునికిట్టకోళి' మాధురి పాడినవి. మళయాళ సంగీత కారులు చక్కని కర్ణాటకమైన వరుసలను ప్రజాభిమానం వెంటనే పొందేలాగున యేలాగు మలుస్తున్నారో

తెలుసుకోవాలంటే యీ రికార్డు సులభమైన మార్గం. సంగీతం దేవరాజన్. సాహిత్యం వయలార్ రామవర్మ.

"ఆజన్మ బ్రహ్మచారి"లో కోదండపాణి వరుసలు ముత్యాలహారాలు. "వినుమా వేదాంతసారం" మధ్యమావతిలో హాస్యరసాన్ని నిరుపమానంగా పోషించిన గీతం (BOEC 7346). వెనుక ఈశ్వరి పాడినది పాట 'పోలీ వెంకటసామే' అయినా ఆ పల్లెపాట ఊపు నిత్యనూతనమే. కీరవాణిని అరబ్బువాణిగా తీర్చి నాగభూషణం విరహగీతంగా మార్చిన 'చెలియా చెలియా'లో (BOEC 7357) అతి అందమైన సాకీ లేకపోవటం ఒక కొరతే అయినా రెండవ ప్రక్కనున్న పద్యాలు, పద్మనాభం హాస్య సన్నివేశం ఆ కొరతను కొంత తగ్గించగలవు.

ఇప్పుడే అందిన తాజా వార్త. "దేశోద్ధారకులు" ఎల్. పి. మార్కెట్టులో సిద్ధంగా వుందట. సినిమా ఆడేసిన సంవత్సరానికి ఎల్. పిలు వస్తుండగా యిది ముందే రావడం హాశ్చర్యం! వంగల పట్టాభి భాగవతర్ పాడిన శ్రీ కన్యకాపరమేశ్వరి హరికథ కూడా విడుదలైనదట. ఈ రెండిటి పరిచయం వచ్చేనెల. —రికార్డు బంధు.

జ్యోతి సరాగమాల పోటీ (6)

విజేతల జాబితా

"బాలభారతం" నగదు రూ 100-00 బి. సతీష్‌కుమార్, విజయనగరం నగదు రూ 50-00 ఎం. జి. కుమార్, తిరుపతి. 1. ఎస్. నరసింగరావు, సికిందరాబాదు 2. కె. సోమసుందర్, ఒంగోలు 3. సి. ఎల్. నారాయణ, కావలి 4. కె. ప్రహ్లాదరావు, అనంతపురం 5. లక్ష్మి, పిఠాపురం 6. కె. ఎన్. వెంకటరత్నం, గుంటూరు 7. వి. బలరాం, కాకినాడ 8. జి. బలరామకృష్ణ, మచిలీపట్నం 9. ఎం. నాగమణి, తిరుపతి 10. ఎన్. హరినారాయణ, మచిలీపట్నం.

"ఊరికి ఉపకారి" నగదు రూ 100-00 ఐ. రవిమోహన్, కాకినాడ నగదు రూ 50-00 వి. వి. ఎస్. మూర్తి, చోడిమెళ్ళ 1. పి. ఎస్. ప్రసాద్, కాకినాడ 2. కె. చంద్రశేఖరరావు, వల్లూరుపాళెం 3. జి. అచ్యుతానందమూర్తి, అమలాపురం 4. కె. శివరామకృష్ణ, తరకటూరు 5. ఎన్. రమేష్‌బాబు, మద్రాసు 6. జి. తులసీప్రసాద్, కర్నూలు 7. ఎస్. వి. రామన్, విజయవాడ 8. సి. రామకృష్ణ. మేదక్ 9. టి. భారతి, హైదరాబాదు 10. డి. ఎస్. శంకర్, వక్కలంక.

ఎన్నో కారణాలచేత యీ మారు బహుమతులు పంపడం చాలా ఆలస్యమైనది. విజేతలకు క్షమాపణ చెప్పుకొంటున్నాను. పై వారిలో కొందరికి ఏప్రిల్ చెలాఖరులోగా అందగలవు. పోటీ నిబంధనలు తూచా తప్పకుండా మంచి ఉగాది బహుమతులు గెల్చుకొనండి.

నా గొడవ

—రచన: శివల జగన్నాధరావు

"ఎవరు?....ఎవరది? పాల వాడా? రా బాబూ. రా! తెల్లారిందంటావా?....అల్లా చూస్తావేం, గుడ్లు వెళ్ళబెట్టి? అవునూ....ఏడు గంటలకా, పాలు తేవటం? నీళ్ళు కలిపి పొయ్యొద్దంవే చాల్బాలు....ఆ నీళ్ళు కూడా బాగా పొద్దెక్కి పోతే గాని గొంతులో పడవు! దబ్బుల్లో మేం ఏం కలుపుతున్నాంవోయ్?....ఆ యి నా నాలాంటి పెద్దదాన్ని బాధ పెట్టడం నీకు మంచిది కాదు సుమా! వెళ్ళు! వెళ్ళు! నేనింకా అంట్లు తోంవుకోవాలి....వెధవ కల్తీ! పాలల్లో కల్తీ! మందుల్లో కల్తీ! బియ్యంలో కల్తీ. నెయ్యి, నూనెల్లో కల్తీ. మనుషుల్లో కల్తీ! కల్తీ వెధవ ప్రపంచం అయిపోయింది. రామ రామ!! ఇదిగో! అబ్బీ! చూడు! ఆ రిక్షా ఏదో మనింటి దగ్గరే ఆగినట్టుంది. అవునా?... సరి! ప్రొద్దున్నే ఎవరో దయచేసే రన్న మాట! ఈ జంక్షన్‌లో శ్రీ మహాను భావుడు కొంప కట్టడం కాదుగాని....వూళ్ళోకి వొచ్చిన చుట్టాలంతా తిన్నగా ఇక్కడికే తయారు! ఇది సత్రవనో. హోటలనో. లాడ్జింగనో వాళ్ళ వుద్దేశం! మునుపటి రోజులా...మందలికి మందలుగ మేవడానికి? అర్ధణాకి వీశ కూర – పావలా పరక్కి శేరు బియ్యం వొచ్చిన టయిం అది! ఆ దశలో—తిరణాళ్ళలో జనంలా—ఎంత మంది చేరినా పెట్టడానికి దమ్ము వుండేది. ఇప్పుడలా పెడితే చిప్ప పట్టుకు కూచోవాలి! అయినా వాళ్ళకి బుద్ధీ. సిగ్గూ వుండాలిగాని ఎలా చెబుతాం రావొద్దని? అదిగో! రిక్షా దిగి. సూట్‌కేసు పట్టుకుని తిన్నగా వచ్చేస్తున్నాడెవరు చెప్మా?.... రావుళ్ళా లేడూ? ఏంవిటో! ఈ వెధవ కళ్ళు మునుపట్లా సరిగ్గా కనిపించి చావకండా వున్నాయి....దగ్గరగా వొస్తే.... అవును! రాంవుడే! వీడా! పాపం . చాన్నాళ్ళకి కనిపించేడు కుర్ర గాడిద!

"అక్కయ్యా... బావున్నావా?"


"మనిషిని చూస్తూ అట్లా అడగడం బావోలేదురా, అబ్బీ, చూస్తున్నావు గదూ, ఈ అవతారాన్ని."

"అపునిదేంవిటిలా అయిపోయేవక్కయ్యా?"

"అయిపోతానా. నీలాగే(విటి? ఇంకెలాగయినా అయిపోతాను. నువ్వు మళ్ళా వొస్తే నన్ను చూస్తావో! చూడవో!"

"అదేమ్మాటక్కయ్యా. తప్పకుండా చూస్తాను. నీకేమిటి? మహారాణివి. హాయిగా లంకంత ఇల్లు. బోలెడాస్థి, నలుగురు కొడుకులు. అంతా అంది వచ్చేశారా.. బావ లేడన్న చింతొక్కటి తప్ప నీకేం కష్టం వుందే?"

"అ(నా ...అలాగే అను. నువ్వేమిటిలే అంతా అదే మాట. ఈ కొంపొకటి కనిపిస్తోంది—గుడ్డి కన్నుని అద్దాలు దాచినట్టు—నా (ప్రారబ్ధాన్ని దాస్తూను. ఈ లంకని కావలా కాస్తూ లంఖిణీలా నేను ఒక్కత్తినీ వున్నాను. ఆ బల్ల వంట గది దగ్గర ఇలా వేసుక్కూచో! కుంపటి ముట్టిస్తాను. ఆ గిన్నె లెలా పడున్నాయో చూసేవా? అంట్లు కూడా నేనే తోవ(వుకు చావాలి! ఎవత్తిని పెట్టుకున్నా పదిరోజులు నిండా చెయ్యదు. ఏ(విటో! రాక. రాకయింటి కొస్తే ఈ పురాణం అంతా ఏ(విటనుకుంటావేమో! ఏం చెయ్యను? మనసులో బాధ కనిపించిన వాళ్ళతో చెప్పకుంటే నా క్కొంచెం వుపశమనంగా వుంటుంది. నీకు తెలీదారేయ్! ఈ వూరి పనిమనుషుల సంగతి. వాళ్ళడిగినంత డబ్బూ ఇచ్చెయ్యాలి. మనకి చేసే పనిని



మాత్రం కొలుస్తారు. అయిదు రూపా యలూ ఖరాఖండీగా అక్కడ పెట్టమంటే అలాగే ఒప్పుకున్నా నా.. గిన్నెలు ఒక్కటి తోమి వెళ్ళిపోయేది. ఇల్లూ వాకిలీ అన్నాక శుభ్రంగా వుండాల్నా? వూడ్చి పెట్టవే అంటే అందుకు వేరే డబ్బివ్వాలట! మొన్నటికి మొన్న—రెండు చీరెలు పుతికి పెట్టవే' అన్నాను. ఆ యింతా నా చెవులు పడేట్టు గయ్యి మంది. వీళ్ళతో వేగడానికి బలం, ఆయుర్దాయం రెండూ మనం పెంచుకోవాలనుకో! దాంతో నేను ఘర్షణ పడుతుంటె. పక్కింటి గుంట—కరివే పాకు కొచ్చిందిలే . అదంటుందీ! నే నటా. అయిదు రూపాయిలిచ్చి అరవయి రూపాయల చాకిరీ చేయించుకుంటానుట! నాకీ వయసులో కాపీనం మరీ హెచ్చి పోతోందిట! దాన్నోరు నొక్కకు పోను! ఆ పేలుడు చూడు! కలికాలం గుంట్లు. బొత్తిగా పెద్దంతరం చిన్నంతరం లేదు.

మేం మా కాలంలో ఇలాగే రిపరిప లాడి పొయ్యే వాళ్ళంవా?

"కరివేపాకూ లేదు. గాడిద గుడ్డూ లేదు. దొప్పి" మన్నాను. కిచకిచ నవ్వుతూ "కోడళ్ళని తెచ్చేసుకోండి మామ్మగారూ! అన్ని పన్లూ చేసిపెడతారు. ఎందుకష్టపడ తారంటూ" వెళ్ళిపోయింది. ప్రతీ వెధవా యిలకీ చులకనయి పోయేననుకో! . . ఏంవిటే? నువ్వూ అలాగే సలహా ఇస్తు న్నావా! అడ్డమైన ఆడదీ నా కోడలయి పోతుంచిట్రా. అప్పాచ్? వాళ్ళెవరో తలకి మాసిన వాళ్ళని కట్టుకుంటె వాళ్ళు నా కోడళ్ళయి పోతారట్రా? నన్నడిగేరా? ఇంత ఇల్లుంది. వాకిలుంది. వాకిటినిండా పందిరేసి పెళ్ళి చెయ్యనూ? నా పునికే మర్చిపోయి—తాళి కట్టేశాక—తందనా లన్నీ అయ్యాక వో పుత్తరమ్ముక్కట! ఇంటికొచ్చిన చుట్టం ముందరే భోజనం కానిచ్చి. చివర 'భోంచేసేవా?' అనడిగి - 'తింటానంటే వొండుతా వందొట ఓ ఇల్లాలు! నేన్రమ్మంటే వస్తార్ట, నా అను మతి కోసం ఎదురు చూస్తున్నట్టు నా మాటకి విలువ ఇచ్చేడ్సినట్టు. అంతా వేషాలు! నటన! నేను వాళ్ళ దృష్టిలో గుడ్డి గవ్వ అయినప్పుడు ...ఒ రే య్! రాంవుడూ, నువ్వు చెప్పు... వాళ్ళన్నేనెం దుకు పిలిచి మంగళారతి పట్టాల్రా?

నువ్వు ఏం అనొరేయ్! వాళ్ళు బ్రహ్మ కడుపున పుట్టనీ! నా ఆత్మ వొప్పని పని ఏదీ నేన్చెయ్యనంతే! ఏంవిటోః నా కెవ రెవరు చెప్పారీ సంగతి?.....చెప్పా చెయ్య కండా వాళ్ళే వచ్చేరులే. గోవిందుడూ, ఆ నెరజాణా టింగు టింగుమంటూ ఇద్దరు బొమ్మల్ని పట్టుకుని దిగారులే హు! వాటేలుకి వాస్తే ఏం జేస్తారు? ఓ గది అడిగి తీసుకుని వుంటారు. వున్నారు. కేరేజీ తెచ్చుకు తిన్నారు. వూరంతా షికార్లు కొట్టేరు. ఈ లోపల అది కొంత గొడవ చేసిందనుకో! ఏం లేదు.. ఆవిడ గారిని చుట్టుప్రక్కలంతా "ఫలానా ఆవిడ కోడలు పిల్లవేనా?" అని అడిగేరట. మీ

పెళ్ళి ఎక్కడ జరిగిందని, పెళ్ళికి మీ అత్తగారెందుకు వెళ్ళలేదని. ఆవిడికి మీ పెళ్ళి ఇష్టం లేదా?—అని అడిగేరట. ఈ అపరంజికి పాపం సిగ్గుతో వొళ్ళు చచ్చిపోయిందిట. 'నన్నంతా ఇలా అంటున్నా' రంటూ రాగాలు పెట్టింది.

"ఈ నాటకాలాడే మా వాణ్ణి వల్లో వేసుకున్నావు! నన్ను మాత్రం బురిడీలు కొట్టించలేవు స్మీ!

నీ లాంటి నెరజాణల్ని ఈ బుర్ర మీద వెంట్రుకలంత మందిని చూసేను—అన్చెప్పేను.

ఇదిగోరా, తమ్ముడూ నీకుస్నానం, పానం ఏదీ చూడకండానే కబుర్లతోకడుపు నింపేస్తున్నానని అనుకుంటావేమో! ఆ బట్టలు విడిచీ ..ఇల్లారా! ఈ నూతి నీళ్ళే మేం వాడతాం. స్నానానికీ, త్రాగడానికీను ఓ పిసరు వుప్పగా వుంటాయనుకో. కొళాయి వీధిలో వున్నాది గాని—పెద్ద ముండని . .ఎలా వెళ్ళితేను? నీళ్ళు మనుషుల్ని పెట్టి పోయించుకోవడం నాకు కిట్టదబ్బాయి! మనం వాడుకునేవి అడ్డమయిన వాళ్ళూ ముట్టుకోవడం నా కిష్టం వుండదు. ఏఁవిటంటావ్? ఇంత నీరసంగా వున్నప్పుడు హాస్పిటలుకి వెళ్ళకూడదా అంటావా?

ఆ వూసు మాత్రం నా దగ్గర ఎత్తకబ్బాయీ అక్కడేం దొరుకుతుందిరా? ప్రతీవాళ్ళూ మూడు ముస్తాబులయి, రిక్షాలు కట్టించుకుని. ఆసుపత్రాసుపత్రంటూ పరిగెడతారు ...ఆయింతా వాళ్ళు పోసేవి రంగు నీళ్ళే కదూ? ఇండీసన్లో మందే పోసి పొడుస్తున్నాడో, నీళ్ళేపోసి పొడుస్తున్నాడో నువ్వు చూసేవా? నేను చూసేనా? అసలీ మధ్యన కొయితమ్మొక్కలే రాసిచ్చి పొమ్మంటున్నార్లే!. ..ఎందుకురా అంత నవ్వూ? నా కబుర్లు వెర్రిగా వున్నాయా? నాకేం వెర్రి లేదొరేయ్!నేనో మాట అన్నానంటే ఎంతో జ్ఞానంతో, అను

జ్యోతి నిలిచిపోయిందని కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నట్లుగా మాకు వార్తలందాయి. ఇవి పుట్టి పుకార్లు. ఇన్నేళ్ళుగా వస్తున్న 'జ్యోతి' ఆగిపోవటం ఉండదు.

కొంతమంది 'జ్యోతి' ప్రతినిధుల మని చెప్పుకుంటూ ఏజెంట్ల దగ్గర సొమ్ము వసూలు చేస్తున్నట్లుగాకూడా మాకు ఫిర్యాదులు వచ్చాయి. మాకు ప్రతినిధులెవరూ లేరు. ఏజెంట్లు నేరుగా "జ్యోతి, మద్రాసు-17 కే డబ్బు మనియార్డరు ద్వారా గాని, డ్రాఫ్టు ద్వారా గాని పంపవలసిందిగా కోరుచున్నాం.

—జనరల్ మేనేజర్,

జ్యోతి, మద్రాసు-17

శివంతో అన్నాననుకో! దీనికి సుప్రీమ్ కోర్టులో కూడా అప్పీల్లేదు

ఈ మాటే నా పెద్ద కొడుకు పెళ్ళాంతో ముప్ఫయిమార్లు చెప్పాను దాన్నటాఅంతా 'కారేజీ తెచ్చుకుంటున్నారేమని అడిగేరట 'మా అత్తగారే మ్మమల్ని ఎడబెట్టిందని' ఈ జాణ చెప్పుకొచ్చిందిట! తాము చేసిన తప్పిదం కాక-నా పైనే నిభం పెట్టే రొరేయ్! నేను పిల్లలికి ఎన్నేళ్ళు వొచ్చినా పెళ్ళిళ్ళు చెయ్యకపోతే వాళ్ళు చేసుకోకేం జేస్తారని అడిగేరు మొగుడూ పెళ్ళాం కల్సి! ఎంత మాటన్నారో విన్నావా! పైగా వూరంతా అనుకుంటున్నారట ఆ మాటే' బావుందా? నేను ప్రతీ విషయంలోనూనూ ఖరాఖండీగా వుంటానని వెధవాయి లంద రికీ దొబ్బు తెగులు! అంతకంటె మరేం లేదు నా హోదా నేను నిలుపుకోవద్దూ! పదివేలకి ఒక్క పైసా తక్కువ కట్నం అయితే కుదరదన్నాను, సంబంధాలొస్తే' ఎంతేసి డబ్బుపోసి చదువులు చెప్పించేను ఒక్కొరికీ' ఇంతకూ ఈ డబ్బంతా నేనేం కట్టుకుపోతానా' హోదా, ప్రతిష్టా నిలుపు కుందికె కదా ఈ తాపత్రయం, అంతాను' ఒ దెవ యా బోధపరుచుకోరేం' అదే నావిచారం, రా, రాఁవుడూ'

ఏఁవిరా, వెళ్ళిపోతా నంటున్నావు?ఆక లేస్తోందేమిటి' పైమెంతయింది, చూడు! ఒంటిగంటే కదట్రా నాకు ఈ టయింకీ తినడం అలవాటు ఇవాళ కొంచెం ఆలీసెం అయింది ఇదిగో అన్నం అయిపో వచ్చింది కరివేపాకు పచ్చడిచేసి, చారు పెడతాను ఏవిటో! వెధవ కూరలు-చుక్క ల్నంటుతున్నాయనుకో, వాటి ధరలు!! అయినా డబ్బిచ్చి ప్రతీదీ ఎంతగని కొన గలం? తోట కూర కోశాను అదేం? వెళ్ళిపోతున్నావా? ఏఁవిటో! వుండ మంటే వుండనంటున్నావు' వూళ్ళో పనుందా? అట్నుంచి రైలెక్కేస్తావా' పోన్లే! అమ్మని అందర్నీ అడిగేనన్చెప్పు! నేనిలా వున్నా నని చెప్పు' ఏఁవిటో' ఇంత మజ్జిగన్నం అయినా తినకండా పోతున్నావు! ఎవరింటికి వొచ్చినా నా గొడవతోనే సరి' నిన్న సాయంత్రం జగన్నాధం వొచ్చి-అందికే గాబోలంటున్నాడు—"దొడ్డమ్మా! కథకి మేటరెక్కడా దొరక్క ఛస్తున్నాను. చెబుదూ? నీ దగ్గర బోల్డు కథలుంటాయీ అని' భడవకి నా గొడవ రాయాలని వుద్దేశం కాబోలు' నేను కనిపెట్టలేనా' రాసుకోరా, అబ్బాయ్' నా గొడవేరాసుకో" అంటె అంత మొహం చేసుకు వెళ్ళాడు ఆనందంగా అదిగో' వెధవ కాకివొచ్చి మూతలు లాగిస్తున్నట్టుంది పచ్చడికి పోపు వెయ్యాలి, ఇంట్లోకెళ్ళి తలు పేసు కోకపోతే ఎవడేనా దూరతాడు ఆ యింతా

సినిమా

శోభన్‌బాబు ద్విపాత్రాభినయంలో మరో చక్కని చిత్రం "శారద"

అన్నపూర్ణా సినీ ఎంటర్ ప్రైజెస్ వారు నిర్మించిన 'శారద' చిత్రంలో శోభన్‌బాబు పాత్ర చాలా విశిష్ట, వినూత్న పోకడలో వుందనీ "తాసిల్దార్‌గారి అమ్మాయి" చిత్రం తర్వాత కధాబలం సన్నివేశబలం అన్ని హంగులూ వున్నాయనీ చిత్రం రషెస్ చూసినవారు అంటున్నారు

చక్కటి పల్లెటూరి వాతావరణం గ్రామీణ జీవిత మమతానురాగాలు, ప్రేమాభి మానాలు, కక్షలూ కార్పణ్యాలు, చక్కని సెంటిమెంటూ పుష్కలంగా వున్న ఈ చిత్రం త్వరలో జ్యోతీ పిక్చర్స్‌వారిద్వారా ఆంధ్రదేశంలో విడుదల కాబోతున్నది కధలో సెంటిమెంటు, కాంప్లికేషన్స్, అభ్యుదయం—వున్న చిత్రాల్ని తీయటంలో నేర్పరి అయిన శ్రీ కె. విశ్వనాథ్ దర్శకత్వంతో ఈ చిత్రం చక్కగా రూపొందించబడుతుందనుటలో సందేహం వుండదు

సినారే వ్రాసిన "శారద నను జేరగా ఏమిటమ్మా సిగ్గు-ఎరుపెక్కె లేతబుగ్గా ఓ శ్రావణ నీరద—శారద—అన్న పాట చాలా బాగుందని కూడా వింటున్నాం చక్రవర్తి సంగీత సారధ్యంలో పాటలన్నీ చక్కగా అమరి విన సొంపుగా వున్నాయట

శోభన్‌బాబు, శారద, శోభన్‌బాబు, జయంతి, సత్యనారాయణ, రాజబాబు, అల్లు రామలింగయ్య మొదలగువారు నటించిన ఈ చిత్రానికి జి కె రాము ఛాయాగ్రహణం చక్రవర్తి సంగీతం మాటలు బొల్లిముంత శివరామకృష్ణ పాటలు సి నా రె దాశరధి, వీటూరి, ఆరుద్ర సహాయ దర్శ కులు ప్రేమ్‌కుమార్, సహకార దర్శకుడు యం అప్పారావు దర్శకుడు కె విశ్వ నాథ్, నిర్మాత పి రాఘవరావు విడుదల ఆంధ్ర జ్యోతి

శ్రీ కాశేశ్వరి ఎంటర్ ప్రైజెస్ న్యూవేవ్ సోషల్

నూడిటీ (దిగంబరత్వం)ని న్యూవేవ్ అనడం కాకుంటే ఎన్ని రేప్ సీన్సుంటే అంత నావల్టీ చిత్రమనడం వింటున్నాం మనం యీ మధ్య! కాని నిజానికి న్యూవేవ్



నవోదయ ఆర్ట్ పిక్చర్స్
"జగమేమాయ"లో
నూతననటుడు మురళీమోహన్,
సునందిని

అనేది 'బ్రైన్‌వేవ్'కు సంబంధించిన విషయం. మెదడుకు మేతపెట్టే మానసిక తత్వం మీద ఆధారపడిన కొత్తరకం కథ, కథనం గలది. మనకు ప్రతిబింబాలు వంటి పాత్రలు, మనకు సన్నిహితమైన సన్నివేశాలలో, మన మనస్సుకు తట్టని మరో విధంగా రియాక్ట్ అయి, రియలిజమ్‌లో మరో అంతస్థు ముందుకు పోతే ఏమవుతుంది? అదే న్యూవేవ్! అదే శ్రీ కాళేశ్వరి ఎంటర్ ప్రైజెస్‌వారి తొలికానుక!

హీరో కృష్ణ యిప్పుడీ న్యూవేవ్ చిత్రంలో ఒక అసామాన్యమైన పాత్రకు ప్రాణం పోస్తున్నాడు. వాణిశ్రీ అతని జంటగా నటిస్తుంది. అల్లు రామలింగయ్య, గుమ్మడి మరో వెరైటీ చూపిస్తున్నారు.

ముళ్ళపూడి రచన, పుహళేంది సంగీతం, కె. యస్. ప్రసాద్ ఛాయ, కళాధర్ కళ, కె. గోపాలరావు కూర్పు, వహిస్తున్న యీ చిత్రానికి దర్శకుడు ఎ. యస్. బోస్.

నిర్మాత వి. చక్రధరరావు, రాజశ్రీ రిలీజ్.

"పసివాని పగ" పూర్తి కావచ్చింది

నిర్మాత చిట్టిబాబు, నిర్వహణ సారథి, కె. యమ్. నాయుడు ఏప్రిల్ నెలలో పూర్తిగా షూటింగ్ జరిపే ఏర్పాట్లు చేశారు. ఈ నెలాఖరుకు చిత్రం పూర్తవుతుంది.

రీ రికార్డింగ్ వగైరా తుది మెరుగులతో మే నెలాఖరుకు చిత్రం రిలీజ్‌కు ముస్తాబై వుంటుంది. "పసివాని పగ" విద్యార్థిలోకానికి ఒక వెలుగు; ప్రతి కుటుంబానికి ఒక ప్రత్యేకాకర్షణ కాగలుగుతుంది.

మాస్టర్ ప్రభాకర్, విజయచంద్ర, విజయలలిత, జ్యోతిలక్ష్మి, ప్రభాకరరెడ్డి

త్యాగరాజు, రామదాసు మొదలగు వారు నటించారు

పుహళేంది సంగీతం, కె వి. యస్. కుటుంబరావు దర్శకత్వం.

ఫల్గుణా కంబైన్స్ "రాముడే దేముడు"

మంచి మనిషి గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు " 'అబ్బో, ఆతనెక్కడ ' దేముడితో సమాన" మంటారు

మంచిని కాపాడటంకోసం ఆ అవతా పురుషుడైన రాముడు ఎంత కష్టపడ్డాడో కలియుగంలో నవసమాజంలో అష్టకష్టాలు పడ్డ-మంచినే నమ్మి, మంచికోసమే త్యాగం చేసిన ఫల్గుణా వారి రాముని ఉదాత్తమైన గాధే "రాముడే దేవుడు"—

హృద్యమైన కథా సంవిధానంతో, ఉదాత్తమైన పాత్రపోషణతో యువదర్శకులు శ్రీ బి. వి. ప్రసాద్ దర్శకత్వంలో ఫల్గుణా కంబైన్స తరపున శ్రీ పి. ఏకామ్రేశ్వరరావు నిర్మిస్తున్న "రాముడే దేవుడు" సాంఘిక చిత్రం వీనులవిందు కూర్చే మధురమైన పాటలతో యిప్పటికి తొమ్మిది రీళ్ళు తయారైంది. పాటలన్నీ చాలా బాగున్నాయి.

చలం, ఎస్. వి. రంగారావు, జగ్గయ్య, నాగేష్, కె. వి. చలం. సాక్షి రంగారావు, రామదాసు, వాణిశ్రీ-విజయలలిత, జ్యోతి



"దేవుడమ్మ"లో లక్ష్మి

లక్ష్మి, మాలతి ముఖ్య పాత్రలను ధరిస్తున్నారు.

ప్రముఖ రచయిత శ్రీ జి. వి. జి. సమకూర్చిన కథకి ప్రఖ్యాత రచయిత రాజశ్రీ సంభాషణలు సమకూర్చిన యీ చిత్రానికి సంగీతం. సత్యం, దర్శకత్వం: బి. వి. ప్రసాద్ నిర్మాత· పి. ఏకామ్రేశ్వరరావు విడుదల లక్ష్మి ఫిలింస్.

ఉదయభాను 'నిజరూపాలు'

కె. వి. నందనరావు సమర్పించు ఉదయభాను ప్రొడక్షన్స్ వారి 'నిజరూపాలు' పూర్తి కావచ్చింది. 'ఆడది, ఆస్తి' యీ రెండే అన్ని అనర్థాలకు మూలం! వీటికోసమే దొంగతనాలు, దోపి



"శారద"లో సారధి, అల్లు రామలింగయ్య, రాజబాబు, శాంత

డీలు, దొమ్మీలు, యుద్ధాలు, రకరకాల ప్రళయాలు ముంచెత్తేస్తూంటాయి. యీ ప్రపంచాన్ని. కేశవవర్మగారి బ్రతుకుకూడా అల్లాగే అన్యాయమైపోయింది. ఆయన ఎంత ఉదారుడో, ఎంత కళాప్రియుడో, ఎంత సరళుడో—అయితే మాత్రం ఏం ప్రయోజనం? రెండో పెళ్ళి చేసుకున్నాడు. మొదటి భార్య కొడుకు సామాన్యురాలిని వివాహ మాడుతానన్నాడని కోపం చెందాడు. అతడిల్లువదలి వెళ్ళిపోయాడు. ఇంక యింట్లో వున్న జనం అందరికీ జమీందారుగారి మీద ప్రేమ పొంగడం మొదలు పెట్టింది. ఆయనమీదనడంకంటె ఆయన ఆస్తిపాస్తులమీద-అంతకుమించి ఆ రత్నకిరీటంలోని విలువైన, ఆ వజ్రాల మీద అనడం సబబు; శత్రువులుగా వారిని సాధించలేరని; అనుకూల శత్రువులుగా అందరూ ఆయన ఆశ్రయంలోకి వచ్చి చేరారు ఎవరు మిత్రుడో, ఎవరు శత్రువో తెలుసుకోలేని ఆ సంక్లిష్ట సమయంలోనే ఆ జమీందారు కేశవవర్మ ఓ రోజున కుర్చీలో కూర్చున్నవాడు కూర్చున్నట్లే ఖూనీ చేయబడి వున్నాడు. ఎవరా హంత కులు? ఇంట్లోంచి గెంటబడిన తొలిభార్య కొడుకా? ఆస్తికోసం చుట్టూచేరిన ఆ ప్రబుద్ధులా? ఎల్లా తెలుస్తుంది?

యస్. వి. రంగారావు, రామకృష్ణ, నాగభూషణం, ప్రభాకరరెడ్డి, రాజబాబు, విజయనిర్మల, జయకుమారి, సూర్యకాంతం, నిర్మల మొదలగువారు నటించారు.

ఆనందమోహన్ నిర్వహణలో తయారవుతూన్న యీ చిత్రానికి మాటలు ఆదివిష్ణు, సంగీతం యస్ హనుమంతరావు, నిర్మాతలు శ్రీమతి సరోజినీ సీతారామ్, కేశవరాయుడు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం కె వి నందనరావు

జగమే మాయ

నాగరికత పేరుతో అనాగరికతలోకి జారుతోంది క్రమంగా సమాజం. విజ్ఞానం పేరుతో అజ్ఞానం, స్వార్థం మానవుల్లో పూడలు దిగిన మర్రిచెట్టులా రోజురోజుకి పెరిగిపోతున్నాయి.

ఆశ దురాశగా దురాశ పేరాశగా మారి మానవులు ధనదాహంతో పిశాచంలా ప్రవర్తిస్తున్నారు. కాంతా కనకాలకోసం ఎటువంటి దురాగతానికైనా వెనుకాడటం లేదు.

డబ్బుకోసం మనిషి దారుణాలు చేస్తున్నాడు! డబ్బుకోసం మనిషి – మనిషిని నిలువునా దోస్తున్నాడు!! డబ్బుకోసం మనిషి–సాటిమనిషి ప్రాణాలు తీస్తు



రవిచిత్ర ఫిలిమ్స్ వారి
"ఒకనారి- వంద తుపాకులు"లో
రాజ్ బాబు

న్నాడు!!! డబ్బే అన్ని అనర్థాలకూ మూల కారణం అవుతోంది....మానవుల్లో రోజు రోజుకీ వెర్రితలలు వేస్తున్న స్వార్థానికి ప్రతీరూపమే నవోదయ ఆర్ట్ పిక్చర్స్ తర పున శ్రీ పి. వి. సుబ్బారావు సమర్పిస్తున్న చక్కని చిత్రం "జగమే మాయ".

ఒకే ఒక నెలలో పూర్తిగా అవుట్ డోర్లో నిర్మించబడుతున్న ఈ చిత్రంలో వున్న ముచ్చటైన మూడు పాటలు రంగు లలో చిత్రీకరిస్తున్నారు.

శ్రీ ఎ. పూర్ణచంద్రరావు నిర్వహణ లలో తయారవుతున్న ఈ చిత్రంలో.... మురళీమోహన్, గిరిబాబు అనే యిద్దరు వర్ధమాన నటులను-సునందిని అనే వర్ధ మాన నటీమణిని తొలిసారిగా తెరకు పరి చయం చేస్తున్నారు.

విజయలలిత, ఒక కొత్త తరహా పాత్రను పోషిస్తున్న ఈ చిత్రంలో పద్మశ్రీ నాగయ్య, రాజబాబు, విజయ మిగిలిన ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.

సంభాషణలు: గొల్లపూడి, సంగీతం: సత్యం, దర్శకత్వం: ఐ. ఎన్. మూర్తి, నిర్వాహణ: ఎ. పూర్ణచంద్రరావు నిర్మాత: పి. వి. సుబ్బారావు, విడుదల: లక్ష్మి ఫిలింస్.

అందాల రాముడు

ఆంధ్రప్రేక్షకుల అభిమాన నాయకుడు నటసామ్రాట్ పద్మశ్రీ అక్కినేని నాగే శ్వరరావు నూతన నటి కుమారి లత, నాయకా నాయకిలగా చిత్రకల్పనావారు శ్రీ బాపు దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈస్ట్‌మన్ కలర్ చిత్రానికి "అందాల రాముడు" అని పేరు పెట్టారు. దేవీపట్నం వద్ద గోదా వరిపై జరిగిన షెడ్యూలలో షుమారు పది రీళ్ళ చిత్రం తయారైంది,

పూర్తి అవుట్ డోర్లో నిర్మించ బడు తున్న యీ చిత్రంలో గోదావరిమీద పడ వలపై ప్రయాణం ప్రత్యేక ఆకర్షణ. ఆ బోట్లలో ప్రయాణం చేస్తున్న అనేక మధ్య

తరగతి సంసారాల విచిత్ర అనుభూతులు—ఏంత మనస్తత్వాలు—వాటివలన కలిగే సుఖదుఃఖాల పరిణామాలు వాళ్ళతోబాటు డీలక్స్ బోటులపై యాత్రసాగించే ఒక ధనిక కుటుంబం, ఈ రెండు తరగతుల సంఘర్షణలు ఈ చిత్రాన్ని ఆద్యంతం రసవత్తరం వహిస్తున్నాయి. "భారతి" మాసపత్రికలో ప్రచురించబడిన "జనతా ఎక్స్‌ప్రెస్" కథలో కొన్ని పాత్రలు యీ చిత్రంలో కానవస్తాయి. అంతే తప్ప ఇది కేవలం పూర్తిగా "జనతా ఎక్స్‌ప్రెస్" మాత్రమే కాదు. ఇంతవఏకూ తయారయిన చిత్రంలో నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు మీద ఆరు పాటలు చిత్రీకరించబడ్డాయి. మరో మూడు పాటలు, ఏప్రిల్ మొదటివారంలో జరగబోయే షెడ్యూల్‌లో చిత్రీకరించనున్నారు.

మేమూ మనుషులమే

విచిత్రమైన కథను తెరకెక్కిస్తున్న వాసంతి, యిందులో నటిస్తున్న ప్రతి ఆర్టిస్టునూ ప్రత్యేక శ్రద్ధాసక్తులు వారి వారి పాత్రలపై దీసుకునేలా మలచిన తీరు ఆమె విజ్ఞతకు మచ్చుతునక! కథకు తగినట్లు ఈ చిత్రానికి. 'మేమూ మనుష్యులమే' అని పేరు పెట్టారు.

పినిశెట్టి మాటలు, ఆత్రేయ పాటలు వ్రాసిన ఈ చిత్రానికి బాపయ్య దర్శకుడు. భాస్కరరావు కెమేరా, విశ్వనాథ్ సంగీత సారథి, దిలీప్‌సింగ్ కళ: నిర్వహించారు. జగ్గయ్య, కృష్ణంరాజు, చంద్రమోహన్, కొత్తనటుడు ప్రసాద్, జమున. ప్రమీల, పుష్పలత, ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.



"జీవితం"లో
జయలలిత-శోభన్‌బాబు

ప్రముఖుల అభినందనలతో వాశిరాజు ప్రకాశం రెండవ చిత్రం ప్రారంభం

'మమతా' కార్యాలయంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమం శాస్త్రీయంగా జరిగింది. లక్ష్మి అధినేత శ్రీ బి. శివరామకృష్ణయ్య, డి. వి. ఎస్. అధినేత శ్రీ డి. వి. ఎస్. రాజు, తారలు శ్రీ శోభన్‌బాబు. శ్రీమతి శారద, శ్రీ చంద్రమోహన్,



"స్త్రీ"లో ఒక దృశ్యం

కుమారి గీతాంజలి, దర్శకులు శ్రీ విశ్వనాథ్, లక్ష్మి అడ్వర్టైయిజ్‌వారి శ్రీ ఇ. లక్ష్మణరావు, ఈ చిత్రానికి సంబంధించిన యితర సాంకేతిక నిపుణులు, మిత్రులు, శ్రేయోభిలాషులు విచ్చేశారు. చిత్రానికి సంబంధించిన రచన, పేపర్ వర్క్ ఆ రోజునే ఆరంభం చేశారు.

ఇతర భాషలలో "కాలం మారింది"

"కాలం మారింది" చిత్రం తెలుగులో శతదినోత్సవం జరుపుకొనటమేగాక, అతి త్వరలో యితర భాషల వెండితెరలను అలంకరించనున్నది. ఈ చిత్రం విడుదలవక ముందే, తన థియేటర్లలో ప్రత్యేకంగా చూసుకొన్న ఒక ప్రముఖతార ఈ చిత్రం హక్కులను అడిగారు. ఇలాగే ఇటీవలనే ఈ చిత్రాన్ని చూసిన ప్రముఖ కన్నడనాయిక కుమారి కల్పన, ఈ చిత్రాన్ని కన్నడంలో నిర్మించవలసిందని, తెలుగులో శ్రీమతి శారద ధరించిన పాత్ర తాను ధరించాలని అభిప్రాయ పడుతున్నట్లు, శ్రీ ప్రకాశంను కోరింది.

ఇతర భాషలకు సంబంధించిన ఇంత మంది పెద్దలు శ్రద్ధ చూపటం విశేషం. దీన్ని గురించి శ్రీ ప్రకాశం ప్రస్తావిస్తూ



"నేరము-శిక్ష"లో బాలయ్య, బి. ఆర్. వరలక్ష్మి.

"ఇతర భాషల్లో చిత్రాలను తీసే అభిప్రాయం నాకు లేదు. తెలుగులో నాకు అత్యంత సన్నిహితంగా వుంటూ. నను అభిమానించే మిత్రులు, ప్రముఖ తారలు శ్రీ శోభన్‌బాబు, శ్రీమతి శారద ఉండగా నాకు వేరే భాషా చిత్రాలతో అవసరం ఏముంటుంది?" అన్నారు.

'కన్న కొడుకు'

విశ్వభారతి ప్రొడక్షన్స్ వారు నిర్మిస్తున్న రెండో చిత్రానికి 'కన్న కొడుకు' అని స్థిరపరిచారు.

తను ఆ యింట్లో కేవలం నౌకరు మాత్రమే....అయినా ఆ యిల్లు తనదే. ఆ కుటుంబం తనదే...ఆ యింటి యజమానురాలు మినహాయించి - అందరూ తనను చీదరించుకునేవారే. కించపరిచే వారే! ఐనా వాళ్ళ బాగోగులు తనవి. వాళ్ళమీద ఈగైనా వాలనివ్వడు ...!

తనకు తల్లి లేదు-తండ్రి లేడు. తన తల్లీ తండ్రీ ఎవరో కూడా తనకు తెలియదు. ఆ యింటి యజమానురాలే తనకు తల్లి. ఆమె చూపులు తనకు కోటి వెలుగులు....ఆమె మాట తనకి వేదవాక్కు. తనకు తల్లీ దైవం అన్నీ ఆమే. ఆమెకు ఒక్కదానికే తెలుసు తన జన్మ



"దేశోద్ధారకులు"లో
ఎన్. టి. ఆర్, వాణిశ్రీ

రహస్యం. ఐతే పట్టవలసి వచ్చింది మూగనోము!!! నిత్య జీవితంలో తనకు జరిగే అవమానాలకూ అన్యాయాలకూ ఆమెహృదయం క్షోభిస్తోంది. క్రమంగా కృంగి పోతూంది. ఐనా నోరు విప్ప లేదు. రహస్యం చెప్పలేదు. నిస్సహాయు రాలు ఆమె!

ఇంటియజమాని మద్యాసుడు. ఆయన మొండి పట్టూ మూఢనమ్మకాలూ ఎంతో శోభాయమానంగా వెలిగి పోతూన్న సంసారాన్ని కారుచీకటి మయం చేస్తున్నాయి. వంశాన్ని ఉద్ధరిస్తాడనుకున్న చిన్న కొడుకు తండ్రి ప్రాణాలకే ఎసరు పెడతాడు. ఆ సమయంలో ఇంట్లోంచి వెళ్ళగొట్టబడ్డ 'కన్నకొడుకే' దిక్కవుతాడు!

హృద్యమైన సన్నివేశాలతో నిర్మించ బడ్డ యీ "కన్నకొడుకు" చిత్రం పూర్త యింది.

పద్మశ్రీ నాగేశ్వరరావు గుమ్మడి కృష్ణంరాజు రాజుబాబు ధూళిపాళ సాక్షి రంగారావు లక్ష్మి అంజలీదేవి సూర్యకాంతం రమాప్రభ జూ॥ కాంచన మొదలైనవారు ముఖ్యపాత్రలు నిర్వ హించిన యీ చిత్రంలో నూతన నటి 'జయకౌశల్య' కూడా నటించింది.

సంభాషణలు బొల్లిముంత. సంగీతం టి. చలపతిరావు. దర్శకత్వం వి. మధు సూదనరావు. నిర్మాత జి. రాధాకృష్ణ మూర్తి.

'చేతనా'

హిందీ చిత్రరంగంలో సంచలనాన్ని రేకెత్తించి అవార్డునందుకొని అందులో నటించిన నటీనటులకు ఖ్యాతినార్జించి పెట్టి బి. ఆర్. ఇషారా దర్శకత్వ ప్రతిభను గగన తలానికి లేపిన "చేతనా" చిత్రాన్ని శేఖర్ కంబైన్స్‌వారు ఎన్నో వ్యయ

ప్రయాసల కోర్చి తెలుగులో నిర్మించడానికి హక్కుల్ని పొందారు.

"చేతనా" చిత్రం హిందీ చిత్ర రంగంలో ఎట్టి నూతన పరిణామాలను తెచ్చిందో అందరికీ తెలిసిన విషయమే. ఆ చిత్ర విజయంతో నూతన తరహా చిత్రాలెన్నో హిందీలో నిర్మిస్తున్నారు. ఆ చిత్రవిజయంతోనే బి. ఆర్. ఇషారా ప్రపంచంలో ఏ నిర్మాతా దర్శకుడూ చేయ లేని విధంగా ఏడు రోజుల్లో 'కామనా' చిత్రాన్ని నిర్మించగలిగాడు.

జి. కె. మూర్తి దర్శకత్వం. దేవరాజ్ ఫొటోగ్రఫీ. నటనా సామర్థ్యం గల ఉత్సాహవంతులయిన కొత్తవారిని నాయికీనాయకులుగా పరిచయం చేయాలనుకొంటున్న శేఖర్ కంబైన్స్ వారి అడ్రసు 11-బి; శ్రీనివాసరావు రోడ్ మద్రాసు-17.

పద్మబాలాజీ పిక్చర్స్


పద్మ బాలాజీ పిక్చర్స్ ఔట్‌డోర్ షూటింగ్ మార్చి 20వ తేదీ నుంచి 28 వరకూ మదరాస్కు సమీపాన ప్రకృతి సౌందర్యంతో నిండిన గిండీ ఫారెస్టు తిరునీర్‌మలై కున్నత్తూరు మొదలగుచోట్ల జరిగింది. ఈ షెడ్యూల్లో విజయలలిత, రాజబాబు, సత్యనారాయణ మొదలగువారు పాల్గొన్నారు. ఈ షెడ్యూలుతో కలిపి 5 రీళ్ళకు పైగా తయారైంది. విజయలలిత



"తాత - మనవడు"లో అంజలీదేవి

ద్విపాత్రాభినయం ఈ చిత్రానికి ఒక ఆకర్షణట! ఇందులో అల్లు రామలింగయ్య, త్యాగరాజు, శ్రీధర్, బాలకృష్ణ, ముక్కామల, రామ్మోహన్, జగ్గారావు, శకుంతల మొదలగువారు పాల్గొంటున్నారు.

కథ, స్క్రీన్‌ప్లే యం. డి. సుందర్, మాటలు ఆదుర్తి నరసింహమూర్తి, సంగీతం సత్యం, సహదర్శకుడు బి. జగన్మోహన్‌రావు, నిర్మాణ నిర్వహణ కె. గోపి, దర్శకుడు విజయ్. ఆర్. పద్మిని నిర్మించు ఈ చిత్రం పూర్ణా రిలీజులోనిది.



రామవిజేతా ఫిలిమ్స్ "రామరాజ్యం"లో

సావిత్రి - జగ్గయ్య - రోజారమణి

ప్రసాద్ ఆర్ట్స పిక్చర్స్ ప్రొడక్షన్ నెం. 13

పి. ఏ. పి. సంస్థ ప్రస్తుత్వం శ్రీ ఎ. ఎన్. ఆర్. కథానాయకుడుగా శ్రీ ప్రత్యగాత్మ దర్శకత్వంలో నిర్మిస్తున్న "ప్రసాద్ ప్రొడక్షన్స్ నెం. 13" చిత్రం తాలూకు రెండు షెడ్యూల్స్ ఇంత వరకు పూర్తయినాయి. నాయకీ నాయకులమీద నాలుగుపాటలు చిత్రీకరించారు. మరో రెండుపాటలూ కొన్ని దృశ్యాలూ చిత్రీకరించడంతో మూడు వంతుల చిత్రం పూర్తవుతుందని నిర్మాత శ్రీ సుబ్బారావు చెప్పారు.

ఈ చిత్రంలో ఇంకా నాగభూషణం, రాజబాబు, రమణారెడ్డి, లక్ష్మి, సుధ, రమాప్రభ ప్రధాన భూమికలు నిర్వహిస్తున్నారు. శ్రీ భమిడిపాటి రాధాకృష్ణ సంభాషణలు, సంగీత దర్శకులు శ్రీ టి. చలపతిరావు.

JYOTI-APRIL-1973 No.114/71[N.P.

